thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 145 | కరీంనగర్ ఆదివారం, 3 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.



# స్వపక్షాల్లో విపక్షాలు!

## తెలంగాణ పొలిటికల్ గేమ్స్

హైదరాబాద్ :సాధారణంగా రాజకీయాల్లో అధికారపక్షం, ప్రతిపక్షం ఉంటాయి. కానీ.. తెలంగాణ రాజకీయాల్లో మరో స్పెషల్ కూడా ఉన్నది. అదే స్వపక్షంలో విపక్షం. పార్టీలో ఆధిపత్యం కోసం ఆరాటం. ప్రత్యర్థి పార్టీలతో పోరాడుతున్న రాజకీయ పార్టీలు.. అంతర్గత తలనొప్పులపైనా దృష్టిసారిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. ఇది తాడో పేడో తేల్చుకునే స్థాయికి వెళుతున్నాయి. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల్లో ఈ ధోరణి బలంగానే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఆ యా పార్టీల అధిష్ఠానాలకు తలనొప్పిగా తయారైంది. ఇప్పటి వరకూ పార్టీ వేదికలు, నాయకుల సమావేశాలకు పరిమితమైన ఆధిపత్యపోరు.. ఇప్పుడు రోడ్డున పడుతున్నది. ఎవరి బలం ఎంతో చాటుకునేందుకు సిద్ధం అవుతున్నారు. ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తప్పుబట్టి హాట్ టాపిక్ అయ్యారు. ఇక బీఆర్ఎస్‌లో కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. తెలంగాణ జాగృతి కార్యక్రమాలను ఆమె విస్తృతం చేస్తున్నారు. పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. మరో వైపు కమలం పార్టీ కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాటల యుద్ధం సాగుతోంది. ఇంతకాలం వీరిద్దరి మధ్య ఉన్న అంతర్గతపోరు బయటకు వచ్చింది. సై అంటే సై ఈ ఇద్దరు నాయకులు తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఎక్కువ అంటుంటారు.

కొన్ని సమయాల్లో ఇవే ఆ పార్టీ నాయకత్వానికి తలనొప్పులు కలిగిస్తున్నాయి. జూలై 18న నాగర్ కర్నూల్ జిల్లా జటప్రోలులో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చకు కారణమయ్యాయి. వచ్చే పదేళ్లు తానే తెలంగాణ సీఎంగా ఉంటానని ఆయన ప్రకటించుకున్నారు. గత ఎన్నికల అనంతరం సీనియర్లు ఆఖరు నిమిషం వరకూ ప్రయత్నాలు చేసినా.. సీఎం పీఠాన్ని అధిష్ఠానం రేవంత్‌రెడ్డికే అప్పగించింది. సీఎం ఎంపిక విషయంలో కాంగ్రెస్ నాయకత్వానిదే తుది నిర్ణయం. అయితే వచ్చే పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తప్పుబడుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ పోస్టులో కాంగ్రెస్‌లో చర్చకు దారితీసింది. క్యాబినెట్‌లో చోటు దక్కని కారణంగా రాజగోపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. సామాజిక సమీకరణాల నేపథ్యంలో క్యాబినెట్‌లో రాజగోపాల్ రెడ్డికి చోటు దక్కని విషయాన్ని కాంగ్రెస్ నాయకత్వం వివరించింది. క్యాబినెట్ విస్తరణ జరిగిన రెండు మూడు రోజులకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పదవి రాకపోయినా కార్యకర్తగానే పనిచేస్తానని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో పార్టీలో నంబర్ వన్ పొజిషన్‌లో ఉన్న సీఎంనే సవాలు చేయడం ద్వారా రానున్న రోజుల్లో చాలా పరిణామాలే చోటు చేసుకుంటాయనే సంకేతాలు రాజగోపాల్ ఇచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కమలం పార్టీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మధ్య ఢీ అంటే ఢీ అంటున్నారు. గత కొంతకాలంగా వీరిమధ్య ఉన్న అంతర్గత పోరు బహిరంగమైంది. ఒకే పార్టీలో ఉన్న వీరిద్దరికీ పొసగడం లేదు. పార్టీలో పట్టుకోసం ఈటల ప్రయత్నిస్తున్నారు. ఇద్దరూ బీసీ సామాజికవర్గానికి చెందినవారే. ఇద్దరిదీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా. బండి సంజయ్ మొదటి నుంచి బీజేపీలో ఉన్నారు. విద్యార్థి దశలో ఈటల రాజేందర్ లెఫ్ట్ పార్టీలకు అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘంలో కీలకంగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సాధనలో భాగంగా బీఆర్ఎస్‌లో చేరి.. ఆ పార్టీలో కీలక స్థానానికి ఎదిగారు. అయితే ఆ పార్టీలో కేసీఆర్‌తో ఏర్పడిన గ్యాప్.. ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చేయడానికి కారణమైంది. దీంతో బీజేపీలో చేరారు.

బీజేపీలో అమిత్ షా వంటి నాయకులతో ఆయనకు మంచి సంబంధాలున్నాయి. అయితే రాష్ట్రంలోని కొందరు నాయకులతో ఆయన ఇటీవల గ్యాప్ ఏర్పడినట్టుగా ప్రచారం సాగుతోంది. బండి సంజయ్‌తో చాలాకాలంగా ఈ గ్యాప్ ఉందనే ప్రచారం పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ ఇద్దరు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రి అమిత్ షా గతంలోనే సూచించినట్టుగా కూడా చెబుతారు. మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్ ఎంపీగా గెలవడంతో హుజూరాబాద్ కు ఆయన వెళ్లడం తగ్గించారు. అయితే హుజూరాబాద్ పై పట్టుపెంచుకొనేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారు. ఈటల రాజేందర్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన సమయంలో ఆయన అనుచరులంతా బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరారు. సంస్థాగత ఎన్నికల్లో తన అనుచరులకు ప్రాధాన్యం లేకపోవడం మొదలుకుని.. అప్పటికే రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కకపోవడం, అంతకు ముందు కేంద్ర క్యాబినెట్‌లో చోటు లభించకపోవడం వంటి అంశాలతో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో చేసిన వ్యాఖ్యలతో ఈ అసంతృప్తి బహిరంగంగా మారింది. బండి సంజయ్ నుంచి తన అనుచరులకు ఎదురౌతున్న ఇబ్బందుల నేపథ్యంలో తాడో పేడో తేల్చుకోవాలని ఈటల డిసైడ్ అయ్యారని ఆయన మాటలను బట్టి అర్థమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. బీఆర్ఎస్ రజతోత్సవ సభ గురించి ఫీడ్ బ్యాక్‌ఇస్తూ కేసీఆర్‌కు కవిత లేఖ రాశారన్న విషయం తొలుత బయటకు పొక్కగా.. ఆ తర్వాత ఏకంగా ఆ లేఖ సామాజిక మాధ్యమాలకు ఎక్కడంతో రచ్చ రోడ్డున పడింది. ఈ లీక్ పై కవిత అనుమానాలు వ్యక్తం చేశారు. కేసీఆర్ దేవుడంటూ ఆయన చుట్టూ దయ్యాలున్నాయని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. పరోక్షంగా ఆమె కేటీఆర్ పై విమర్శలు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. బీఆర్ఎస్‌లో కేసీఆర్ తనకు నాయకుడిని చెబుతూనే.. ఏ ప్రజా సంఘంలో లేని విధంగా ప్రజాసంఘంలో అనుబంధ సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దాని ద్వారా తన కార్యకలాపాలను నడిపిస్తున్నారు. ఒకప్పుడు కవిత వస్తే స్వాగతించే బీఆరెస్ నాయకులు ఇప్పుడు కనిపించడం లేదు. ఇప్పుడు జాగృతి శ్రేణులు మాత్రమే ఉంటున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం ఆర్డినెన్స్ తేవాలని రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని కవిత స్వాగతించారు. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తప్పుబట్టింది. కవితపై తీన్మార్ మల్లన్న చేసి వ్యాఖ్యల విషయంలో బీఆర్ఎస్ స్పందించలేదు. శాసనమండలిలో విపక్షనాయకుడు మధుసూదనాచారి మాత్రమే కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను తప్పుబట్టారు.

అంతేకానీ.. కేసీఆర్, కేటీఆర్ సహా ఇతరులెవరూ నోరు మెదపలేదు. దీంతో దీనిపై స్పందించే అంశాన్ని పార్టీ విజ్ఞతకు వదిలేస్తున్నానని కవిత వ్యాఖ్యానించడం ఆమెతో పార్టీకి పెరిగిన గ్యాప్‌ను స్పష్టంగా చెబుతున్నది. మరో వైపు బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ దారికే బీఆర్ఎస్ రావాల్సి ఉంటుందని చెప్పడంతో తాను వేరు, బీఆరెస్ వేరు అనే సంకేతాలు ఇచ్చినట్టయిందని విశ్లేషకులు చెబుతున్నారు. సింగరేణి బాధ్యతల నుంచి కవితను తప్పించడం పార్టీలో ఆమెకు ప్రాధాన్యం తగ్గించిన తొలి బహిరంగ చర్యగా నిలుస్తున్నది. బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా జాగృతి ద్వారా కవిత ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అవి గులాబీ పార్టీకి రాజకీయంగా ఇబ్బందిగా మారుతున్న పరిస్థితులు కూడా నెలకొన్నాయి. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అంటూనే జాగృతి ద్వారా రాజకీయ పార్టీ తరహాలో కవిత కార్యక్రమాలు నిర్వహించడం రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమయ్యాయి.

## ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు చేయొద్దు: డిప్యూటీ సీఎం భట్టి



కొల్లాపూర్: గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “కృష్ణా నదిపై భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగింది. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరఫున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.” అని అన్నారు.

## పీఎం కిసాన్ 20వ విడత నగదు విడుదల చేసిన ప్రధాని మోదీ..




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా రిలీజ్ చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకు ముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు.

**పర్యటనలో భాగంగా...** వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు.

# తగ్గేదే లే!




## అమెరికాకు ఇండియా షాక్..

## ఆ బెదిరింపులు ఇక్కడ సాగవ్, ఇది కొత్త భారత్!

అగ్రరాజ్యం అనే అహంకారంతో అడుగిడితే, అదిరిపోయే సమాధానం ఇవ్వడానికి భారత్ సిద్ధంగా ఉంది. భయపెడితే పడిపోయే బలహీన దేశం కాదు ఇది. బెదిరింపులకు తలొగ్గి, చేతులు కట్టుకుని నిలబడే రోజులు పోయాయి. ప్రపంచ రాజకీయ వేదికపై తనదైన ముద్ర వేస్తున్న సరికొత్త భారతదేశం ఇది. కొన్ని దేశాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ఆడించాలనే అమెరికా వ్యూహం ఇక్కడ పనిచేయదు. అవసరమైతే కొన్ని కష్టాలను ఎదుర్కోవడానికైనా మేం సిద్ధం. స్వాభిమానాన్ని చంపుకుని బతకడం కన్నా, ఆంక్షల నడుమ స్వతంత్రంగా నిలబడటానికే మొగ్గు చూపుతాం. రష్యా, ఇరాన్, చైనా, వియత్నాం, క్యూబా వంటి దేశాలు అమెరికా కన్నెర్రకు జడవకుండా తమ మార్గాన్ని తాము నిర్మించుకున్నాయి. ఆ తెగింపు, ఆ ధైర్యం ఇప్పుడు భారత్ నరనరాల్లో ప్రవహిస్తోంది. మమ్మల్ని ఓ పాకిస్తాన్ లాగానో, బంగ్లాదేశ్ లాగానో మార్చాలనుకుంటే అది పగటి కలే అవుతుంది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలు ప్రపంచానికి కొత్తేమీ కాదు. చైనాపై కఠినమైన ఆంక్షలు విధిస్తున్నామంటూనే, తమ దేశంలో కొరతగా ఉన్న బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ కోసం అదే చైనా వైపు చూడటం వారి అవసరవాద రాజకీయానికి నిలువుటద్దం. వారికి అవసరమైన వస్తువుల విషయంలో ఎలాంటి నిబంధనలైనా పక్కకు పెడతారు. ఇదే సూత్రం రేపు మనకు కూడా వర్తిస్తుంది. భారతదేశం ప్రపంచ ఫార్మసీగా పేరుగాంచింది. మన ఔషధాలు లేకపోతే అమెరికా ఆరోగ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుంది. ఇది కేవలం ఒక్క ఫార్మా రంగం మాత్రమే కాదు, అనేక ఇతర రంగాల్లోనూ అమెరికా మనపై ఆధారపడి ఉంది. వారి ఆర్థిక వ్యవస్థకు ఇబ్బంది కలిగించే, వారి దగ్గర ఉత్పత్తి లేని వస్తువుల కోసం వాళ్లే మన దగ్గరకు రాక తప్పదు. అందుకే, మనం భయపడాల్సిన అవసరం లేదు. మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ నుంచి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరకు, అందరి మాటల్లోనూ ఇదే నిర్భయ స్వరం వినిపిస్తోంది. వారి ప్రకటనల్లో కనిపించేది బెరుకు కాదు, 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం. అందుకే, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, దేశ ప్రయోజనాలే లక్ష్యంగా వారు గట్టిగా నిలబడుతున్నారు. బెదిరిస్తే భయపడతామనే భ్రమల నుంచి అమెరికా ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. ఇది సరికొత్త శకం, ఇది ఆత్మనిర్భర్ భారత్ శకం.



## ఆ ఇద్దరి ఒప్పందాల కారణంగానే బనకచర్ల

జోగిపేట: భారత రాష్ట్ర సమితి నేతలు కేసీఆర్, హరీశ్‌రావు గత ప్రభుత్వంలో ఏపీతో చేసుకున్న ఒప్పందాల కారణంగానే బనకచర్ల ప్రాజెక్టు తెరపైకి వచ్చిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండో రోజు జనహిత పాదయాత్ర కొనసాగుతోంది. ఉదయం జోగిపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్‌తో కవితకు ఎలాంటి సంబంధం లేదని.. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ప్రవేశపెట్టి, దాన్ని అవలంబించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని చెప్పారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా కులసర్వే జరిగింది తెలంగాణలో మాత్రమేనన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కారణంగానే అది సాధ్యమైందని పేర్కొన్నారు.

## ఎన్నికల్లో ఓడినా, గెలిచినా కాంగ్రెస్ పార్టీ ప్రజల మధ్యనే ఉంది: సీఎం రేవంత్ రెడ్డి



దిల్లీ: దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. "ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్న పార్టీ కాంగ్రెస్. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించట్లేదు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు" అని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు.



## దిల్లీ పర్యటనల్లో రేవంత్‌రెడ్డి అర్ధశతకం సాధించారు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'ఎక్స్'లో ఒకటి నుంచి 50 వరకు అంకెలు వేసి.. ఇవి కేవలం సంఖ్యలు కావు సీఎం దిల్లీ పర్యటనల వివరాలు అని పేర్కొన్నారు. హస్తిన యాత్రలో రేవంత్‌రెడ్డి అర్ధశతకం సాధించారని ఎద్దేవా చేశారు. సీఎం దిల్లీ పర్యటనల వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. "20 నెలల పదవీకాలంలో రేవంత్‌రెడ్డి 50 సార్లు దిల్లీకి వెళ్లారు. తెలంగాణకు సాధించిందేమీ లేదు.. ఉత్త మాటలు తప్ప. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. రాష్ట్రానికి పాలించే ముఖ్యమంత్రి కావాలి కానీ, దిల్లీ యాత్రలు చేసే టూరిస్టు సీఎం కాదు" అని అని కేటీఆర్ విమర్శించారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు.. మరో ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఏ3.. విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కల్యాణి, ఏ6.. ధనశ్రీ సంతోషి(అస్సాం)ను కస్టడీలోకి తీసుకున్నారు. ఉత్తర మండల డీసీపీ కార్యాలయానికి వారిని తరలించారు. ఇద్దరినీ 5 రోజుల కస్టడీకి ఇటీవల సికింద్రాబాద్ సివిల్ కోర్టు అనుమతించింది. వీరిని సరోగసీ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా విచారించనున్నారు. అంతకుముందు ఈ ఇద్దరికి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో పలువురు దంపతులను మోసం చేసి డబ్బులు దండుకున్నారు. ఏజెంట్ల సాయంతో అస్సాంకు చెందిన మహిళల నుంచి పిల్లలను కొనుగోలు చేసి తీసుకొచ్చి దంపతులకు వారి బిడ్డగా అప్పగించారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా వీర్యం, అండాలు సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించారు.

## బీసీల హక్కులను కాంగ్రెస్ పార్టీ కాలరాస్తోంది: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కానీ బీసీ నేతను ముఖ్యమంత్రి చేశారా అని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. నగరంలోని ఇందిరాపార్క్ వద్ద భాజపా ఓబీసీ మోర్చా మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పేరుతో రాజకీయం చేయాలని చూస్తోందని.. బీసీలకు ఎక్కడ ప్రాధాన్యమిచ్చిందని నిలదీశారు. తొమ్మిది మంది కార్పొరేషన్ ఛైర్మన్లను నియమిస్తే ఒక్క బీసీ నేతకు మాత్రమే అవకాశమిచ్చారని విమర్శించారు. క్యాబినెట్‌లో కేవలం ముగ్గురు బీసీ మంత్రులు మాత్రమే ఉన్నారన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. 42 శాతం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే ఇవ్వాలని, ఇతర మతాల వారిని కలపొద్దని డిమాండ్ చేశారు. బీసీల హక్కులను ఎంఐఎం పార్టీ హరిస్తోందని, కాంగ్రెస్ కాలరాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీలు పోరాడాల్సిన అవసరముందన్నారు.



## భారత్‌ది డెడ్ ఎకానమీయా..? ఏఐ ఏం చెప్పిందంటే..

ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెప్పగలవు. ఈ క్రమంలోనే భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. అవి ఏం చెప్పాయంటే.. 'భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్.

ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది. 'లేదు. భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి'- గ్రోక్. 'భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' - జెమిని. ఇక ✓, మెటా ఏఐ, కోపైలట్‌లు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి.

**మావద్ద తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయి.. అమెరికా హెచ్చరికలపై రష్యా...** రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందనే కారణంతో భారత్‌పై 25శాతం సుంకం, పెనాల్టీలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చుకునే అవకాశముందన్నారు. వారు ఎలాంటి వాణిజ్య సంబంధాలు కుదుర్చుకున్నా పట్టించుకోనన్నారు.

ఈ వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ మాటలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ఆ విషయాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు సైతం తప్పుబట్టడం గమనార్హం.



## ఆటోపైలట్ తప్పిదం టెస్లాకు రూ.2100 కోట్ల జరిమానా

అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లాకు భారీ జరిమానా పడింది. 2019 నాటి రోడ్డు ప్రమాదం కేసులో టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధరించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో దాదాపు రూ. 2,100కోట్లు) చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడ్డారు.

2019లో ఫ్లోరిడాలోని కీ లార్గోలో ఈ ఘటన చోటుచేసుకుంది. జార్జ్ మెక్‌గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళ్తూ అధునాతన ఆటోపైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు.

ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యలో తన మొబైల్ ఫోన్ కారులో కింద పడిపోయింది. ఎలాగూ కారు ఆటోపైలట్ మోడ్‌లోనే ఉందని భావించిన జార్జ్.. కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు.

**కార్ల విక్రయ 'గిరాకీకి' బ్రేకులు...** ఆ సమయంలో కారు అదుపుతప్పి పక్కనే పార్క్ చేసి ఉన్న ఓ కారును ఢీకొట్టి ఇద్దరు వ్యక్తుల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద తీవ్రతకు యువతి మృతదేహం 75 అడుగుల దూరంలో ఎగిరిపడింది. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుదీర్ఘ విచారణ తర్వాత తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ ప్రమాదానికి గానూ బాధితుల కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి ఓ కారణమేనని గుర్తించిన కోర్టు.. ఇందుకు గానూ పరిహారంలో మూడోవంతు అంటే దాదాపు 242 మిలియన్ డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. మిగతా మొత్తం సదరు వాహన డ్రైవర్ ఇవ్వాలని స్పష్టంచేసింది. అయితే, ఈ తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.



## ఇన్నోవా కారులో ఆవుల అపహరణ

హైదరాబాద్: ఓ ముఠా ఇన్నోవా కారులో వచ్చి ఆవులను అపహరించిన ఘటన సికింద్రాబాద్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండిమెట్ ప్రాంతంలో ఆవుల దొడ్ల వద్దకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు.. వాటికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఇన్నోవా కారు వెనుక భాగంలో వేసుకొని పరారయ్యారు. యువకులు ఆవులను తీసుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. మారేడుపల్లిలో కూడా నిన్న రాత్రి ఇలాంటి ఘటనే చోటు చేసుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆవులను ఎక్కడికి తీసుకెళ్తున్నారు? యువకులు ఎవరనే కోణంలో విచారణ చేస్తున్నారు.

## నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద పాలనురుగులా ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పాలనురుగులా ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద కారణంగా జలాశయంలో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో అధికారులు 24 క్రస్టు గేట్లను 5 అడుగులు, 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 2,47,161 క్యూసెక్కులు కాగా.. ప్రధాన విద్యుత్ ఉత్పత్తికేంద్రం, కుడి, ఎడమ కాలువలతోపాటు జలాశయం నుంచి మొత్తం 2,57,178 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 585.10 అడుగులకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 297.11 టీఎంసీలుగా నమోదు అయ్యింది.



## మా వద్ద తగినన్ని అణు జలాంతర్గాములు

రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ హెచ్చరికలకు ప్రతిస్పందనగా.. ఆ దేశానికి చేరువలో సముద్ర జలాల్లో రెండు అణు ాంతర్గాములను అమెరికా మోహరించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా రష్యా పార్లమెంటు సభ్యుడు విక్టర్ వోడోలాట్‌స్కీ స్పందిస్తూ.. తమ వద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

ఈమేరకు పలు మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. అమెరికాను ఎదుర్కొనేందుకు తమవద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే మహాసముద్రాల్లో యూఎస్ జలాంతర్గాముల సంఖ్య కంటే తమవి చాలా ఎక్కువని వెల్లడించారు. వారు మోహరించినవి తమ జలాంతర్గాముల నియంత్రణలో ఉన్నాయన్నారు. కాబట్టి.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలకు ప్రతిస్పందించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఇక, దీనిపై గ్లోబల్ అఫైర్స్ మ్యాగజైన్ రష్యా ఎడిటర్ ఇన్‌చీఫ్ ఫ్యోడర్ లుక్యానోవ్ మాట్లాడుతూ.. ట్రంప్ హెచ్చరికలను ప్రస్తుతానికి తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదన్నారు. అంతకుముందు మాస్కో, వాషింగ్టన్‌ల మధ్య ప్రత్యక్ష సైనిక ఘర్షణలు జరగకూడదని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వాదనతో తాను ఏకీభవిస్తానని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ పేర్కొన్నారు.

**రష్యా సమీపంలోకి అమెరికా అణు జలాంతర్గాములు!..** రష్యాకు చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని ఆదేశించానని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. దిమిత్రీ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేసినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుత పరిణామాల్లో అలాంటివి జరగవని ఆశిస్తున్నానన్నారు.

# భావితరాలకు స్ఫూర్తి ప్రదాయకాలు... వేగుంట మోహన ప్రసాద్ రచనలు

## - ఆగస్టు 3.. వేగుంట మోహన ప్రసాద్ వర్ధంతి



వేగుంట మోహన ప్రసాద్ (జనవరి 5, 1942 – ఆగస్టు 3, 2011) తెలుగు సాహిత్య లోకానికి తనదైన ముద్రవేసిన మహోన్నత కవి, రచయిత, సాహితీ వేత్త, అనువాదకుడు. ఆయన రచనలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించు కోవడమే కాక, భాషా ప్రేమికుల హృదయాలలో నిలిచి పోయాయి.

**జీవితం...** 1942, జనవరి 5న ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామంలో జన్మించారు. ఆయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా వట్లూరు.

**విద్యార్హతలు:** ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఏ. పట్టా పొందిన ఆయన, విజయవాడ సిద్ధార్థ కళాశాలలో ఆంగ్ల ఉపన్యాసకునిగా పనిచేశారు. అంతకు ముందు, నైజీరియాలో మూడేళ్లపాటు ఆంగ్ల ఉపాధ్యాయుడిగా సేవలందించారు.

**కుటుంబం:** ఆయనకు భార్య సుజాత మరియు కుమార్తె మమత ఉన్నారు. చివరి జీవన దశ: ఉద్యోగ విరమణ తర్వాత కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం అనువాద విభాగానికి అధిపతిగా పనిచేశారు.

**సాహిత్య సేవలు...** వేగుంట మోహన ప్రసాద్ కేవలం కవి మాత్రమే కాదు, అనేక సాహిత్య ప్రక్రియల్లో తన ప్రతిభను ప్రదర్శించారు.

**కవిత్వం:** 1960లో భారతి పత్రికలో ప్రచురితమైన "హిమానీహృది" ఆయన మొదటి కవిత. ఆయన కవిత్వం జీవితం, మరణం, ప్రేమ, సామాజిక అన్యాయాలను ప్రతిబింబించింది.

**అనువాదాలు:** తెలుగు సాహిత్యాన్ని ఆంగ్ల పాఠకులకు పరిచయం చేయడంలో ఆయన అనువాదాలు కీలకంగా మారాయి. అనేక దేశీయ, విదేశీ కవితలను అనువదించి, తెలుగు పాఠకులకు అందించారు.

**వ్యాసాలు:** కరచాలనం అనే వ్యాస మాలిక ద్వారా ప్రపంచ ప్రసిద్ధ కవులను తెలుగు వారికి పరిచయం చేశారు.

**ప్రముఖ రచనలు...** కవితా సంపుటాలు: చితి–చింత (1969), పునరపి (1993), సాంధ్యభాష (1999), నిషాదం, వెన్నెల నీడలు (2004). చవిటి పర్ర (టీఎస్ ఇలియట్ "వేస్ట్ ల్యాండ్" అనువాదం).

**అవార్డులు, గౌరవాలు ...** 1969లో ఆయన తొలి కవితా సంకలనం చితి–చింతకు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు లభించింది. చివరి కవితా సంపుటి నిషాదంకు తణికెళ్ల భరణి అవార్డు అందించారు.

**అవయవ దానం – మానవతా దృక్పథం...** 2011లో మోహన్ ఫౌండేషన్ ద్వారా ఆయన తన మూత్రపిండాలు, కాలేయం, కళ్ళు దానం చేస్తానని జీవితకాలం లోనే సంకల్పించారు. వేగుంట మోహన ప్రసాద్ మరణానంతరం ఈ కోరికను కుటుంబ సభ్యులు నెరవేర్చారు. వేగుంట మోహన ప్రసాద్ తెలుగు సాహిత్య చరిత్రలో ఒక వెలుగురాశి. ఆయన రచనలు భావితరాలకు స్ఫూర్తి ప్రదాయకంగా నిలుస్తాయి. సమాజానికి, సాహిత్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. తెలుగు భాషాభిమానం కలిగిన ప్రతి ఒక్కరికీ ఆయన రచనలు మార్గదర్శకాలుగా నిలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**




పాకిస్థాన్ నేత బిలావల్ భుట్టో అమెరికాలో శాంతి వచనాలు పలకడంపై భాజపా ఎంపీ తేజస్వీ సూర్య అభ్యంతరం వ్యక్తంచేశారు. వారి నోటి నుంచి శాంతి వచనాలు రావడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం అమెరికాలో ఉంది. ఈసందర్భంగా వాషింగ్టన్ డీసీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తేజస్వీ సూర్య ఈ వ్యాఖ్యలు చేశారు. 'భుట్టో తమను తాము శాంతి ప్రతినిధుల బృందంగా పేర్కొంటున్నారు. అంతేకాక.. ఆయన శాంతివచనాలు కూడా పలుకుతున్నారు. ఇది చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉంది.

పాకిస్థాన్ నకిలీ హీరోలను తయారుచేసేందుకు ప్రయత్నిస్తోంది. యుద్ధంలో విఫలమైన వారికి ఫీల్డ్ మార్షల్స్‌గా పదోన్నతి కల్పించింది. వారికి నిజమైన హీరోలు ఎలా ఉంటారో తెలియదు. చైనాకు చెందిన చౌకైనా ఆయుధాలతో పాక్ నెట్టుకొస్తోంది. కాబట్టి మా దేశంలోని అత్యాధునిక ఆయుధాలు, మా బలగాలు, బలమైన ప్రజాస్వామ్య నాయకత్వాన్ని జీర్ణించుకోవడం వారికి కష్టమే' అని సూర్య పేర్కొన్నారు. ఆరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన భారత అఖిలపక్షం తరహాలో పాక్ కూడా తన విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ఆధ్వర్యంలో ఓ ఎంపీల బృందాన్ని ఏర్పాటుచేసింది. వీరిని అమెరికాకు పంపగా, ఆ పర్యటనలో భాగంగా న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయంలో భుట్టో మాట్లాడారు. భారత్, పాక్‌కు చెందిన నిఘా సంస్థలు పరస్పర సహకారంతో పనిచేస్తే ఉగ్రపీడ గణనీయంగా తగ్గుతోందన్నారు. అణ్వస్త్ర దేశాలైన భారత్–పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ అనంతరం యుద్ధ పునరుద్ధరణకు అవకాశాలు పెరిగాయే తప్ప తగ్గలేదని అభిప్రాయపడ్డారు.

సింధూజలాల ఒప్పంద నిలిపివేత ద్వారా భారత్ నదీ జలాలను ఆయుధంగా ఉపయోగిస్తోందని విమర్శించారు. దౌత్యం, సంప్రదింపులే శాంతికి మార్గాలనీ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పరస్పర సహకారంతోపాటు పలు ఇతర అంశాలపై భారత్‌తో విస్తృత చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని బిలావల్ అన్నారు.




'నరేందర్.. సరెండర్' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ఎప్పుడూ మూడో పక్షం జోక్యం లేదని ఆయన పేర్కొన్నారు. అఖిలపక్ష ఎంపీల బృందం వాషింగ్టన్ డీసీ చేరుకొన్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణకు దౌత్యం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరచూ వ్యాఖ్యానించడం.. మరోవైపు రాహుల్ వ్యాఖ్యల నేపథ్యంలో.. వాషింగ్టన్‌లో మీడియా థరూర్‌ను ప్రశ్నించింది. దీనికి ఆయన స్పందిస్తూ "భారత్ యుద్ధం ఆపటానికి ఎవరి హితబోధ అవసరం లేదు. పాకిస్థాన్ ఆపిన వెంటనే మేము నిలిపేస్తామని చెబుతూనే ఉన్నాం. అప్పటికే మేము ఆగేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ విషయాన్ని పాక్‌కు కూడా చెప్పాము. మీరు ఆపడం మంచిదని.. భారతీయులు ఆగేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పాం. అదే వారు చేసింది" అని పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొని రాహుల్ ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే.. మోదీకి ట్రంప్ ఫోన్ చేసి మోదీజీ.. ఏం చేస్తున్నారని అడిగారు. నరేందర్.. సరెండర్ అనగానే మోదీ కాల్పుల విరమణ ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలను తూచా తప్పకుండా మోదీ పాటించారు " అని విమర్శించారు. 1971లో ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులను కూడా లెక్క చేయకుండా.. పాక్‌తో పోరాడారని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలు సైనిక దళాలకు, దేశానికి తీవ్ర అవమానమని.. దేశ ద్రోహానికి తక్కువేం కాదని భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా పేర్కొన్నారు. "రాహుల్‌గాంధీ! మీరు, మీ పార్టీ, మీ నేతలు లొంగిపోయి ఉంటారు. ఎందుకంటే మీ చరిత్ర అదే. అది కాంగ్రెస్ పార్టీ నిఘంటువులో, మీ డీఎన్‌యేలోనే ఉంది. ఉగ్రవాదానికి, షర్మ్–అల్–షేక్‌కు, శిమ్లాలో చర్చలకు లొంగిపోయింది మీరు. దేశ విభజన సమయంలో ముస్లింలీగ్‌కు లొంగింది మీరు. సింధూ నదీ జలాల ఒప్పందానికి లొంగిపోయింది కూడా మీరే" అని 'ఎక్స్'లో వరస పోస్టుల్లో నడ్డా విరుచుకుపడ్డారు.

# భక్తి కవిత్వానికి సజీవ రూపం...తిరుమల వెంగమాంబ

## శ్రావణ శుక్ల నవమి తరిగొండ వెంగమాంబ వర్ధంతి



శ్రావణ శుక్ల నవమి... తెలుగు ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతిలో ఒక పవిత్రమైన గుర్తింపును కలిగిన రోజు. ఈ రోజు, తెలుగు సాహిత్యపు భక్తి కవిత్వానికి శ్రీరామరక్ష వలె నిలిచిన తరిగొండ వెంగమాంబ (20 ఏప్రిల్ 1730 – 21 ఆగష్టు 1817), శ్రావణ శుద్ధ నవమి వర్ధంతి సందర్భంగా, ఆమె సాహిత్య సేవను, ఆధ్యాత్మిక తపోబలాన్ని, సామాజిక ధైర్యాన్ని స్మరించుకోవడం అనివార్యం. ఆమె జీవిత ధారలు భక్తి, ధర్మం, సాహిత్యం అనే మూడు నదుల సంగమంగా కళకళ లాడింది. ఆమె తన రచనలతోనే కాదు, తన జీవన శైలితోనూ సమాజానికి ఒక మార్గదర్శిని అయ్యారు. ? 1730లో చిత్తూరు జిల్లాలోని తరిగొండ గ్రామంలో జన్మించిన వెంగమాంబ చిన్ననాటి నుంచే ఆధ్యాత్మికత పట్ల ఆకర్షణ కలిగి ఉండేవారు. సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా, లౌకిక జీవితాన్ని విస్మరించి, పరమాత్మపై అఖండ నమ్మకంతో జీవించారు. బాల్యంలోనే వివాహం జరిగినప్పటికీ, ఆమె భర్తపై మమకారం కన్నా వేంకటేశ్వరుని మీదే ఆమె మనస్సు నిలిచింది. భర్త మృతి చెందిన తరువాత తన జీవితాన్ని పూర్తిగా స్వామివారి సేవకు అంకితం చేశారు. అప్పటి సమాజం ఆమె ధర్మ నిష్ఠ, దైవ సేవా ప్రవృత్తికి అడ్డంకులు సృష్టించినా, ఆమె నిబద్ధత పట్ల మాత్రం అడ్డంకి కలగ లేదు. సమాజపు విమర్శల మధ్య దైవాను బంధంతో ముందుకు సాగిన ఆమె జీవితం ఒక శక్తివంతమైన స్ఫూర్తి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారు ఆమె భక్తిని అంగీకరించి కలలో ప్రత్యక్షమై స్వయంగా తిరుమలకు రావాలని ఆదేశించినట్లు పురాణ కథనాలు పేర్కొంటాయి. స్వామివారి ఆజ్ఞను శిరసావహించి, ఆమె తిరుమల కొండపై అడుగుపెట్టి, స్వామి దర్శనానికై తన జీవితాన్ని అంకితం చేశారు. ఆలయ అధికారులు మొదట ఆమెకు నిరాకరించినా, ఆమె తపస్సుతో కూడిన భక్తి తేజం ముందు వారు మోకరిల్లారు. ఆలయ వెలుపల ఒక గుహలో నిరాడంబరంగా జీవిస్తూ, నిత్య సేవలు, అన్నదానాలు, సంగీత కీర్తనలతో తన జీవనాన్ని అంకితం చేసిన ఆమె, తిరుమల నిత్య వాసిగా మారారు. ఆమెపై శ్రీవారి అనుగ్రహం ఎంత దూరం వ్యాపించిందంటే, ఆలయంలో రాత్రివేళ ఏకాంతసేవ అనంతరం వెంగమాంబకు తాంబూల ప్రదానం చేసే సంప్రదాయం కూడా ఆవిర్భవించింది. ఇది నేటికీ కొనసాగుతున్న పూజానుష్ఠానం. వెంగమాంబ రచనలు భక్తి కవిత్వానికి గాఢతను, గాంభీర్యాన్ని చేకూర్చాయి. భగవద్భక్తి, శ్రీవారి వైభవం, ఆత్మవిశ్వాసం, నమ్మకం అనే భావాలన్నింటిని అత్యంత హృద్యంగా వ్యక్తీకరించిన ఆమె రచనలు ఆధ్యాత్మికతకు మాత్రమే కాకుండా, సాహిత్య చరిత్రకూ విలువైన సంపదగా నిలిచాయి. ఆమె రచనలలో యక్షగానాలు, ఆధ్యాత్మిక గేయాలు, పద్య కృతులు, పద్య కావ్యాలు, ద్విపద కావ్యాలు, తాత్విక కావ్యాలు వంటి వివిధ సాహితీ ప్రక్రియలు దర్శనమిస్తాయి. తాత్విక కావ్యాలలో రాజయోగామృతసారం గొప్పగా పేరు పొందింది. నృసింహ విలాసము, విష్ణు పారిజాతము, చెంచు నాటకం, శ్రీ రుక్మిణీ నాటకం, బాలకృష్ణ నాటకం, జల క్రీడా విలాసం, ముక్తి కాంత విలాసం మొదలయిన యక్ష గానాలను అద్భుతంగా లిఖించారు. వాసిష్ఠ రామాయణం, రమా పరిణయం, ద్విపద భాగవతం వంటి కావ్యాలను దేశీ ఛందస్సు రూపమయిన 'ద్విపద'లో వ్రాశారు. 'శ్రీకృష్ణ మంజరి' స్తుతి కావ్యాన్ని 'భక్త సంజీవని' పత్రికలో 1929 జనవరిలో ముద్రించారు. నృసింహ శతకంలో 103 పద్యాలను . 'దరికొండ నృసింహ దయా పయోనిధీ' అనే మకుటంతో రాసారు. ఆమె రచనలు, ఆమె లోకోత్తర ఆధ్యాత్మిక భావావేశానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. వెంగమాంబ రచనల శైలిలోని ప్రత్యేకత ఏమిటంటే, అవి శైలీ బద్ధంగా ప్రాసలతో, అలంకారాలతో నిండి ఉన్నప్పటికీ సామాన్య భక్తుడికి అర్థమయ్యేలా ఉంటాయి. ఆమె పద్యంలో ప్రవహించే అనుభూతి, వినిపించే సంగీతం వలె మధురంగా ఉండేది. అంతేకాక, ఆమె రచనల్లో భక్తి శృంగారంతో సమన్వయమై, భక్తుని భగవంతునిపై ప్రేమను, పరాకాష్ఠ లోని పూర్ణ సమర్పణను ఉదాత్తంగా ప్రతిబింబిస్తుంది. ఆమెపై సాంప్రదాయవాదుల విమర్శలు ఎదురైనా, ఆమె వాటిని ధైర్యంగా ఎదుర్కొని, తిరుపతి దేవస్థాన సంప్రదాయాలలో తాను ఏర్పరచిన ముద్రను శాశ్వతంగా నిలిపారు. తిరుమలలో ఆమె పేరు మీద ఏర్పాటు చేసిన వెంగమాంబ మఠం, ఆమెకు కలిగిన గౌరవానికి ప్రతీక. ప్రతి సంవత్సరం శ్రావణ శుక్ల నవమి రోజున తిరుమలలో ఆమెకు ఘనంగా నిర్వహించే వర్ధంతి ఉత్సవాలు, ఆమె సాహిత్య పట్ల, ఆధ్యాత్మికత పట్ల సమాజం కలిగిన గౌరవాన్ని ప్రతిబింబిస్తాయి. వెంగమాంబ జీవితం మనకు చెప్పే ముఖ్యమైన సందేశం ఏమిటంటే, ఒక మహిళకు సామాజిక ఆంక్షలు ఎంతెంత ఉన్నా, ఆత్మ బలంతో, దైవ నిష్ఠతో, సాహిత్య నైపుణ్యంతో ఆమె ఎలా శాశ్వత స్థానం సంపాదించగలదో ఆమె ఉదాహరణ. ఆమె జీవితం ఒక మార్గదర్శిని మాత్రమే కాకుండా, మన జీవన విధానంలో భక్తికి ప్రాధాన్యం కల్పించాలన్న బోధన. ఈ శ్రావణ శుక్ల నవమి సందర్భంగా తరిగొండ వెంగమాంబను స్మరించుకోవడం అంటే కేవలం ఒక మహనీయురాలిని గుర్తించడమే కాదుబీ ఆమె సాహిత్యాన్ని చదవడం, ఆధ్యాత్మిక భావనలను మన జీవనంలో అనుసరించడం, సమాజానికి ఏవిధంగా నిష్కామ సేవ చేయాలో గ్రహించడం. ఆమె వెలిగించిన భక్తి దీపం, తెలుగు భాషా పూజారులకు మార్గదర్శిగా శాశ్వతంగా వెలుగులీనుతూ ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# నరేంద్ర మోడీ ...ఆరెస్సెస్ మధ్య అంతరం పెరుగు తోందా!?



భాజపా – ఆరెస్సెస్ అనుబంధం భారత రాజకీయంలో అత్యంత ఆసక్తికరమైన, శక్తివంత మైన సంబంధాల్లో ఒకటి. జనసంఘం కాలం నాటికే ఆరంభమైన ఈ అనుబంధం, భారతీయ జనతా పార్టీ స్థాపన తర్వాత మరింత బల పడింది. ఆరెస్సెస్‌లో సేద్యం చేసిన కర్షకులు, పౌర అభ్యుదయమే లక్ష్యంగా భావించే స్వయం సేవకులు, భాజపాలో కీలక స్థానాల్లోకి వచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నుంచి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఆరెస్సెస్ ప్రభావం స్పష్టంగా కనిపించేది. కానీ, నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధానిగా పదవిలోకి వచ్చిన తర్వాత ఆయన పాలనా శైలి, ఆరెస్సెస్ భావజాలం మధ్య తేడాలు కనబడుతున్నాయని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆరెస్సెస్, సిద్ధాంతపరంగా నూతన భారత నిర్మాణంలో 'సంస్కార' ప్రాతిపదికగా సామాజిక మార్పు, హిందుత్వ విలువల ప్రచారం ద్వారా జాతి నిర్మాణాన్ని కోరుతుంది. కానీ మోదీ పాలన నిత్య రాజకీయ దృష్టితో ముందుకు సాగుతున్నది. ఆయన నూతన భారత నిర్మాణంలో సామాజిక పరిమాణాల కన్నా రాజకీయ విజయమే ప్రధాన లక్ష్యంగా మారింది. ముఖ్యంగా ప్రజల మద్దతుతో కూడిన శక్తిమంతమైన నరేంద్ర మోదీ బ్రాండ్ నిర్మాణం, నిత్యం ఎన్నికల మూడ్, మెగా స్కీమ్‌లు, హిందూ ఓటు బ్యాంకు సమీకరణం వంటి అంశాలు గణనీయంగా మారాయి. ఈ క్రమంలో భాజపా కార్యనిర్వాహక నియంత్రణ ఆరెస్సెస్ చేతిలో ఉండకుండా, ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ కేంద్రీకృతమవుతోంది. నరేంద్ర మోదీ నియామకాలు, భవిష్యత్ రాజకీయ వారసత్వంపై తనదైన శైలి ప్రవేశ పెడుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలి మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ కేబినెట్ ఎంపికలో ఆరెస్సెస్ సూచనలు పూర్తిగా ప్రతిఫలించలేదనే విమర్శలు ఉన్నాయి. విశేషంగా, మురళీధర్ రావు, సంజయ్ మయుఖ్ వంటి స్వయం సేవకుల అభ్యర్థిత్వం పక్కన పెట్టడమే కాక, సంస్కృతి, విద్య, సమాజ సేవ రంగాలకే చెందిన వారికీ తక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాక, బిఎల్ సంతోష్ వంటి సంఘ ప్రచారకులు ఇప్పటికే పార్టీ పొలిటికల్ కంట్రోల్ నుంచి పక్కకు నెట్టబడ్డారని వాదనలు వచ్చాయి. దీంతో, ఆరెస్సెస్ మౌనం తప్ప మరో ప్రకటన చేయలేదు. ఇక ఆరెస్సెస్ సిద్ధాంతాలపై కేంద్రం దృష్టి మరిచిందని విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్కృత భాషా అభివృద్ధి, ధర్మాచార్య వ్యవస్థకు ప్రోత్సాహం, ఆరెస్సెస్ అనుబంధ విద్యా సంస్థలకు నిధుల అనుకూలత వంటి రంగాల్లో మోదీ హయాంలో అనేక ఆశలున్నప్పటికీ, వాటి అమలులో చురుకుదనం తగ్గిందని సంఘ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాక, నూతన విద్యా విధానం, యూనిఫాం సివిల్ కోడ్, జనాభా నియంత్రణపై చట్టాలు వంటి హిందుత్వ సంబంధిత ముఖ్య రంగాల్లో తక్షణ చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంతో, ఆరెస్సెస్ లో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయం వ్యాపక మవుతోంది. ఈ నేపథ్యంలో, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల పదే పదే చేస్తున్న వ్యాఖ్యలు గమనించదగ్గవే. రాజకీయ నాయకులు వయసు 75 దాటిన తరువాత పదవులు వదిలిపోవాలని, తద్వారా యువతకు అవకాశం కల్పించ బడాలని ప్రకటించారు. ప్రధాని మోదీ కూడా 75కి చేరుతున్నందువల్ల, ఇది ప్రత్యక్ష సంకేతమా అనేదీ విమర్శలు ఉన్నాయి. ఆయన్ని స్వయంగా మోదీ కలవక పోవడం, భాజపా అగ్రనేతలు కోపతాపాలకు లోనై ,స్పందించక పోవడం అన్నీ రాజకీయ విశ్లేషకుల దృష్టికి వచ్చాయి. 'ఆసక్తికరమైన సమాజం కోసం రాజకీయాలు మారాలి', 'దేశ భవిష్యత్ కోసం మత సామరస్యమే మార్గం', 'నిర్బంధం కాదు, నైతికతే ముఖ్యమని' భాగవత్ పలుమార్లు చెప్పడం ద్వారా మోదీ పాలనను వ్యంగ్యంగా విమర్శించినట్టు భావన కలుగుతోంది. మోదీ కేంద్రీకృత పాలన విధానం, మంత్రివర్గ వ్యవహార శైలి, ఆయా రాష్ట్రాల భాజపా ముఖ్యమంత్రుల ఎంపికలో ఆరెస్సెస్ పాత్ర తగ్గిపోవడం వంటి అంశాలు ఈ వివిధాంతరాన్ని మరింత స్పష్టంగా చేస్తున్నాయి. అయితే ఇది పూర్తిగా విభేదం కాదు. మోదీ–ఆరెస్సెస్ మధ్య సంబంధం మౌలికంగా ఒకే భావజాలపు పునాది మీద నడుస్తున్నా, దాని కార్యరూపాలు, ప్రామాణికతల్లో తేడాలు రావడం సహజం. ప్రధానిగా మోదీ రాజకీయ అవసరాల దృష్టితో నిర్ణయాలు తీసుకుంటే, ఆరెస్సెస్ దాన్ని ధర్మ, సంస్కృతి, సంయమనం అనే పరిమాణాలతో పరిశీలిస్తుంది. అందువల్ల, ఈ అంతరం వాస్తవమే అయినా, అది శాశ్వత శత్రుత్వానికి దారితీయదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. భాజపా – ఆరెస్సెస్ బంధం అనుబంధంగా పుట్టినదే. కానీ మోదీ బ్రాండ్ అధికంగా మూర్తిమత్వం చెందుతున్న ఈ కాలంలో ఆ అనుబంధం క్రమంగా బలహీన పడుతున్నదని విశ్లేషకుల భావన. భావజాలం ఒకటే అయినా, దానిని ఆచరణలోకి తీసుకు రావడంలో మోదీ దారిలో ఆరెస్సెస్ నడవటం కష్టమవుతోంది. ఇది భారత రాజకీయాల్లో ఓ మౌలిక మార్పుగా పరిగణించ వచ్చు. మోదీ తర్వాత భాజపా – సంఘ పరస్పర సంబంధాలు ఎటు పోతాయన్నది ఆసక్తికరమైన ప్రశ్నగా నిలుస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# చురకలు

## సంపాదకీయం

### బీహారీ బాబు నితీష్ కి చెక్ పెడుతున్న బీజేపీ ?

బీహార్ లో నితీష్ కుమార్ ముఖ్యమంత్రిత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందా అంటే ఆ సంగతి కొద్ది నెలలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు చెప్పాలి. అయితే దాని కంటే ముందు బీజేపీయే నితీష్ ని ముఖ్యమంత్రి అభ్యర్థిగా తప్పించేందుకు వ్యూహరచన చేస్తోంది అని అంటున్నారు. దానికి అనేక కారణాలు ఉన్నాయని చెబుతున్నారు నితీష్ కుమార్ ఏకంగా పాతికేళ్ళగా బీహార్ పీఠం మీద ముఖ్యమంత్రిగా పాతుకుని పోయారు. దాంతో జనాలలో కొత్త ఆలోచనలు వస్తున్నాయని తాజా సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**లాలూ కుమారుడి వైపు మొగ్గ :** బీహార్ లో చూస్తే రాజకీయ దృశ్యం మెల్లగా మారుతోంది. అక్కడ ఆర్జేడీ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమి బలంగా ఉంది. వాస్తవానికి 2020లోనే కూటమి నెగ్గాలి. కానీ బీజేపీ నితీష్ కాంబో బలంగా ఉండడం, మోడీ చరిష్మా నితీష్ పాలన అన్నీ కలసి ఎడ్జ్ లో ఎన్డీయే కూటమికి విజయాన్ని అందించాయి. అయితే ఈ అయిదేళ్ళలో పెరిగిన యాంటీ ఇంకెంబెన్సీ ఈ సమయంలోనే ఎన్డీయే ఇండియా కూటముల మధ్యకు మారుతూ నితీష్ మూడు సార్లు సీఎం గా ప్రమాణం చేయడం వల్ల ఆయన నిలకడ లేని రాజకీయ నాయకుడిగా జనంలో పేరు తెచ్చుకున్నారని అంటున్నారు. అలా నితీష్ ఇమేజ్ బాగా తగ్గిందని సర్వే నివేదికలు చెబుతున్నాయి.

**కాబోయే సీఎం గా :** అదే సమయంలో లాలూ కొడుకు ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ కే జనాలు ఎక్కువ ఆదరణ చూపిస్తున్నారని సర్వే ఫలితాలు చెబుతున్నాయి. స్టేట్ వైబ్ సర్వే ఆఫ్ బీహార్ తాజాగా చేసిన సర్వే ప్రకారం చూస్తే కనుక నితీష్ కి ప్రజాదరణ గణనీయంగా తగ్గిందని అంటున్నారు. ఈ సర్వే కులాల వారీగా తీసుకుని చేసింది. దీని ప్రకారం చూస్తే కేవలం 25 శాతం మంది మాత్రమే నితీష్ ని తరువాత సీఎం గా కోరుకుంటున్నారు. తేజస్వీ యాదవ్ ని సీఎం గా చూడాలని 32.1 శాతం ప్రజలు కోరుకోవడం విశేషం. ఇక ఎస్టీలు 38 శాతం, 27 శాతం ఎస్సీలు ముస్లింలు, 24 శాతం ఉన్నత వర్గం హిందువులు, 21 శాతం ఓబీసీలు ఉన్నారని తేలింది. అలాగే తేజస్వీ యాదవ్ విషయం తీసుకుంటే యాభై శాతం పైగా ముస్లింలు ఆయనే కాబోయే సీఎం అని అంటున్నారు.

**ట్విస్ట్ ఇక్కడే ఉందిట :** ఇక బీజేపీ సొంతంగా ముఖ్యమంత్రి అభ్యర్ధిని ప్రకటిస్తే ఆ పార్టీ సీఎం ని చూడాలని 33.7 శాతం మంది కోరుకుంటున్నట్లుగా వెల్లడి అయింది అదే బీజేపీ నితీష్ నే తమ కూటమి సీఎం గా ప్రకటిస్తే మాత్రం 23.1 మందే ఓటేస్తున్నారు. దాంతో బీజేపీలో కొత్త ఆలోచనలు మొదలయ్యాయని అంటున్నారు. బీహార్ లో అధికారం ఏ కూటమిది అంటే మాత్రం ఆర్జేడీ నాయకత్వంలోని మహాఘటబంధన్ కే 36.1 మంది జై కొడితే ఎన్డీయే పక్షానికి 35.4 శాతం మంది మాత్రమే జై అంటున్నారుట.

**బీజేపీ నుంచే కొత్త సీఎం :** ఈ సర్వే ఫలితాలు చూసిన తరువాత కమలనాధులు సరికొత్త ఆలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. నితీష్ కుమార్ కి జనాదరణ బాగా తగ్గిన నేపథ్యంలో ఎన్డీయే కూటమి నుంచి బీజేపీ అభ్యర్ధీ ప్రకటించాలని ఆలోచిస్తున్నారుట. దీని వల్ల ఫ్రెష్ లుక్ ఉంటుందని, ఎండీయే కూటమికి కొత్త బలం వస్తుదని ఆ పైన మోడీ ఇమేజ్ కూడా తోడు అయితే బీహార్ పీఠం బీజేపీ పరం అవుతుందని లెక్క వేస్తున్నారుట. నితీష్ ని సీఎం గా చూసి బోరెత్తిన బీహార్ జనాలకు బీజేపీ కొత్త ముఖాన్ని తమ పార్టీ నుంచి చూపించడం ద్వారా ఎన్డీయేని తిరిగి అధికారంలోకి తేవాలని చూస్తోంది. బీజేపీ ఆలోచనలు బాగానే ఉన్నా నితీష్ దానికి ఊరుకుంటారా అన్నదే పాయింట్. బీహారీ బాబుకు చెక్ పెడితే మాత్రం ఏమి జరుగుతుందో చూడాల్సిందే.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత ప్రియంవద - ఆగస్టు 3...దాయం ప్రియంవద వర్ధంతి

హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా. కూడా పిలుస్తారు. నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్థాయి నుంచి గ్రామాల్లోని దొరల వరకూ సాగిన అణచివేత విధానాలకు నిరసనగా తెలంగాణ సాయుధ పోరాటం పురుడు పోసుకుంది. వెట్టి చాకిరి, భావ వ్యక్తీకరణపై తీవ్ర ఆంక్షలు, మాతృ భాషలపై అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు వంటి ఎన్నో పరిణామాలు పోరాటానికి నేపథ్యంగా నిలిచాయి. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం దక్షిణాసియాలో, భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి సాయుధ రైతాంగ తిరుగు బాటుగా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించింది. ఆ విధంగా అది ఎన్నో సాయుధ పోరాటాలకు, ఉద్యమాలకు ఈ పోరాటం స్ఫూర్తి దాయకంగా నిలిచింది. నిజాం నిరంకుశ పాలనకు, దొరల, భూస్వాముల, దేశముఖ్ దోపిడీకి, అణిచివేతకు, హింసకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటమిది. దేశంలోనే తొలిసారిగా భూ సమస్యను బలంగా ముందుకు తెచ్చి భూ సంస్కరణల చట్టానికి నాంది పలికిన పోరాటమిది. తెలంగాణలో ముఖ్యంగా నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో ప్రతిపల్లె, ప్రతి గడప సాయుధ పోరులో మమేకమైనవే. దొడ్డి కొమరయ్య అమరత్వం నుంచి ప్రారంభమైన పోరులో వేలాదిమంది పోరాట యోధులను నిజాం పోలీసులు, రజకార్లు, భూస్వాములు, గుండాలు హత మార్చిన హృదయ విదారక నేపథ్యం. ఈ పోరాటం మామూలు వ్యక్తి నుండి మేధావుల వరకు ఆడమగ తేడా లేకుండా ఎందరినో కదనరంగంలోకి ఆకర్షించింది. అలాంటి వారిలో దాయం ప్రియంవద ఒకరు. దాయం ప్రియంవద (1928 – ఆగస్టు 3, 2013) తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన మహిళ. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాయం రాజిరెడ్డి సోదరి. భీమిరెడ్డి నరసింహారెడ్డి, శశిరేఖ, మల్లు స్వరాజ్యం తదితర ఉద్యమ కారులంతా ప్రియంవద సమీప బంధువులు. నల్గొండ జిల్లా, తుంగతుర్తి మండలం వెంపటి సమీపంలోని తూర్పుగూడెంలో 1928లో లక్ష్మమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. ప్రియంవదది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. రష్యన్ సాహిత్యం, గోర్కి నవలలు, రెండో ప్రపంచ యుద్ధం గురించి వెలువడిన పుస్తకాల పట్ల ఆసక్తిని కలిగి చదవడం వల్ల నాటి సమకాలీన పరిస్థితిని ఒంట పట్టించు కున్నారు. సుశిక్షితురాలైన గెరిల్లా సైనికురాలు ప్రియంవద తెలంగాణ సాయుధ పోరాటంలో కాలూనారు. 1943 సంవత్సరంలో 15ఏళ్ళ వయసు లోనే అన్న రాజిరెడ్డితో కలిసి ఖమ్మం ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దాయం రాజిరెడ్డి లతో కలిసి సూర్యాపేట ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. గెరిల్లా సైనికురాలిగా ఆయుధం పట్టడానికి ముందు ఆమె విజయవాడలో ఆత్మరక్షణ, ఆయుధశిక్షణ పొందారు. సాయుధ పోరాటంలో గాయపడ్డ యోధులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యసేవిక (నర్సింగ్) ట్రైనింగ్ పొందారామె. పదిహేనేళ్ల ప్రాయంలో ఆమె ఉద్యమం పట్ల ప్రభావిత మైనారు. స్త్రీల సమస్యలపై, రైతు కూలీల సమస్యలపై అన్నతో కలిసి ఉద్యమ బాట పట్టారు. 1952లో జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. మహిళా హక్కుల సాధన, బాల్య వివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టారు. మహిళల కూలీరేట్ల పెంపు కోసం ఆమె రాజీలేని పోరాటం సాగించి, పెద్ద రైతు కుటుంబ నేపథ్యం కలిగిఉన్న అర్ధశేరు వడ్లు మాత్రమే ఉండే రోజు కూలీని, రెండుశేర్ల వడ్లు కూలీగా ఇప్పించారు. ఆంధ్రమహాసభలు వరంగల్, ఖమ్మంలో జరిగిన తర్వాత అన్న రాజిరెడ్డిను భువనగిరి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్గా నియమించారు. ఇబ్బందుల్లో ఉన్న రాజిరెడ్డికి తోడుగా కొలనుపాక జైన మందిరంలో నడిపే స్కూలులో యాభై రూపాయల జీతంతో టీచర్గా చేరారు. అక్కడ ఒక సంవత్సరంపాటు పనిచేశారు. ఆసమయంలో వీరి కుటంబంపై ప్రభుత్వం నిషేధం విధించడంతో 1944లో విజయవాడ వెళ్లారు. అక్కడ జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభకు వలంటీర్గా పనిచేశారు. ఆ తర్వాత వివిధ గ్రామాలకు వెళ్లి తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఆడవాళ్లలో చైతన్యం కలిగించారు. నల్గొండ జిల్లాలో పలు గ్రామాల్లో తిరిగి, పోరాట వ్యూహాల గురించి సమాజంలో స్త్రీలకుండే ఇబ్బందులు, వాటిని ఎదుర్కొనే పద్దతులను గురించి, ఉత్తేజ ప్రసంగాల ద్వారా వివరించే ప్రయత్నాలు చేశారు. చదువు విషయంలో ఎవరైనా ముందుకొస్తే వాళ్ళకు పాఠాలు చెప్పారు. ఊళ్ళల్ల




రజాకార్ల ఒత్తిడి ఎక్కువగా ఉన్న సమయంలో అమ్మను, నాన్నను చూసేందుకు సొంతూరుకు వెళ్ళిన విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి సమయంలో స్టేషనుకు, ఆపై తుంగతుర్తి క్యాంపుకు, తర్వాత సూర్యాపేటకు, చివరకు హైదరాబాద్ తరలించి, చంచల్గూడ జైల్లో బంధించారు. మూడు నెలల తర్వాత బయటికి జైలు నుంచి వచ్చిన ఆమె ఆయుధాలు పట్టి కాల్చడం నేర్చుకున్నారు. దళంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా పరోక్షంగా మాత్రమే సహాయం అందించారు. మరోసారి స్వంత ఇంటిలో అరెస్టయి సికింద్రాబాద్ కంటోన్మెంట్ జైలుకు, ఆనంతరం వరంగల్ జైలుకు పంపబడ్డారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జైళ్ళలోనూ ఆమె జైలు జీవితం గడిచింది. ఎంచుకున్న లక్ష్య సాధన కోసం ఆమె వివాహం చేసుకోక ఒంటరిగానే బతికారు. ఉద్యమ రోజుల్లో ప్రజలకు అత్యంత దగ్గరగా గడిపిన ఆమె చివరి రోజుల్లో ప్రజా జీవితానికి దూరంగా జీవిస్తూ 2013, ఆగస్టు 3 న తుది శ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సంగీత సాధనలో సిద్ధి పొందిన తాపసి పినాక పాణి

## గురువులకే గురువు శ్రీపాద పినాక పాణి – ఆగస్టు 3...శ్రీపాద పినాక పాణి జయంతి

కర్ణాటక సంగీతం అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చే పేర్లు అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య తదితరులు. శాస్త్రీయ కర్ణాటక సంగీతం నేటికీ సంప్రదాయ రీతిలో కొన సాగుతున్నదంటే ఇలాంటి కారణ జన్ములైన సంగీతజ్ఞులు తమ సర్వస్వాన్నీ సంగీతానికి ధారపోసిన ఫలితమే. అయితే నిరాడంబరంగా, నిశ్శబ్దంగా, నిర్విరామంగా సంగీతానికి తొంభయ్యేళ్ళకి పైగా కృషి చేసిన ఒక గొప్ప సంగీత విద్వాంసుని సేవల గురించి చాలామందికి తెలియక పోవచ్చు. శత వత్సర జీవన యానంలో సంగీతమే ప్రపంచంగా జీవించిన సంగీత తపస్వి ఆయన. వృత్తి రీత్యా వైద్యుడేయినా, సంగీతజ్ఞుడినని చెప్పుకోవడానికే ఇష్టపడిన అరుదైన వ్యక్తిత్వం ఆయనకే సొంతం. ఆయన కేవలం గాయకుడే కాదు, కేవలం వైణికుడే కాదు. సంగీత శాస్త్రాన్ని ఆసాంతం అవగాహన చేసుకున్న వాగ్గేయకారుడు కూడా. వందలాది వాగ్గేయకారుల కృతులకు స్వరరచన చేసి ఒక చోట పుస్తకంగా అచ్చు వేయడానికి తన జీవితకాలాన్ని వెచ్చించిన కళా పిపాసి, సిద్ధి పొందిన తాపసి ఆయన. నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం, మల్లాది సూరిబాబు, నేతి శ్రీరామశర్మ, ఓలేటి వేంకటేశ్వర్లు, సినీ నేపథ్య గాయని ఎస్. జానకి, ఎందరో లబ్ధ ప్రతిష్టులైన గాయకులకు సంగీతం నేర్పి, గురువులకే గురువని పేరు ప్రఖ్యాతులు గడించిన సంగీత కళా నిధి ఆయన. ఆయనే డాక్టర్ శ్రీపాద పినాక పాణి. ఈ శతాబ్దపు అద్భుత సంగీత విద్వాంసుడు, మధుర గాయకుడు, సంగీత కళానిధి, పద్మ భూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. సంగీత కళాభివృద్ధికి విశిష్ట కృషిచేసి, భావి తరాలకు అందించాలన్న కుతూహలంతో అనేక సంగీత రచనలు చేసి, తన శిష్య, ప్రశిష్యులకు సంగీతంలోని మెళకువలు నేర్పించిన సంగీత శాస్త్ర విశారదుడు. నిరంతర పరిశ్రమతో, సంక్లిష్టమైన, విషయాలను సమన్వయించి నిశితంగా పరిశీలించి, విశ్లేషించి రాగ యుక్తంగా శిష్యులకు నేర్పేవారు. ఒకవైపు రోగాలను, మరోవైపు రాగాలను సరిచేసిన సవ్యసాచి డాక్టర్ శ్రీపాద పినాక పాణి (ఆగష్టు 3, 1913 – మార్చి 11, 2013) వైద్య, సంగీత రంగాలలో నిష్ణాతులు. శాస్త్రీయ సంగీతం తెలుగునేలపై అంతంత మాత్రంగా ఆదరణ ఉన్నరోజులు. నాటక పద్యాలలోనో, హరికథలలోనో తప్ప శాస్త్రీయ సంగీతం అంతగా వినబడని ఆ రోజులలో, తమిళ నాట లాగే శాస్త్రీయ సంగీతం తెలుగునాట వర్ధిల్లాలని నిరంతరం తపన పడ్డారు. శాస్త్రీయ సంగీత వైభవాన్ని ఆకాంక్షించారు. ఆ దిశగా ఎందరో సంగీత శిఖామణులను తెలుగు వారికి అందచేశారు. శ్రీపాద పినాక పాణి శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారంలో 1913, ఆగష్టు 3 వ తేదిన కామేశ్వరరావు, జోగమ్మ దంపతులకు జన్మించారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు గారి వద్ద తొలి సంగీత పాఠాలకు శ్రీకారం చుట్టారు. 1939వ సంవత్సరంలో విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల నుండి ఎం.బి.బి.ఎస్. పట్టా తీసుకున్నారు. 1945వ సంవత్సరంలో జనరల్ మెడిసన్ ఎం.డి. పూర్తి చేసారు. తర్వాత రాజమండ్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా ప్రభుత్వ సర్వీసులో చేరారు. 1951 నుండి 1954 వరకు విశాఖలో వైద్య కళాశాలలో సివిల్ సర్జన్ గా పనిచేసారు. 1957లో కర్నూలు వైద్య కళాశాలకు బదిలీ అయి, అక్కడే కళాశాల ప్రిన్సిపాల్ గా, సూపరింటెండ్ గా పనిచేసి 1968 లో పదవీ విరమణ చేసారు. కర్నూలులో స్థిర పడ్డారు. సంగీతం వింటూనే నొటేషన్స్ రాయగల నైపుణ్యం ఆయనకు దేవుడిచ్చిన వరం. పదవీ విరమణానంతరం, త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, గీతాలు, స్వరజతులు, స్వరపల్లవులు, తాన పద వర్ణములు, కృతులు, జావళీలు మొదలైన సంగీత రచనలు ఏరి కూర్చి, పుస్తక రచనకు శ్రీ కారం చుట్టారు. సంగీత సౌరభం పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన నాలుగు సంపుటాలలో శ్రీపాద స్వర పరచిన అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజాది వాగ్గేయ కారుల కృతులు 607, ముత్తు స్వామి దీక్షితుల కృతులు 173, పదములు 44, జావళీలు 40, తానవర్ణములు 56, తిల్లనాలు 10, మొత్తం 1088 సంగీత అంశాలు ఉన్నాయి. పాణినీయం, ప్రపత్తి, స్వరరామమ్, అభ్యాసమ్, నా సంగీత యాత్ర పుస్తకాలు ఆయన విరచితాలు. సంగీతకళా



శిఖామణి, సప్తగిరి సంగీత విద్వాన్ మణి, సంగీత కళానిధి, గానకళా సాగర, కళా ప్రపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పురస్కారం, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకొన్నారు. ఆయన సంగీతాన్ని కేంద్రనాటక అకాడమీ రికార్డ్ చేసి ఆర్కైవ్స్ లో పొందు పరచింది. 1977 లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 1978 లో ఆంధ్ర విశ్వ విద్యాలయంచే కళాప్రపూర్ణ బిరుదు, 1984 లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2011 లో సంగీత నాటక అకాడమీ ఠాగూర్ ఫెలో గౌరవాన్ని పొందారు. 2012, ఆగష్టు 3 న తన 99 వ జన్మదినాన తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే "జ్ఞాన విద్యా వారధి" బిరుదు పొందడం జరిగింది. అనేకమంది వాగ్గేయకారులు రచించిన పాటలకు స్వరాలతో, అనుస్వర, గమక సహితంగా స్వరరచన చేసి పినాకపాణి సంగీత సౌరభంలో పొందు పరిచారు. సంగీత సౌరభం అనే పుస్తకంలో అన్నమయ్య కీర్తనలూ, క్షేత్రయ్య పదాలూ, జావళీలూ, వర్ణాలూ ఇలా దాదాపు రెండు వేలకు పైగా పాటలకు స్వర రచన అందించారు. స్వతహాగా వైద్యులు కావడం వలన రోగానికి కారణం వెతికినట్లే, సంగీతం ఎలా నేర్పాలి, ఎలా నేర్పితే సులభతరం అవుతుంది అనే విషయాలపై లోతుగా అధ్యయనం చేసి గ్రంథస్థం చేశారు. సంగీతాభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తండ్రికి తగ్గ తనయుడు సూరి బాలకృష్ణ - ఆగష్టు 3... సూరి బాలకృష్ణ జయంతి

భారత దేశం గర్వించదగిన శాస్త్ర వేత్తలలో సూరి భగవంతం అగ్రభాగాన నిలిచే వారిలో ఒకరు. భారత దేశ రక్షణ శాఖ సలహాదారుగా, దేశ తొలి ప్రధాని నెహ్రూకు శాస్త్రీయ అంతరంగిక సలహాదారుగా పని చేసిన తెలుగు తేజం సూరి భగవంతం భారతరత్న, నోబెల్ పురస్కార గ్రహీత సి.వి. రామన్ శిష్యులు. సత్యసాయి బాబావారికి ఆంతరంగిక శిష్యులు. కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్ ఉస్మానియా యూని వర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్, లాబ్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డిఫెన్స్ రి సెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ కు డైరెక్టర్ జనరల్ గా ఆయన విశేష సేవలు అందించి గుర్తింపు పొందారు. భూతలం మీద, సముద్ర జలాలమీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం. చేయటానికి డి.ఆర్.డి.ఓను ఒక సమర్ధ వంతమైన పనిముట్టుగా రూపొందించిన అసమాన ప్రజ్ఞాశాలి భగవంతం. ఆయన కుమారుడే సూరి బాలకృష్ణ తండ్రికి తగ్గ తనయునిగా గుర్తింపు పొందారు. సూరి బాలకృష్ణ భూ భౌతిక విజ్ఞాన శాస్త్రవేత్త. అసమాన పరిశోధకులు. సూరి బాలకృష్ణ 1941 ఆగష్టు 3న గుంటూరులో జన్మించారు. 1952 నుంచి భూ విజ్ఞాన, భూ. భౌతిక శాస్త్రాలలో విశేష పరిశోధనలు జరిపారు. శిలల భౌతిక ధర్మాలు, వాటి భూ విజ్ఞాన లక్షణాలు, భూ జలాన్వేషణ మొదలైన అంశాల మీద పలు పరిశోధనలు నిర్వహించారు. 1953 లో, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం ఎస్ సి సాధించారు. ఉద్యోగిగా తొలుత ఉస్మానియా యూనివర్సిటీలో రీసెర్చి స్కాలర్ గా (1953–54) చేరారు. న్యు ఢిల్లీ లోని నేషనల్ ఇన్ స్టి ట్యూట్ ఆఫ్ సైన్సెస్ లో రిసెర్చ్ ఫెలో గా 1954లో చేరారు. 1955లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి పిహెచ్ డి. అందుకున్నారు. బాలకృష్ణ 1956–57 కాలంలో హార్వర్డ్ : యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయల్ రిసెర్చ్ ఫెలోగా గుర్తింపు పొందారు. జపాన్ ప్రభుత్వ గౌరవ పురస్కారం తో పాటు, జపాన్ జియోలాజికల్ సొసైటీ ఫెలోషిప్ నూ అందు కున్నారు.. ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగానికి అధిపతిగా (1961–64) రాణించారు. మధ్య కాలంలో ఇదే విభాగానికి రీడర్ గా (1957–61), శాఖాధిపతిగా (1962) గౌరవ ప్రొఫెసర్గా (1964), అసిస్టెంట్ డైరెక్టర్ గా (1965) వివిధ పదవులను సమర్థ వంతంగా నిర్వహించారు. ప్రతి శాఖలోనూ తన ప్రతిభను చాటారు. హైదరాబాద్ లోని నేషనల్ జియో ఫిజికల్ రిసెర్చ్ ఇన్ స్టిట్యూట్కు అసిస్టెంట్ డైరెక్టర్ గా యాక్టింగ్ డైరెక్టర్ గా 1979 నుంచి 81 వరకు సేవలందించారు. ఇండియన్ జియో ఫిజికల్యూనియాన్ కు కార్యదర్శిగా ఉంటూ –ఫెలోషిప్ అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోషిప్ కూడా పొందారు. జియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు ఫౌండర్ ఫెలోగా, ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షునిగా కూడా పని చేశారు. పర్వతాలు, శిలల స్థితి స్థాపకత్వం భూ సంబంధ లక్షణాలున్న వాటి అనుబంధాల పైనా పరిశోధించి సాధికారిక పత్రాలు రాశారు. అనేక దేశాలు పర్యటించి ఉపన్యా సాలిచ్చి, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని విలువైన 125 ప్రామాణిక పరిశోధనా పత్రాలు సమర్పించారు. భూ ప్రకంపనాలు, భూ కంపాలు, భూ అయస్కాంత క్షేత్రాలు, గురుత్వాకర్షణ క్షేత్రాలు, వాటి పని తీరులపై సునిశిత పరిశోధన చేసిన పరిశోధనా శ్రేష్ఠులు ఆయన. సూరి బాలకృష్ణ 1984 సెప్టెంబరు 9 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆ పరిపాలనా దక్షత, కార్యకలాపాల సమన్వయ నైపుణ్యం. నాయకత్వ పటిమలతో భూవిజ్ఞాన శాస్త్ర రంగాలలో సాటిలేని మేటి శాస్త్రవేత్తగా రాణించారు. బాలకృష్ణ శాస్త్రీయ కృషిఫలితంగా 1967లో కృష్ణన్ గోల్డ్ మెడల్, 1979 లో ఆంధ్ర ప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి అవార్డుల గ్రహీతగా నిలిచార 1967 లో కృష్ణన్ గోల్డ్ మెడల్ 1979 లో ఆంధ్రప్రదేశ్ అకాడెమి ఆఫ్ సైన్సెస్ అవార్డ్ పొందారు. భూ విన శాస్త్రంలో సాటిలేని విజ్ఞాన ఖనిగా, పాలనా దక్షునిగా, క్రమ శిక్షణగల




నాయకునిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన మేధావి. సైంటిస్ట్ సూరి రామకృష్ణ తండ్రి భగవంతంకు తగ్గ తనయుడు అనిపించు కున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## వ్యవసాయ యాంత్రీకరణ.. అమలుకు ప్రణాళిక

ఆలేరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే జీవో నెం.234 విడుదల చేసింది. దీనికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధికారులు వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు సన్నాహాలు మొదలుపెట్టారు.

**ఉమ్మడి జిల్లాకు రూ.6.22 కోట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2025–26 సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు రూ.6.22 కోట్ల నిధులను కేటాయించారు. నల్గొండ జిల్లాకు రూ.3.14 కోట్లు, సూర్యాపేటకు రూ.1.84 కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24 కోట్లు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50 శాతం రాయితీ, జనరల్ కేటగిరీ రైతులకు 40 శాతం రాయితీ వర్తిస్తుంది. ప్రస్తుత



వానాకాలం సీజన్ నుంచి యాసంగి సీజన్ వరకు పూర్తి స్థాయిలో అమలు చేస్తారు. ఈసారి 15 రకాల యంత్ర పరికరాలతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నారు.

**మరోదఫా దరఖాస్తుల స్వీకరణ...**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు సంబంధించి ఆగస్టు 5 నుంచి 15వ తేదీవరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. గతంలో చేసిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. అందిన దరఖాస్తులను వ్యవసాయాధికారులు 16వ తేదీన జిల్లా కలెక్టర్లకు అందజేస్తారు. 20వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు కారణాలను తెలియజేస్తారు. ఎంపికైన రైతులకు ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 5 వరకు మంజూరు పత్రాలు, సెప్టెంబరు 7 నుంచి 17 వరకు పరికరాలు పంపిణీ చేస్తారు.

## అక్షరాలు కదిలించాయి.. యంత్రాలు తెప్పించాయి..!

నల్గొండ : మూత్రపిండాల బాధితులకు ఎదురుచూపులేనా.. అంటూ ఇటీవల వచ్చిన వరుస కథనాలకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కథనాలను జత చేస్తూ రాష్ట్ర స్థాయి అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులతో పాటు సాప్ సంస్థ (పీపీబి) ఒప్పందంతో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ వార్డులో నూతనంగా ఐదు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఉదయం 11:30 గంటలకు యంత్రాలను ప్రారంభించనున్నారు. జిల్లాలోనే అత్యధికంగా మూత్ర పిండాల వ్యాధిగ్రస్తులు నల్గొండ డివిజన్ పరిధిలో ఉన్నట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన బాధితులు సైతం జిల్లా కేంద్రంలో గదులు అద్దెకు తీసుకొని ఉంటూ చికిత్సలు పొందుతున్నారు. బాధితులకు తగిన



యంత్రాలు లేని కారణంగా పగలు రాత్రి తేడా లేకుండా రక్తశుద్ధి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

**నాలుగు గంటలకు పైగా: బి.నర్సయ్య, నకిరేకల్**

మూత్రపిండాల రక్తశుద్ధి సమస్య పగవారికి రాకూడదు. చికిత్సకు వచ్చిన ప్రతిసారి నాలుగు గంటలు మంచం పైనే ఉండాలి. బాధితులకు తగినన్ని యంత్రాలు లేని కారణంగా రాత్రి సమయంలో కూడా రావాల్సి వస్తోంది. ' చొరవతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆసుపత్రి ఉన్నతాధికారుల సహకారంతో ఐదు యంత్రాలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది.

**ఇబ్బంది లేకుండా చూస్తాం**

డా.అరుణకుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్

మూత్రపిండాల బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ప్రయత్నాలు చేస్తున్నాం. నూతనంగా వచ్చిన ఐదు యంత్రాలతో బాధితులకు సకాలంలో రక్తశుద్ధి జరుగుతుంది. దీనికి కావాల్సిన మౌలిక వసతులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశాం.

## లెక్క తప్పొద్దు.. నాణ్యత మరవొద్దు!

కొత్తగూడెం: చేపపిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మత్స్యకారుల సంఘాలకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను అందజేస్తోంది. గతేడాది టెండర్లలో జాప్యం, చేపపిల్లల్లో నాణ్యత లోపాలు, బిల్లుల కోసం కమీషన్ల వసూళ్లపై ఫిర్యాదులు రావటంతో ఈసారి ఉచిత చేపపిల్లల పథకం అమలుపై సందేహాలు వ్యక్తమయ్యాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనూ ఈ పథకాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. రూ.123 కోట్లతో 90కోట్ల చేపపిల్లలను కొనుగోలు చేసేందుకు అనుమతించింది. **కావాల్సింది 5కోట్లు.. ఉత్పత్తి 19లక్షలే**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని చెరువుల్లో ఏటా 5కోట్లకు పైగా చేపపిల్లలను వదులుతున్నారు. కేవలం 19 (ఖమ్మం జిల్లా మైలారంలో 14, భద్రాద్రి జిల్లా కిన్నెరసానిలో 5) లక్షల చేపపిల్లలు మాత్రమే ఉత్పత్తి అవుతుండటం గమనార్హం. మిగతా వాటిని ప్రభుత్వం టెండర్ ప్రక్రియ ద్వారా గుత్తేదారుల నుంచి కొనుగోలు చేసి మత్స్యకారులకు అందిస్తోంది. ప్రైవేట్ ఉత్పత్తిదారులకు చెల్లిస్తున్న మొత్తాలను మహిళా సంఘాలకు మళ్లించి.. అతివలతోనే చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయించాలని సర్కారు భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయితే ఉభయ జిల్లాలకు అవసరమైన చేపపిల్లలను స్థానికంగానే ఉత్పత్తి చేసుకునేందుకు వీలుంటుంది.

**పారదర్శకతకు పెద్దపీట**చేపపిల్లల పంపిణీలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ఉభయ జిల్లాల మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. చేపపిల్లలను చెరువుల్లో వదిలినప్పటి నుంచి వాటిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి చెరువు గట్టుపై ప్రభుత్వం ఉచితంగా అందించిన చేపపిల్లల వివరాలను పొందుపరచాలన్నారు. చెరువు సామర్థ్యం, ఎన్ని చేపపిల్లలు వదిలారు, ఏఏ రకాలు, వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, వాటి ఖర్చు, ఎంత సైజు వంటి అంశాలను తప్పనిసరిగా బోర్డులపై ప్రదర్శించాలని స్పష్టం చేశారు. కచ్చితమైన లెక్కల ప్రకారం చేపపిల్లల పంపిణీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చేపపిల్లల పంపిణీకి టెండర్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. ప్రభుత్వం టెండర్లు ఖరారు చేయగానే జిల్లాలో చేపపిల్లలను అందజేస్తాం. ఈ ఏడాది 1.50కోట్ల చేపపిల్లలను చెరువుల్లోకి చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇంతియాజ్, జిల్లా మత్స్యశాఖ అధికారి, భద్రాద్రి

# అర్ధాకలి చదువులు



కరీంనగర్ : చదువుపై ఆసక్తితో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరుతున్న గ్రామీణ విద్యార్థులు ఆకలి బాధను ఎదుర్కొంటున్నారు.. గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి ఉండగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ఈ పరిస్థితి లేదు. దీంతో విద్యార్థులు చదువులపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

**పేద కుటుంబాలవారే అధికం..**

ఉమ్మడి జిల్లాలోని 52 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 16,715 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రామీణ పేద కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. ఉదయం 8 గంటలకే ఇంటి నుంచి తినీతినక బయలుదేరుతున్న వారే ఎక్కువ. వీరిలో చాలా తక్కువ మంది రోజూ మధ్యాహ్నం భోజనం తెచ్చుకుంటుండగా మిగతావారు ఏమీ తినకుండా ఉండటమో.. బిస్కెట్లు, స్నాక్స్‌తో ఆకలి తీర్చుకోవడమో చేస్తున్నారు. కొన్నిసార్లు స్నేహితులు తెచ్చిన టిఫిన్ బాక్స్‌లోని భోజనం పంచుకుంటున్నారు. ఈ పరిస్థితులు వారి చదువులు, ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

ఆకలి బాధతో కొందరు విద్యార్థులు మధ్యాహ్నమే ఇంటికి వెళ్లిపోతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు. సాయంత్రం వరకు ఉన్నవారు ఏకాగ్రత చూపలేకపోతున్నారని పేర్కొంటున్నారు. తినకుండా ఉంటున్నవారు, స్నాక్స్‌తో కడుపు నింపుకొంటున్నవారు సాయంత్రం వరకు నీరసపడుతున్నారు. అర్ధాకలి చదువులు ఫలితాలపైనా ప్రభావం చూపుతున్నాయని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

పరీక్షల సమయంలో అధ్యాపకులు, దాతలు, ప్రజాప్రతినిధులు స్పందించి భోజనం ఏర్పాటు చేస్తుండటం కొంత ఊరటగా ఉంటోంది. నీరసం, రక్తహీనత, ఆసిడిటీ సమస్యలతో విద్యార్థులు చికిత్సకు వస్తున్నారని, మధ్యాహ్న భోజనం చేయకుండా ఉంటున్న విద్యార్థులే వీరిలో అధికమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఈ ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కరీంనగర్ జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్‌తో మాట్లాడగా ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అమలు చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని, హాజరు శాతం, ఫలితాలు మెరుగయ్యే అవకాశముందన్నారు.

**టిఫిన్ బాక్స్ తేనప్పుడు బిస్కెట్లు తింటున్నా**

ఉదయాన్నే కళాశాలకు వస్తుండటంతో మధ్యాహ్నం బాగా ఆకలి అవుతుంది. ఒక్కోసారి టిఫిన్ బాక్స్ తెచ్చుకుంటా. బయలుదేరే సమయానికి వంట కాకపోతే మిత్రుల టిఫిన్ బాక్స్ పంచుకోవడమో కళాశాల పక్కనే ఉన్న కిరాణంలో బిస్కెట్లు, ఇతర తినుబండారాలు కొనుగోలు చేసి తినడమో చేస్తున్నా. ఇబ్బంది ఎక్కువగా ఉన్నప్పుడు మధ్యాహ్నమే ఇంటికి వెళ్తున్నా.

ఎం.భార్గవ్, భూపాలపట్నం,చొప్పదండి కళాశాల

**నీరసపడతారు** ఇంటర్ విద్యార్థులది ఎదిగే వయసు. మూడు పూటలా ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. లేదంటే రక్తంలో గ్లూకోజ్ తగ్గి నీరసపడటం, చెమటలు పట్టడం తదితర సమస్యలతో పడిపోతుంటారు. తరగతుల్లో చెప్పే పాఠాలు కూడా వారు అర్థం చేసుకోలేరు.డాక్టర్ డి.రఘురామన్, సీనియర్ ఫిజీషియన్, కరీంనగర్

# విష కీటకం.. అప్రమత్తతే శరణ్యం



సిరిసిల్ల : వర్షాకాలం మొదలైందంటే విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే అన్నదాతలు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. గ్రామాలకు, పట్టణాలకు దూరంగా ఉండే వసతి గృహాల్లోని నివాసితులకు, ఆయా విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు పాము కాటు ప్రమాదం పొంచి ఉంది. బాధితులకు సకాలంలో చికిత్స అందకపోతే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

**కనిపించే లక్షణాలు ఇవీ..**

విష కీటకాలు కాటు వేస్తే కోరల గాయం కనిపిస్తుంది. కొన్నిసార్లు నొప్పి తీవ్రంగా ఉంటుంది. విషం క్రమంగా శరీరమంతా వ్యాపిస్తుంది. నాలుక మందం అవుతుంది. గొంతు కండరాలు బిగుసుకుంటాయి. చొంగ కారడంతోపాటు కళ్లు కన్పించకపోవడం, శరీరం మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎవరైనా పాము కాటుకు గురైతే వారికి ధైర్యం చెప్పాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి.

**ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు**

అన్నదాతలు పంట చేలకు వెళ్తున్నప్పుడు పాదరక్షలు వేసుకోవాలి. రాత్రి సమయంలో, తెల్లవారు జామున పొలాలకు వెళ్లివచ్చేటప్పుడు టార్చిలైట్లను తీసుకెళ్లాలి. పశుగ్రాసం దుంగలు, రాళ్లకుప్పలు, పంట చేల గట్ల వెంట కీటకాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ ముందుకెళ్లాలి. పొలం వద్ద స్టార్టర్ల డబ్బాల్లో సేద తీరుతుంటాయి. ఇంటి ఆవరణలో ముళ్ల పొదలు, గడ్డి, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. చెత్తాచెదారం పోగు చేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**మచ్చుకు కొన్ని ఘటనలు**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెలవు దినంలో ఇంటికి వచ్చారు. తేలు కాటు వేయగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన చిన్నారికి పత్తి చేను వద్ద తేలు కాటు వేసింది. ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. చివరకు చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోగా బాధిత బంధువుల రోదనలు మిన్నంటాయి. పెద్దూర్‌లో ఒక రైతుల పొలం నుంచి పశువులను ఇంటికి తోలుకొస్తున్నారు. మార్గమధ్యంలో పాము కాటు వేయగా ఆసుపత్రికి వెళ్లారు. సరైన చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి ప్రభుత్వ వసతి గృహంలో చదువుతున్న బాలుడిని ఇటీవల పాము కాటు వేసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది.

సకాలంలో వైద్యమందించాలి

వర్షాకాలం మొదలైందంటే విష కీటకాలు సంచరిస్తూ ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తిని జాప్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యమందించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా అపాయం తప్పదు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

రజిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి

# 'లక్ష'ణంగా.. కల నేరవేరగా


పెద్దపల్లి : ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నిర్మాణ వ్యయం సరిపోకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో పనులు మొదలు పెట్టడంలో వెనకాడుతున్నారు. ఫలితంగా ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడంలేదు. ఇలాంటి పరిస్థితులు అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటి నిర్మాణంలో లబ్ధిదారులు అప్పులు చేయకుండా.. స్వశక్తి సంఘాల నుంచి రూ.లక్ష రుణ సదుపాయాన్ని కల్పించింది. నిర్ణీత గడువులోపు పనులు ప్రారంభించని వాటిపై క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి తెలుసుకొనేందుకు జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఆర్థిక భారం తప్పించేందుకు రుణ మంజూరు వివరాలు సేకరిస్తున్నారు.

**క్షేత్ర స్థాయిలో అధికారులు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేందుకు గృహ నిర్మాణ సిబ్బంది, కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్ల బాట పట్టారు. వాస్తవంగా మంజూరు పత్రం ఇచ్చిన 45 రోజుల్లో పనులు మొదలు పెట్టాలి. ఈ లెక్కన జిల్లాలో 6,018 ఇళ్లకు అనుమతి ఇవ్వగా.. 3,477 వాటికి సంబంధించిన పనులు మాత్రమే ప్రారంభించారు. మిగిలిన 2,541 ఇళ్ల లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి కారణాలు తెలుసుకుంటున్నారు. నిర్మించుకోమని అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లు ప్రారంభించని జాబితా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

**రూ.లక్ష రుణం**

పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో మొత్తం 9421 ఇళ్లకు తొలి విడతగా 1962.. రెండో విడతలో 7459 ఇళ్లు మంజూరయ్యాయి.



ఇంకా 3,403 వాటికి మంజూరు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. వీటిలో 362 గోడల వరకు, 102 నిర్మాణాలకు సంబంధించి పైకప్పు పూర్తి చేశారు. 3 ఇళ్లు పూర్తయ్యాయి. స్వశక్తి సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు రూ.లక్ష రుణం ఇప్పించేందుకు జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ముత్తారం మండలం మచ్చుపేటలో 5, పాలకుర్తి మండలం రామారావుపల్లిలో 15 ఇళ్లకు సంబంధించి రుణం ఇవ్వడంతో పనులు చేసుకుంటున్నారు. అవసరమైన లబ్ధిదారులకు ఇప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాలో ప్రగతి ఇలా..

మంజూరు చేసినవి: 6,018

పనులు ప్రారంభించింది: 3,477

గోడలు నిర్మించినవి: 362

స్లాబ్: 102

నిర్మాణాలు పూర్తయినవి: 3

## సంప్రదాయాల మేళవింపు.. వంటకాల గుబాళింపు

జూలూరుపాడు : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా గతంలో అధికారులు గుర్తించి పంపిన పలు ప్రాంతాలను పునఃపరిశీలన చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కేంద్ర పర్యాటక శాఖ, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) అధికారులకు సూచించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు, ఖమ్మం జిల్లాలోని రెండు ప్రాంతాలను అధికారులు పరిశీలించనున్నారు.

**పరిశీలనకు కమిటీ..**

పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి గురించి నివేదికను పంపేందుకు ఐదుగురు సభ్యులతో ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఎంపీడీఓ, అటవీ అధికారి, ఐటీడీఏ నుంచి ఇద్దరు, పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉండనున్నారు. వీరు ప్రతిపాదిత ప్రాంతంలో పర్యటించి పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయడానికి సానుకూల, ప్రతికూల పరిస్థితులను పరిశీలించి ఆ నివేదికను ఐటీడీఏకు పంపాల్సి ఉంది. ఇప్పటికే ఆ సంస్థ ప్రాజెక్టు అధికారి నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు అందాయి. టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసే ఏరియాలో



పర్యాటకులకు అనువైన వసతులు కల్పించనున్నారు. హోం స్టే చేసేందుకు గృహాలు, ఆహారం, వినోదం కోసం(నృత్యాలు, ఫైర్ క్యాంపేన్‌కు) వసతులు, గుట్టలు ఉన్న ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తారు. ఇవన్నీ స్థానిక సంప్రదాయాల మేళవింపుగా నిర్వహించాలని యోచిస్తోంది. గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో వారి ఆహారపు రుచులనే పర్యాటకులకు అందిస్తారు. ఉదాహరణకు బంజారాలు నివసించే ప్రాంతంలో ఎక్కువగా వీరు జొన్న రొట్టెను ఇష్టపడతారు. ఇట్లాంటి ఆహారాన్ని ప్రధానంగా అందుబాటులోకి తేవడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. టూరిజం హబ్‌కు కేటాయించిన ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి ఉండాలి, మరో వైపు అటవీ ప్రాంతాల్లో ఉండటంతో ఆ శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇవి కొంత ప్రతికూలంగా మారనున్నాయి.

**ప్రతిపాదిత ప్రాంతాలివే.. భద్రాద్రి జిల్లాలో:**ట్రైబల్ మ్యూజియం (భద్రాచలం) పగిడేరు(మణుగూరు),గోగులపూడి (అశ్వారావుపేట), చింతలతండా (జూలూరుపాడు),పూబెల్లి(ఇల్లెందు) ఖమ్మం జిల్లాలో.. గార్లఒడ్డు (ఏన్కూరు) పులిగుండాల (పెనుబల్లి)

## ఆరేళ్లుగా.. అక్కరకు రాలేదుగా..

కొత్తగూడెం : ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం, చింతోళ్లగుంపు, అనంతోగు, తీర్లాపురం, ఆళ్లపల్లి గ్రామాల్లోని 1,000 ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరందించేందుకు నిర్మించిన ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకానికి డిజైన్ లోపం శాపంగా మారింది. 2016లో అప్పటి ప్రభుత్వం నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నదిపై రూ.10.92కోట్లతో పనులు ప్రారంభించింది. 2019లో పనులు పూర్తయ్యాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంప్‌హౌస్‌లోకి వరదనీరు చేరుతోంది. ముంపు ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించటంతో కిన్నెరసానికి వచ్చే వరదల ధాటికి మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయి.

**ఏటా ముంపు ముప్పు**

రూ.10కోట్లకు పైగా ప్రజాధనంతో నిర్మించిన ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకం ఆరేళ్లుగా ఒక్క ఎకరాకు సైతం సాగునీరందించకపోవటం గమనార్హం. ఏటా వచ్చే వరదలకు పంప్‌హౌస్ ముంపునకు గురవటంతో మోటార్లు దెబ్బతింటున్నాయి. ట్రయల్‌రన్‌లో భాగంగా మొదటిసారి 2022లో పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసినప్పటికీ.. 2023లో వచ్చిన వరదలకు పంపులు మరమ్మతులకు గురయ్యాయి. అప్పటి నుంచి ఈ పథకం నిరుపయోగంగానే మారింది. పాలకులు స్పందించి సాగునీరందించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.

**వర్షాధార పంటలకే పరిమితం**

ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోయకపోవటంతో ఆయకట్టు రైతులు వర్షాధార పంటలకే పరిమితమవుతున్నారు. మండలంలోని ప్రధాన నీటి వనరులైన ఎర్ర చెరువు, మొద్దుల చెరువులోకి వర్షం నీరు చేరితేనే వాటి కింద వరి, ఇతర పంటలను సాగుచేస్తున్నారు. యాసంగికి నీటిఎద్దడి సమస్య ఉత్పన్నమవుతోంది. అందుకే ఆయకట్టు రైతులు అనేకమంది వర్షాకాలంలో మాత్రమే పంటలు పండిస్తున్నారు. ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే స్థానికంగా ఉన్న ప్రధాన నీటి వనరులతో పాటు చిన్నచిన్న చెరువులు, కుంటలను నింపుకొని రెండు పంటలు సాగుచేయవచ్చునని ఆశిస్తున్నారు. సమస్య పరిష్కారానికి రూ.26లక్షలతో కరకట్ట నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. పంపుల వద్ద నీరు నిల్వ ఉండేలా రూ.9కోట్లతో చెక్‌డ్యాం మంజూరు చేసింది. వచ్చే ఏడాది నాటికి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. నాగమల్లేశ్వరరావు, డీఈ, నీటిపారుదలశాఖ, కొత్తగూడెం

## ముచ్చటగా మూడు.. మన్యం ప్రగతి చూడు

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ ఏడాదిగా మూడు కీలక విభాగాల్లో ప్రతిభ కనబర్చడంతో దీన్ని నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో మూడు అంశాల సమగ్ర సమాచారాన్ని పుస్తకంగా ముద్రించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతగా 120 పుస్తకాలు ముద్రించాలని నిర్ణయించగా ఒక్కోటి 125 పేజీలు ఉంటుంది. ఇందులో ఆయా విభాగాల సమాచారం, సంబంధింత చిత్రాలను పొందుపర్చనున్నారు. మ్యూజియం అభివృద్ధి, ఉద్దీపకం, కెరీర్ గైడెన్స్ అంశాలపై రూపొందించే పుస్తకాలను 33 జిల్లాల కలెక్టర్లు, గిరిజన సంక్షేమశాఖలోని కీలక అధికారులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అధికారులకు త్వరలోనే అందించనున్నారు.

1. మ్యూజియం అభివృద్ధి ఐటీడీఏది 50ఏళ్ల చరిత్ర. ఆదివాసీల జీవన విధానంపై గిరిజన సాంస్కృతిక శిక్షణ సంస్థ పరిశోధనలు చేస్తోంది. మ్యూజియం ద్వారా వీరి చరిత్రను చాటడం దీనిపని. కొంతకాలంగా ఈ వ్యవస్థ నామమాత్రంగా మారింది. దీనిపై పీఓ రాహుల్ ప్రత్యేక దృష్టి సారించి రూ.50 లక్షలతో సదుపాయాలు కల్పించారు. చిన్నారులు, యువత, మహిళలు ప్రశాంతంగా గడిపే వాతావరణం కల్పించారు. క్రీడాకారులు ఆటలాడే సౌకర్యం ఉంది. తృణధాన్యాలతో పాటు నాటు కోడికూర, కాల్చిన ఎండు చేపల పులుసు, ఆకుకూరల రుచి చూడవచ్చు. పర్యాటకుల సంఖ్య పెరగటంతో కేంద్రం రూ.కోటి మంజూరు చేసింది. 2. ఉత్సాహం ఉద్దీపకం విద్యార్థులకు ఇంగ్లిష్ పదాలు పలకాలంటేనే జంకు. గణితం అంటే బెరుకు. తెలుగు చదవడం, చూసి రాయటం అంటే బెంబేలెత్తేవారు. ఈ సమస్యకు విరుగుడుగా ఉద్దీపకం వర్క్ పుస్తకాలను తయారు చేయించారు. వీటి సాధనతో ప్రాథమిక స్థాయిలో చదువుకు పటిష్ఠ పునాది పడుతోంది. గత విద్యాసంవత్సరం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వారి సామర్థ్యం మేరకు ఇంగ్లిష్, గణితం పుస్తకాలు అందించారు.

# సాగుకు ఊతం.. రాయితీపై యంత్రం

కరీంనగర్ : అన్నదాతకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం(సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్)స్మామ్ పథకం అమలు చేస్తోంది. అందులో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి పలు రాయితీలు ఇస్తుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ వర్తిస్తుంది. గరిష్ఠంగా ఈ రాయితీ యూనిట్‌లో 50 శాతం వరకు ఉంటుంది. ఈ పథకం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి అన్ని రకాలు కలిపి 13,140 యంత్ర



పరికరాల కొనుగోలుకు రూ.10.4 కోట్ల రాయితీ ఇవ్వనున్నారు. ఆగస్టు నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

**దరఖాస్తు ఇలా..** ఆసక్తి ఉండి అర్హులైన రైతులు సంబంధిత గ్రామ ఏఈవోలకు రాయితీ యంత్రాల కోసం దరఖాస్తు చేయాలి. పట్టా పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు తదితర వివరాలు అందించాల్సి ఉంటుంది. అర్హులకు అందించే రాయితీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుంది.

**త్వరలో స్వీకరణ**

పథకం అమలుకు పూర్తి స్థాయి మార్గదర్శకాలు రాగానే అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. ఆసక్తి ఉన్న రైతులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. జె.భాగ్యలక్ష్మి, జేడీ, కరీంనగర్ వ్యవసాయశాఖ

# 'జాతీయ' భాగ్యం.. కల్పిస్తేనే ప్రయోజనం

ధర్మపురి : రాష్ట్రంలో 16 ప్రాంతాల్లో 1,767 కి.మీ.ల మేరకు రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు నివేదించాలని కేంద్రం గతంలో సూచించింది. ఈ మేరకు రాయపట్నం నుంచి కరీంనగర్ వరకున్న 60 కి.మీ.ల రోడ్డును జాతీయ రహదారిగా మార్చేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏ) మార్గదర్శకాలకు అనుగుణంగా వివరాలతో నివేదికలు సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ పంపించింది.

**మూడు జిల్లాల పరిధిలోకి..**

రాయపట్నం, కరీంనగర్, కోదాడ వరకు రూ.98 కోట్ల వ్యయంతో ఈ రహదారిని పూర్తి చేశారు. దీనికి ఆనుకొని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో పలు గ్రామాలున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి, మంచిర్యాల జిల్లాలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయాలతోపాటు.. పక్కన గోదావరికి అనుసంధానం చేసేలా భక్తులు, ప్రయాణికులు వేగంగా చేరుకునేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. తెదేపా హయాంలో నిర్మాణానికి పునాది పడగా.. అనంతరం వచ్చిన కాంగ్రెస్ హయాంలో దీనిని పూర్తి చేశారు. ధర్మపురి, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మండలాల్లోని వంద గ్రామాలను కలుపుతూ నిర్మించగా.. కేంద్రం నిధులు విడుదల చేస్తేనే ప్రయోజనం చేకూరనుంది.

**ఏళ్ల తరబడి మరమ్మతులు కరవు**


రాయపట్నం నుంచి కరీంనగర్ వరకున్న ఈ రహదారి మరమ్మతులను చేపట్టకపోవడంతో చాలాచోట్ల అధ్వానంగా మారింది. పలుచోట్ల ప్రమాదకర మలుపులు, మరోవైపు రోడ్డు మధ్య గుంతలు వెరసి తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేయాలని గతంలో ఆందోళనకు దిగిన ఘటనలున్నాయి. రాయపట్నం, ధర్మారం, చొప్పదండి ప్రాంతాల్లో గుంతలు ఏర్పడ్డాయి.

**మోక్షం కలిగితే భక్తులకు వరమే**

ధర్మపురి, గూడెం సత్యనారాయణస్వామి, గోదావరి స్నానాలకు వేలాది భక్తులు వస్తుంటారు. అయితే సరైన రవాణా సదుపాయాలు లేక భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్ నుంచి రాయపట్నం రావడానికి 60 కి.మీ.ల దూరానికి రెండు గంటలు పడుతుంది. ఆర్టీసీ బస్సులయితే రెండున్నర గంటల సమయం తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో నాలుగు వరుసల రహదారిగా మార్చినట్లయితే గంటలోపే కరీంనగర్ నుంచి రాయపట్నానికి చేరే అవకాశముంది.

# వీధికో సంఘం..!

సూర్యాపేట : ప్రభుత్వం ఆదేశాల మేరకు వీధి వ్యాపారులను సంఘాలుగా ఏర్పాటు చేసేందుకు మెప్మా సిబ్బంది చర్యలు చేపట్టారు. పురపాలికల్లో సర్వేచేసి మహిళా సంఘాల మాదిరిగానే వీరికి రుణసాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 14,866 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 10 మంది చొప్పున 51 సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకు ఖాతాలు తెరిచారు. వీరు ఒక్కొక్కరూ నెలకు రూ.100 చెల్లించాల్సి



ఉండగా, సంఘానికి నెలకు పది మందిసభ్యులు కలిసి రూ.1,000 చొప్పున ఆరునెలల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందిస్తారు.

**రుణాల మంజూరు ఇలా**

సంఘాలుగా ఏర్పాటైన వీధి వ్యాపారులకు మొదటి విడత రూ.75 వేలు, తర్వాత రూ.1.5 లక్షలు, సకాలంలో చెల్లిస్తే రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణం పొందవచ్చు. సంఘంలో చేరిన సభ్యులకు బీమా సదుపాయం కల్పించనున్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందితే వారికి బీమా వర్తిస్తుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**-రేణుక, మెప్మా ఇన్‌ఛార్జి డీఎంసీ, సూర్యాపేటవీధి వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ సంఘంగా ఏర్పడి రుణాలు పొంది వ్యాపారాలను విస్తరించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలి.

# కొండ'గట్టు' పంచాయితీ



మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో భూముల సరిహద్దు విషయంలో అటవీ, దేవాదాయ శాఖల మధ్య వివాదం తలెత్తింది. ఆలయ పరిసరాల్లోని అటవీ భూములను ఆక్రమించుకొని దేవాదాయ శాఖ అధికారులు నిర్మాణాలు చేపట్టారంటూ ఇటీవల జిల్లా అటవీ అధికారి ఆలయ ఈవోకు నోటీసు జారీ చేశారు. ప్రతిగా అంజన్న ఆలయానికి చెందిన భూమిలోనే అటవీ అధికారులు రహదారి నిర్మించారంటూ ఈ నెల 26న ఈవో డీఎఫ్‌వోకు నోటీసు పంపించారు.

**గోడ నిర్మాణంతో మొదటికి..**

వాస్తవానికి ఆలయ పరిసరాల్లో కొన్నేళ్ల క్రితమే పలు నిర్మాణాలు జరిగినప్పటికీ ఈ ఏడాది జనవరిలో అటవీ అధికారులు వివాదానికి తెర లేపారు. కొండపైన 'వై' జంక్షన్ నుంచి ఆలయానికి వెళ్లే దారి పక్కన జాలీతో కూడిన ప్రహరీ నిర్మాణం చేపట్టడానికి గుత్తేదారు చేత పనులు ప్రారంభించారు. ప్రహరీ నిర్మిస్తే భక్తుల వాహనాలు నిలపడానికి ఇబ్బందులు ఎదురవుతాయని ఆలయ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఏళ్ల కిందట భక్తుల వసతి కోసం నిర్మించిన భవనాలు, ధర్మసత్రం తదితర నిర్మాణాలు అటవీ భూముల్లోనే ఉన్నాయంటూ ఆ శాఖ అధికారులు దేవాదాయ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జోక్యం చేసుకొని అటవీ అధికారులు గోడ నిర్మించకుండా నిలిపివేయించారు. ఇటీవల 'వై' జంక్షన్ సమీపం నుంచి అటవీ ప్రాంతంలో గోడ నిర్మాణానికి నిర్ణయించడంతో సమస్య మొదటికొచ్చింది.

**బదిలీతో పరిష్కారం**

కొండపై అటవీశాఖకు దాదాపు వెయ్యి ఎకరాల భూములు, వాటికి ఆనుకుని ఆలయానికి 363.22 ఎకరాల భూములున్నాయి. ఒకవేళ ఆలయ నిర్మాణాలు అటవీ శాఖ భూముల్లో ఉన్నట్లు తేలితే ఆలయానికి చెందిన భూములను బదిలీ కింద ఆ శాఖకు స్వాధీనం చేయడానికి సుముఖంగా ఉన్నట్లు గతంలో ఆలయ అధికారులు వెల్లడించారు. పరస్పర నోటీసులే మరోసారి వివాదానికి కారణమయ్యాయి.

**సర్వే చేయించి గెజిట్‌లో హద్దులు చూపాలి**

ఆలయ ఆవరణలోని అటవీ భూముల్లో దేవాదాయ శాఖ నిర్మాణాలు చేపట్టిందనడం సరికాదు. అటవీ భూములను సర్వే చేయించి గెజిట్ ద్వారా హద్దులు చూపాలి. ఆలయ భూమిలో నుంచి రహదారి నిర్మించి అటవీ అధికారులు కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించారు. భక్తుల వసతి కోసం చేపట్టిన నిర్మాణాలను ఆలయ భూముల్లోనే చేపట్టాం. శ్రీకాంతరావు, ఆలయ ఈవో

**సమన్వయంతోనే ఆలయ అభివృద్ధి**

ఆలయ పరిసరాల్లోని ఆరు ఎకరాల అటవీ భూముల్లో దేవాదాయ శాఖ అధికారులు వివిధ నిర్మాణాలు చేపట్టారు. మరో నాలుగు ఎకరాల అటవీ భూమి కావాలని ఆలయ ఈవో మాకు వినతిపత్రం అందజేశారు. అయితే ఆ అధికారం మాకు లేదని, నిబంధనల ప్రకారం రాష్ట్ర నోడల్ అధికారిని కోరాలని సూచిస్తూ ఈవోకు లేఖ రాశాం. హద్దులపై రెవెన్యూ, అటవీ సర్వేయర్లతో ఉమ్మడి సర్వే చేయిస్తే వివాదం సమసిపోతుంది. రెండు శాఖల మధ్య సమన్వయం ఉంటేనే ఆలయ అభివృద్ధి జరుగుతుంది. రవిప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి

# నిరుపేదల కాలనీ.. సమస్యల లోగిలి



గోదావరిఖని : రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు నివాసముండే నగరపాలిక 46వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డివిజన్ల పునర్విభజన తర్వాత రాజీవ్‌నగర్‌లోని కొంతభాగంతో పాటు సంజయ్‌గాంధీనగర్, ఇందిరానగర్‌ను కలిపి 46వ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు దశాబ్దాల కిందట నిరుపేదలకు నివాసం కల్పించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఇందిరానగర్‌లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. సుమారు మూడేళ్ల కిందట ఇందిరానగర్ కూడలి నుంచి లూర్దునగర్ మీదుగా గౌతమినగర్ కూడలి వరకు, సంజయ్‌గాంధీనగర్ ఉపరితల జలాశయం నుంచి లూర్దునగర్ వరకు ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తిచేశారు. ప్రధాన రహదారిలో పలు వ్యాపార సంస్థలు ఏర్పడడంతో ఇందిరానగర్ ప్రాధాన్యత పెరిగినప్పటికీ ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

**ఇవీ ఇబ్బందులు..**

ఇందిరానగర్‌లోని పలు గల్లీల్లో కొన్నేళ్ల కిందట భూగర్భ మురుగు కాలువ నిర్మాణం కోసం సిమెంట్ రహదారులను తవ్వి పైపులు వేశారు. పైపుల కోసం తవ్వి మరమ్మతు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గల్లీల్లో ఇప్పటికీ బురద రహదారులే దర్శనమిస్తుంటాయి.

ఇటీవల టీయూఎఫ్ఐడీసీ నిధులతో కాలనీలోని ప్రధాన మురుగు కాలువ నిర్మాణం చేపట్టినప్పటికీ అంతర్గత మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది. కొన్ని గల్లీల్లో మురుగు కాలువల నిర్వహణ లేకపోవడంతో స్థానికులకు మురుగు తిప్పలు తప్పకపోగా, పందులు, దోమల బెడదతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనున్న గల్లీలోనే బోరుబావి పక్కనే మురుగు నీరు రోడ్డెక్కి పారుతోంది. చెత్త నిర్వహణ సైతం నామమాత్రంగానే సాగుతోంది. రామగుండం ఎరువుల కర్మాగారం వ్యర్థ జలాలతో పాటు వరద ఇందిరానగర్ మీదుగా గోదావరికి చేరుకుంటుంది. సుమారు మూడేళ్ల కిందట భారీ వరదలతో బూడిద చెరువు సమీపంలో మురుగు కాలువ పక్కనున్న నివాసాలు జలమయమయ్యాయి. తాజాగా కాలువ నిర్మాణంతో తిప్పలు తప్పినట్లుగా భావిస్తుండగా కాలువపైన నిర్మించిన కల్వర్టుకు అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో బురదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మురుగు కాలువల నిర్వహణ లేకపోవడంతో దుర్గంధం తప్పడం లేదు. అడ్డగుంటపల్లి నుంచి రాజీవ్‌నగర్, సంజయ్‌గాంధీనగర్ మీదుగా ఇందిరానగర్ కూడలికి చేరుకునే ప్రధాన రహధారిలో పలు చోట్ల వరద నిలుస్తుంటుంది. ఇటీవల రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి నుంచి సంజయ్‌గాంధీనగర్ వైపు రహదారి విస్తరణ చేపట్టినప్పటికీ రోడ్డుతో పాటు ఉపరితల మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో అటువైపు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

# కట్టారు.. కళ్లు మూసుకున్నారు!

సిరిసిల్ల : పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం అంటే చెత్తసేకరణ, వీధులు, మురుగు కాల్వలు శుభ్రం చేయడమే కాదు.. ప్రజల కనీస అవసరాలు తీర్చడమూ ప్రధానమే. అలాంటి వసతుల్లో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు వెనకబడ్డాయి. అందుకే ఇటీవల కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో వెనుకబడ్డాయి. జిల్లాలో నిత్యం రద్దీగా ఉండే సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడం కష్టంగా మారింది. పురుషులైతే ఎక్కడో ఒక చోట కానిచ్చేస్తున్నారు కానీ.. మహిళల బాధలు వర్ణణాతీతం. 2021లో రెండు పట్టణాల్లో వేలాది రూపాయలతో నిర్మించిన శౌచాలయాలు నిర్వహణలేక శిథిలావస్థకు చేరుకున్నాయి.

**ఇదీ పరిస్థితి**

జిల్లా కేంద్రం సిరిసిల్ల పట్టణంతోపాటు వేములవాడలో సుమారు 2 లక్షల జనాభా ఉంది. పట్టణానికి వచ్చేపోయేవారు వేలల్లో ఉంటారు. వేములవాడ ఆలయ పరిసరాల్లో మూడు ప్రాంతాల్లో బీవోటీ పద్ధతిలో నిర్వహించే శౌచాలయాలు ఉన్నాయి. ఇటు సిరిసిల్ల పట్టణంలో పాతబస్టాండ్, మార్కెట్ ఏరియా, అటవీశాఖ కార్యాలయం, గాంధీ కూడలి, మున్సిపల్ కార్యాలయం, జూనియర్ కళాశాల వెలుపల బీవోటీ (బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) నడిపించేవి మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఇవికూడా పురుషులే నిర్వహిస్తుండటంతో వాటిల్లోకి మహిళలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

2021లో సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రద్దీగా ఉండే ఎనిమిది ప్రాంతాలను గుర్తించి ఒక్కోటి రూ.11 వేల వ్యయంతో ఫ్యాబ్రికేటెడ్ నమూనాలో మరుగుదొడ్లు నిర్మించారు. కొన్నిరోజులపాటు పురపాలికలే చూసుకున్నాయి. సిబ్బందిలేక నిర్వహణ ఇబ్బందిగా మారడంతో మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రతిపాదించారు. దీనికి ఎవరూ ముందుకురాలేదు.

కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్ర ప్రభుత్వం, పురపాలికల భాగస్వామ్యంతో పట్టణాల్లో జనాభా సంచరించే ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు కోరారు. దీనిలో భాగంగా సిరిసిల్లలో నాలుగు, వేములవాడలో మూడు ప్రాంతాలను గుర్తించారు. దీనిలో చిన్నారులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు వేర్వేరుగా సీట్లతోపాటు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్మించనున్నారు. ఒక్కో సీటుకు రూ.15 వేల వరకు వెచ్చించనున్నారు.

పట్టణంలో శిథిలావస్థలోని శౌచాలయాలపై 'ఈనాడు' సిరిసిల్ల పురపాలిక ప్రజారోగ్యశాఖ ఏఈ నర్సింహాస్వామి దృష్టికి తీసుకెళ్లింది. బాగు చేయలేని పరిస్థితిలో ఉన్న శౌచాలయాలకు ప్రత్యామ్నాయంగా నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. రద్దీ ప్రాంతాల్లో కొత్తవి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

# ఖాతా నిర్వహణ.. పథకాలకు ఆలంబన

మిర్యాలగూడ : ప్రభుత్వ అందించే అనేక పథకాలకు బ్యాంకు ఖాతాల అవసరం ఏర్పడుతోంది. అనేక మంది వివిధ బ్యాంకు ల్లో ఖాతాలు తెరుస్తున్నారు. ఏదైనా పథకం కోసం ఖాతా తెరిచిన అనేక మంది ఆ తర్వాత ఆ ఖాతా నిర్వహణను వదిలేస్తున్నారు. కొన్నేళ్ల తర్వాత మరేదైనా పథకానికి అదే ఖాతా సంఖ్య ఇవ్వడంతో అది పనిచేయక.. రావాల్సిన లబ్ధి నిలిచిపోతుంది. అప్పుడు ఉరుకులు పరుగుల మీద బ్యాంకుకు వెళ్లి అధికారులకు మొర పెట్టుకోవాల్సి వస్తోంది.

**ఆరు నెలలు ఆగితే అంతే...**

బ్యాంకు ఖాతాలను ఆరు నెలల పాటు ఎలాంటి లావాదేవీలు జరపకపోతే ఇన్ ఆపరేటివ్‌గా మారిపోతుంది. ఈ స్థితిలోకి మారడానికి కొద్దిరోజుల వరకు ఖాతాదారుడికి సంక్షిప్త సందేశాలు వస్తాయి. వీటికి స్పందించకపోతే ఖాతా పూర్తిగా నిలిచిపోతుంది. ఖాతా పని చేయకుంటే తక్షణమే సంబంధిత బ్యాంకు శాఖను సంప్రదించి..సరిపడా పత్రాలతో ఈకేవైసీ చేయించుకోవాలి. దీనికి ప్రత్యేకంగా ఒక ఫారం నింపి అధికారులకు అందిస్తే ఈకేవైసీ పూర్తి చేసి ఖాతాను పునరుద్ధరిస్తారు.

**లావాదేవీలు నిర్వహించాలి..**

బ్యాంకు ఖాతా తెరిచిన తర్వాత కనీసం నెలకోసారైనా లావాదేవీలు




నిర్వహించడం మంచిది. దీని కోసం బ్యాంకుకు వెళ్లి లైన్లలో నిలబడాల్సిన అవసరం లేదు. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలతో పాటు ఏటీఎంలోనైనా బ్యాంకు ఖాతా సంఖ్యకు కొంత నగదు జమ చేస్తే సరిపోతుంది. దీని వల్ల బ్యాంకు ఖాతా ఆగిపోకుండా..ఉంటుంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా...**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన సుమారు 543 శాఖలు ఉన్నాయి. వీటిలో కొన్నేళ్ల క్రితం అనేక వేలాది మంది జీరో బ్యాలెన్స్‌తో పాటు వివిధ ఖాతాలను తెరిచారు. తీరా వీటిని నగదు జమ చేస్తూ నిర్వహించకపోవడంతో అనేక ఖాతాలు నిలిచిపోయాయి. దీంతో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రైతు భరోసా, రైతు బీమా వంటి సంక్షేమ పథకాలకు అవరోధంగా నిలుస్తున్నాయి. లబ్ధిదారుడిగా ప్రభుత్వం గుర్తించినప్పటికీ ఇన్ ఆపరేటివ్ ఖాతా సమస్యతో చివరి నిమిషంలో ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల బ్యాంకు సమయం సైతం వృథా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

**నిర్వహిస్తే మేలు**

శ్రామిక్, లీడ్ బ్యాంకు మేనేజర్, నల్గొండ.

ఏ బ్యాంకులోనైనా ఖాతా తెరిస్తే తప్పనిసరిగా ఆ ఖాతాను నిబంధనల ప్రకారం నిర్వహించాలి. ఇటీవల కాలంలో అన్ని బ్యాంకుల్లో ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ సేవలతో పాటు యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. అన్ని బ్యాంకులకు ప్రత్యేక మొబైల్ యాప్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించడం సైతం అంత కష్టమేమీ కాదు. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ..బ్యాంకు ఖాతాను అంతరాయం లేకుండా నిర్వహించుకోవచ్చు.

# పొరుగుతో.. పొలం పరుగు

రాజపేట : జిల్లాలో ఇటీవల వర్షాలు కురవగా వ్యవసాయ పనుల్లో కొంతమేర వేగం పుంజుకుంది. ఫలితంగా ఉన్న కొద్దిపాటి జలవనరులను ఉపయోగించుకుని రైతన్నలు ఆలస్యంగా వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఒకే సమయంలో వరినాట్ల కారణంగా కూలీల కొరత ఏర్పడింది. ఈ ప్రాంత రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఉపాధికోసం ఏపీ, మహారాష్ట్ర, బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీలు బృందాలుగా జిల్లాకు వస్తున్నారు. వలిగొండ, మోత్కూరు, రామన్నపేట, ఆలేరు, రాజపేట ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత, సమయాభావంతో నార్లు ముదిరిపోతుండటం కారణంగా వీరిచే వ్యవసాయ పనులు చేయించుకోక తప్పడం లేదని అన్నదాతలు అంటున్నారు.

**బృందాలుగా వస్తూ...**

జిల్లాలో సింహభాగం రైతులు ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలపైనే ఆధారపడి వ్యవసాయ సాగు పనులు చేపడుతుండటం గమనార్హం. ఇదే అదనుగా పొరుగు రాష్ట్రాలనుంచి వందలాది మంది కూలీలు బృందాలుగా తరలి వస్తున్నారు. ఒక్కో బృందంలో సుమారు పదిమంది వరకు ఉంటారు. ఆ బృందం సభ్యులు స్థానికంగా ఓ



వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకుంటారు. సదరు ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తి రైతులతో లావాదేవీలు చేపడుతున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పొరుగురాష్ట్రాల కూలీలు నాట్లు వేస్తున్నారు. గతంలో కేవలం పురుషులే ఉండగా తాజాగా మహిళలు, యువకులు ఉండటం గమనార్హం. స్థానికంగా అద్దెఇళ్లలో ఉంటూ తెల్లవారుజామునే తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి పొలాల బాట పడుతున్నారు. మడుల్లో సిద్ధమైన నారును వారే తెచ్చుకొని వరుస క్రమంలో నాట్లు వేస్తున్నారు. మధ్యవర్తి ద్వారా ఎకరాకు రూ.5 వేలు గంపగుత్తగా మాట్లాడుకున్న ఈ బృందం సభ్యులు రోజుకు సుమారు ఐదెకరాల వరకు నాట్లు వేస్తుండటం విశేషం.

**తగ్గిన శ్రమ, పెట్టుబడి..** సాధారణంగా మన దగ్గర పనిచేసే కూలీలు 10 నుంచి 12 మంది ఎకరంలో నారుతీసి వేస్తుండగా, పొరుగు రాష్ట్రాల కూలీలు అంతేమంది రెండున్నర ఎకరాల్లో వేస్తున్నారు. కొందరు నారు తీసి కట్టలు కట్టి మడుల్లో పంచుతుండగా, మరికొందరు వేగంగా నాట్లు వేస్తున్నారు. స్థానిక కూలీలకు రూ.7 వేలకు పైగా ఖర్చు అవుతుండగా ఇతర రాష్ట్రాల వారితో పని చేయిస్తే రూ.2 వేలు మిగులుతాయని అన్నదాతలు అంటున్నారు.

## తెల్లకార్డొస్తోంది.. రామక్కో..!

సూర్యాపేట : నూతన రేషన్‌కార్డు మంజూరు ఎప్పుడా.. అని ఎదురు చూస్తున్న అర్హుల కల నెరవేరబోతోంది. పదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. నూతన రేషన్ కార్డుల మంజూరు, పిల్లల పేర్లు చేర్చడం కోసం ఎంతోమంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. తొలుత మీ సేవలో దరఖాస్తు చేసుకున్న అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. గతంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల్లో చేసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఆర్ఐతో పాటు సిబ్బంది సర్వే చేసి అర్హుల వివరాలను నమోదు చేయగానే.. మండల స్థాయిలో తహసీల్దార్ లాగిన్, అక్కడ ఆమోదం తెలపగానే జిల్లా పౌర సరఫరాల అధికారి లాగిన్‌కు చేరుతుంది. కలెక్టర్ ఆమోదంతో కార్డులు మంజూరు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇప్పటికే లబ్ధిదారుల నుంచి మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అనంతరం ఆ దరఖాస్తులను తహసీల్ కార్యాలయాల్లో



అందించాల్సి ఉంది.

జిల్లాలో పదేళ్ల కాలంలో వేల మందికి వివాహమైంది. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి. ఫిబ్రవరి నెల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తుండటంతో లబ్ధిదారులు మీసేవ కేంద్రాలకు తరలి వెళ్తున్నారు. వివాహమైన దంపతులు కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయాలంటే మొదట సంబంధిత మండల తహసీల్ కార్యాలయాలకు వెళ్లి వారి తల్లిదండ్రుల కార్డుల నుంచి పేర్లు తొలగించుకోవాలి. అనంతరం మీ సేవలో కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తున్నారు. అలా తొలగించుకుండా మళ్లీ కొత్త కార్డు కోసదరఖాస్తు చేస్తే మంజూరు కాదని అధికారులు చెబుతున్నారు.

**14న పంపిణీకి ఏర్పాట్లు**

జిల్లాలో కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ నెల 14న తుంగతుర్తిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. మంజూరైన కార్డులను సిద్ధం చేస్తున్నారు.

## భద్రాద్రి.. భక్తాద్రి..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. 2024 జూన్‌లో 2,03,210 మంది దర్శించుకోగా ఈ సంవత్సరం జూన్‌లో భక్తుల సంఖ్య 2,43,512కు చేరింది. సాధారణంగా దేవాదాయశాఖ జూన్ మాసాన్ని అన్ సీజన్‌గా భావిస్తుంది. అయినప్పటికీ గత జూన్‌తో పోల్చితే ఈసారి 40,302 మంది అధికంగా స్వామివారిని దర్శించుకోవటం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆధ్యాత్మిక చింతన పెరగటంతో పాటు ఇక్కడ సదుపాయాలు మెరుగుపడుతుండటంతో ఆ స్థాయిలో రద్దీ కనిపిస్తుందని ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. 2024లో 23.47 లక్షల మంది భక్తులు దర్శనానికి తరలివచ్చారు. అప్పట్లో మొదటి ఆరు నెలల్లో 13,69,735 మంది దర్శించుకున్నారు.

**అర్ధ సంవత్సరం ఆశాజనకం**

2025లో మొదటి మూడు నెలల్లో భక్తుల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ



తదనంతరం సందడి పుంజుకుంది. జనవరి నుంచి జూన్ వరకు 14,78,356 మంది సీతారాముల వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గతేడాది తొలి అర్ధ సంవత్సరం కంటే ఈసారి లక్ష మందికి పైగా భక్తుల సంఖ్య పెరగటం గమనార్హం. అదే స్థాయిలో రాములోరి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 50 రోజుల హుండీ ఆదాయాన్ని జూన్ 26న లెక్కించగా రూ.1.97 కోట్ల నగదుతో పాటు ఇతర కానుకలు లభించాయి. ఇదే ఒరవడి కొనసాగితే ఈ ఏడాది జులై నుంచి డిసెంబరు వరకు రాబడి ఆశాజనకంగా ఉంటుందని ఆలయాధికారులు భావిస్తున్నారు. రూ.70-80 కోట్ల నుంచి రూ.100 కోట్లకు రామాలయం వార్షికాదాయం చేరితే భద్రాద్రి నిత్యం భక్తాద్రిగా సాక్షాత్కరిస్తుంది.

## లెక్కలు కాదు.. మొక్కలు నాటాలి..!

కొత్తగూడెం : వన మహోత్సవానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం 33శాతానికి పెంచటమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ఈ ఏడాది వివిధ శాఖల భాగస్వామ్యంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కోటికిపైగా మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించింది. గ్రామ పంచాయతీలు, పురపాలికలు, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను పెంచుతోంది. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రైతుల పొలంగట్లు, అటవీశాఖ ప్లాంటేషన్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించింది. ఈసారి వన మహోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించకపోవటంతో మొక్కలు నాటే కార్యక్రమం ఆలస్యమవుతోందని సమాచారం. గతంలో అనేక శాఖలు లక్ష్యం మేరకు మొక్కలు నాటకపోయినా, నాటిన వాటిని సంరక్షించకపోయినా.. అంతా బ్రహ్మాండంగా ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపించేవి. ఈసారి వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

**వృథాకు అడ్డుకట్ట వేస్తేనే పచ్చదనం**

గత కొన్ని దఫాలుగా నిర్వహిస్తున్న వన మహోత్సవం(తెలంగాణకు హరితహారం) కార్యక్రమంలో మొక్కలు వృథా 50శాతం పైగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే గ్రామాలు, పట్టణాల్లో మొక్కలను అధికారులు పంపిణీ చేశారని చెబుతున్నారు. మొక్కల పెంపకం, వాటి రవాణాకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అవసరమున్నచోటే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 'వన మహోత్సవం కింద ఇళ్ల పంపిణీ చేసే మొక్కలను అధికారులు పరిశీలించాలి. నాటిని నాటడంతో పాటు సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కో-ఆర్డినేట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి' అని ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్పష్టం చేశారు.

# వస్త్రంతో నేస్తం..బ్రహ్మాస్త్రం



మిర్యాలగూడ : ఏదైనా దుకాణం వద్దకు వెళ్లి వస్తువులు తీసుకునే ముందు ప్రతి ఒక్కరూ అడిగే ఏకైక వస్తువు కవర్. గతంలో మార్కెట్‌కు, బయటకు ఎక్కడికి వెళ్లినా చేతిలో వస్త్రంతో చేసిన సంచీని తీసుకెళ్లే వారు. కానీ నేటి సమాజంలో ఆ సంప్రదాయం నామోషీగా మారి..చేతిలోకి రంగు రంగుల అందమైన డిజైన్లలో ఉన్న ప్లాస్టిక్ కవర్లు వచ్చాయి. విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ సంచులతో పర్యావరణ పరంగా, ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగించేందుకు ఏటా జులై 3న 'అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా...**

నిషేధం అమల్లో ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ప్లాస్టిక్ సంచుల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. పట్టణాల్లోని వ్యర్థాల కుప్పలను పరిశీలిస్తే వాటిలో 80 శాతం ప్లాస్టిక్ కవర్లే ఉండడం గమనార్హం. నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, భువనగిరి తదితర పట్టణాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూరగాయల మార్కెట్లు, కిరాణా దుకాణాలు, పండ్లు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారులు, కర్రీ పాయింట్లు, మిల్క్ సెంటర్లు తదితర ప్రదేశాల్లో నిషేధిత ప్లాస్టిక్ సంచులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

**ప్రజల్లోనే మార్పు రావాలి...**

మన్నెం శ్రీధర్‌రెడ్డి, మన మిర్యాలగూడ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణానికి, ఆరోగ్యానికి హాని కలుగుతుందని తెలిసినప్పటికీ వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్లాస్టిక్ వాడకం తగ్గాలంటే తొలుత ప్రజల్లో మార్పు రావాలి. బయటకు వెళ్లేటప్పుడు వస్త్రం, జనపనార సంచీని పట్టుకెళ్లాలి. టిఫిన్లు, మాంసం, పాలు, పెరుగు కొనేందుకు స్టీల్ డబ్బాలు వినియోగిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. మేము పలు గ్రామాల్లో వేలాది జనపనార సంచులు పంపిణీ చేసినప్పటికీ..వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు సైతం తరచూ తనిఖీలు నిర్వహిస్తూ..నిషేధిత ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నియంత్రించాలి.

# ఇసుక కొరత.. లబ్ధిదారుల కలత!



భువనగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగం పుంజుకొన్నాయి. జూన్ 2 తరువాత మంజూరు పత్రాలు జారీ చేసిన ఇళ్లకు ముగ్గులు పోస్తున్నారు. చాలాచోట్ల పునాది పనులు సాగుతున్నాయి. మొదటి దశలో మంజూరైన 728 ఇళ్లలో సుమారు 164 ఇళ్ల కప్పు వరకు వచ్చాయి. త్వరితగతిన ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తుండటంతో ఇకపై వేగంగా పనులు జరగనున్నాయి. ఇసుక కొరత ప్రధాన సమస్యగా మారింది.

మార్కెట్‌లో ఇసుక టన్నుకు రూ.1500 నుంచి రూ.1700 వరకు లభిస్తుంది. ఇంత ధరను భరించే శక్తి లేక, పనులు ముందుకు సాగించలేకపోతున్నారు. ట్రాక్టర్‌కు నాలుగు టన్నులు వస్తుంది. బెస్మెంట్ పూర్తిచేసేందుకు రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దాదాపు ఇసుకకే రూ.12 వేల నుంచి రూ.13,600 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. పునాది తదుపరి గోడల నిర్మించేందుకు పూర్తిగా సిమెంట్, ఇసుక అవసరం ఉంటుంది. ఒక ఇల్లు పూర్తి చేయడానికి 8 నుంచి 10 ట్రాక్టర్ల ఇసుక అవసరమని హౌసింగ్ కార్పొరేషన్ పీడీ విజయ్‌సింగ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 400 చ.గ.ఇల్లు పూర్తి చేసేందుకు 8 ట్రాక్టర్లు, 600 చ.గజాల ఇల్లు పూర్తి చేసేందుకు 10 ట్రాక్టర్లు అవసరం. ముఖ్యంగా భువనగిరి పట్టణం, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**స్థానిక వనరులపై దృష్టి**

ఇసుక కొరత తీర్చి లబ్ధిదారులకు సులభంగా లభ్యమయ్యేలా స్థానికంగా ఉన్న దాన్ని వినియోగించుకోవడంపై జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టింది. వాగుల నుంచి ఇసుక తరలించేందుకు కలెక్టర్ హనుమంతరావు అనుమతించారు. అనుమతులు ఎలా ఇవ్వాలన్న విషయంపై ఆలోచిస్తున్నామని అదనపు కలెక్టర్(రెవెన్యూ) జి.వీరారెడ్డి తెలిపారు. వాగుల్లో ఇసుక లభ్యత ఏ మేరకు ఉందో గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. నివేదిక సమర్పించాలని గనులశాఖ ఏడీకి ఆదేశాలు జారీచేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. విధివిధానాలు ఖరారు చేయలేదు.

జిల్లాలోని బిక్కేరు, ఆలేరు వాగుల నుంచి ట్రాక్టర్లలో తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇవి కాకుండా ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, వలిగొండ, మోత్కూరు, గుండాల, మోటకొండూరు, అడ్డగుడూరు, భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం వాగులు, కాలువ నుంచి కూడా తీసుకువెళ్లేందుకు అనుమతించాలని అధికారులు యోచిస్తున్నారు.సీనరేజీ ఛార్జీలు లేకుండా ఉచితంగా సరఫరా చేసుందుకు నిర్ణయించామని, త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని అదనపు కలెక్టర్(రెవెన్యూ) జి.వీరారెడ్డి వివరణ ఇచ్చారు.

# కొంపలు ముంచేలా.. సంచి

భువనగిరి : మనం రోజూ పాలిథిన్ సంచులను వాడతాం. పడవేస్తాం. అవన్నీ ఎక్కడికెళ్తున్నాయి? ఏమవుతున్నాయి? మట్టిలో, నీళ్లలో కరగవు. మంటలో కాలిపోవు. మురుగు కాలువల్లో పడేస్తే నీటి ప్రవాహానికి అడ్డం పడుతున్నాయి. మిగిలిపోయిన ఆహారాన్ని ఈ సంచుల్లో మూటగట్టి బయటకు విసిరేస్తే పశువులు వాటిని తింటూ జీర్ణం కాక పేగులకు చుట్టుకుని చనిపోతున్నాయి. వీటన్నింటిని కుప్ప చేసి కాల్చివేస్తే విష వాయువులు వెలువడి అనారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. సౌకర్యంగా, నాజూగ్గా, రంగురంగుల్లో ఉన్నాయని పాలిథిన్ సంచులను ఉపయోగిస్తే జరుగుతున్న నష్టాలివి.

జిల్లాలో 7,39,448 జనాభా.. 1,80,677 కుటుంబాలున్నాయి. పురపాలికల్లో ప్రతి మనిషి సగటున రోజుకు మూడొందల గ్రాముల చెత్తను ఉత్పత్తి చేస్తారని, అందులో 40శాతం పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ ఉంటుందని ఒక అంచనా. ప్రమాదాన్ని గుర్తించి 120 మైక్రాన్ల లోపున్న పాలిథిన్ సంచులను ఉపయోగించకుండా నిషేధించారు. మైక్రాన్ అంటే అంగుళంలో 25వేల వంతు. దాదాపు వెంట్రుక మందం కంటే తక్కువ. ఇవి రీసైక్లింగ్‌కు పనికి రావు. ఇవి చౌకగా లభిస్తున్నందున వ్యాపారులు ఉచితంగా విరివిగా ఇస్తున్నారు. 120 మైక్రాన్ల మందానికి మించిన సంచులను ఎక్కువ సార్లు ఉపయోగించవచ్చు. పాలిథిన్ సంచుల నిషేధం పురపాలికల్లో నామమాత్రంగా అమలవుతోంది.

**ఆలేరు పురపాలికలో..**

ఆలేరు పుర పరిధిలో రోజుకు 20 కిలోల ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతుంది. పురపాలికలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి గత రెండు నెలల్లో 18 మంది వ్యాపారులకు సుమారు రూ.10 వేలు జరిమానా విధించారు.



**యథేచ్ఛగా వినియోగం..**

భువనగిరి పట్టణంలో సింగిల్ యూజ్ కవర్లను ప్రభుత్వం నిషేధించింది. పుర అధికారులు పట్టించుకోని కారణంగా వీటి వినియోగం జోరుగా కొనసాగుతుంది. పట్టణంలోని 35 వార్డుల నుంచి నిత్యం 24 మెట్రిక్ టన్నుల చెత్తను తరలిస్తున్నారు. వీటిలో ప్లాస్టిక్ కవర్లూ వస్తున్నాయి. ఏడాదిగా పుర అధికారులు ఎనిమిది దఫాలుగా తనిఖీలు నిర్వహించినట్లు చెబుతున్నారు. స్వల్పంగానే కవర్లు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. రూ.11 వేల జరిమానా వసూలు చేసినట్లు మున్సిపల్ రికార్డులు తెలుపుతున్నాయి.

**ప్లాస్టిక్‌ను వేరు చేసి రీసైక్లింగ్‌కు ఇస్తున్నాం..**

మాతంగి రేణుకుమార్, పర్యావరణ ఇంజినీర్, చౌటుప్పల్ పురపాలిక చౌటుప్పల్ పుర పరిధిలో రోజుకు 10 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. అందులో పొడి చెత్త నుంచి రోజుకు నాలుగొందల కిలోల పాలిథిన్, ప్లాస్టిక్‌ను పారిశుద్ధ్య సిబ్బందితో వేరు చేయిస్తున్నాం. ఇటీవల పుర కమిషనర్ సూచన ప్రకారం ప్లాస్టిక్ చెత్తను ఇదే మండలంలోని ఎస్.లింగోటంలోని సహస్ర ఎన్విరో కంపెనీకి తరలిస్తున్నాం. ఆ పరిశ్రమలో పాలిథిన్, ప్లాస్టిక్ చెత్త నుంచి డీజిల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

## నీరు లేక.. గుండారం వెలవెల

కమాన్‌పూర్ : నాలుగు మండలాల వరప్రదాయిని, కల్పతరువు అయిన గుండారం జలాశయం అడుగంటింది. మొన్నటి వరకు నిండుకుండలా ఉండగా.. ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుంది. దీంతో జలాశయం ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతనెల రోజులకుపైగా నీటిని విడుదల చేస్తున్న ఎస్సారెస్పీ, రెవెన్యూ, ఇతర శాఖ అధికారులు 'మాములు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొన్నటివరకు రాత్రివేళలో నీటిని విడుదల చేయగా.. నేడు పగలు సైతం వదులుతున్నారు.

**అవసరం లేకున్నా విడుదల**

వేసవికాలంలో రామగిరి, మంథని, ముత్తారం మండలాల రైతుల పంట పొలాలకు విడతల వారీగా నీటిని కాపాడుకుంటూ సరఫరా చేసిన అధికారులు.. ప్రస్తుతం అవసరం లేకున్నా నిమ్మకు నీరెత్తినట్లు



వ్యవహరిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. జలాశయం నీటి మట్టం 12 అడుగులుకాగా.. ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయింది. రుతుపవనాలు మురిపించి మొహం చాటేయడంతో.. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న నేపథ్యం జలాశయంలో నీరు లేకపోవడంతో సాగుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**చేపల వేటకే(నా)!**

ఈ ఏడాది వరుణుడు కరుణించకపోతే పరిస్థితి ఏంటనేదానిపై రైతులు కలవరపడుతున్నారు. ఇప్పటికైనా నీటి విడుదలకు అడ్డుకట్ట వేసి.. విడుదల చేసేవారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అయితే జలాశయాన్ని సుమారు రూ.70 లక్షలకు కొనుగోలు చేసినవారు.. చేపలు పట్టేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి నీరు ఉండగానే చేపలు పట్టాల్సి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు.

## లక్షలు వెచ్చించి.. వినియోగం మరిచి

సారంగాపూర్ : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఊరూరా డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్(కంపోస్టు) షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టగా తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున వ్యయం చేశారు. ఆరంభంలో కొన్ని పంచాయతీలు ఎరువు తయారు చేసినప్పటికీ వ్యయం అధికంగా ఉండడం, పంచాయతీలలో సిబ్బంది కొరతతో మానేశారు. కొద్ది రోజులు ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టడంతో తయారు చేసిన ఎరువును చూపించారు. కొన్నేళ్లుగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా మానేయడంతో రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన షెడ్లు నిరుపయో గంగా ఉంటున్నాయి.

**సిబ్బంది లేక ఇబ్బంది**

గ్రామ జనాభా ప్రాతిపదికన పంచాయతీ కార్మికులను నియమించుకో వాల్సి ఉంటుంది. ఒక్కో పంచాయతీలలో ఒక్కరు, ఇద్దరు మినహా ఎక్కువగా నియమించుకునే అవకాశం లేదు. నియమించుకున్న ఒకరిద్దరు చెత్త ట్రాక్టర్ నడపడమే కాకుండా, నీటి సరఫరా, చెత్త సేకరణ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చే సమయం ఉండడంలేదు. అధికారులు ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చేందుకు అవకాశం కల్పిస్తే పంచాయతీలకు ఆదాయంతోపాటు లక్ష్యం నెరవేరనుంది.

**భారంగా చెత్త తరలింపు**



కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదల లేకపోవడంతో చెత్త తరలింపు భారంగా మారింది. ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లకు కిస్తీలు చెల్లించలేని పరిస్థితి కొన్ని పంచాయతీల దైతే.. మరికొన్ని పంచాయతీలకు నిధులు లేక మరమ్మతు చేయించలేక మూలన పడేశారు. పంచాయతీల ట్రాక్టర్‌తోపాటు ఇతర పరికరాలు కూడా కొనుగోలు చేసి వినియోగించకుండా పక్కన పడేయడంతో ప్రజాధనం వృథా అవుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరుచేసి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

**కానరాని సేంద్రియ ఎరువు తయారీ**

గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడి సెగ్రిగేషన్ షెడ్లలో ప్రత్యేకంగా నిర్మించిన చిన్న గదులలో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్, ఇతర వస్తువులు వేరు చేయాల్సి ఉంటుంది. తడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. ఎరువును గ్రామాల్లోని హరితహారం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వినియోగించాలి. మిగిలిన ఎరువును రైతులకు విక్రయి ంచాలి. ఎక్కడ కూడా సేంద్రియ ఎరువు తయారీ చేపట్టడం లేదు.

# ఆశల 'ధర'హాసం

కలిదిండి : రొయ్యల ధరలు క్రమంగా పెరుగుతుండటంతో సాగుదారుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ తొలివారం నుంచి జూన్ నెలాఖరు వరకు 100 కౌంటు కిలో ధర కేవలం రూ.210-230 మధ్యలోనే ఉండటంతో రైతులు భారీగా నష్టపోయారు. దీంతో ఆగస్టు పంటపై సందిగ్ధంలో పడ్డారు. 15 రోజులుగా 100 కౌంటు కిలో ధర రూ.255పై నిలకడగా ఉండటంతో ఖాళీ అయిన చెరువులను సాగుకు సిద్ధం చేస్తున్నారు.

పదిహేను ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నా.. ధరల పతనం, అకాల వర్షాలు, వ్యాధులు కారణంగా రూ.18 లక్షలు నష్ట పోయా. ఈసారి పంట వేయకూడదని నిర్ణయించుకున్నా. 15 రోజులుగా ధరలు



నిలకడగా ఉండటంతో సాగుకు సన్నద్ధమవుతున్నా' అని చెబుతున్నారు కలిదిండికి చెందిన రొయ్యల రైతు రాజా.

**నిలకడగా ధర..** ఆక్వాలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా 'ధర' ఆశాజనంగా ఉంటే.. సాగు చేయడానికి రైతులు ఏమాత్రం సంకోచించరు. ఎప్పుడైతే ధరల పతనం వెంటాడుతుందో.. పెట్టుబడులు మట్టిలో కలిసి పోయినట్లే. నాలుగు నెలల తర్వాత 100 కౌంటు కిలో ధర రొయ్యల రూ.255కి చేరడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**సాగుకు సన్నద్ధం..** ఉమ్మడి జిల్లాలోని 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దీనిలో 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యలు పండిస్తున్నారు. ప్రస్తుతం 90 వేల ఎకరాలు ఖాళీ అయిపోయాయి. ఆగస్టు నుంచి పంట కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ ధరలు నిలకడగా కొనసాగితే గతం తాలూకూ నష్టాలు పూడ్చుకోవచ్చని రైతులు భావిస్తున్నారు.

# దుకాణం తెరిచారు.. అద్దె మరిచారు

జంగారెడ్డిగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాల అద్దె బకాయిలు అక్షరాలా రూ.95 లక్షలు. ఈ భవనాల నిర్వహణతోపాటు, అద్దెల వసూళ్లను కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో పలు చోట్ల దుకాణాలు పొందిన వారిలో కొందరు అద్దెలు ఎగవేయడం, సబ్‌లీజులకు ఇవ్వడం వంటివి పరిపాటిగా మారింది. అనర్హులు దుకాణ సముదాయాల్లో తిష్ఠ వేసి ఏళ్ల తరబడి వ్యాపారాలు చేస్తున్నా..పట్టించుకొనే నాథుడు లేకపోయాడని అర్హులైన నిరుద్యోగ యువత వాపోతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 37 చోట్ల 218 దుకాణాలు ఉన్నాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో వీటిలో ప్రస్తుతం 130 మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

**బకాయిలు అక్షరాలా రూ.95 లక్షలు**

ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.1.20 కోట్ల వరకు బకాయిలు ఉండగా.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వసూళ్లపై ఎస్సీ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఆయన దుకాణదారుల వద్దకు వెళ్లి అతిక్రమణలు, సబ్‌లీజుల విషయంపై పరిశీలన చేశారు. దీంతో సుమారు రూ.25 లక్షల వరకు వసూళ్లు జరిగాయి. మిగిలిన రూ.95 లక్షల బకాయిలపైనా దృష్టి పెట్టామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి తెలిపారు. బకాయిదారులు, నిబంధనలు పాటించని వారిని ఖాళీ చేయించి కొత్తవారికి కేటాయిస్తామన్నారు. దీనిపై జేసీకి నివేదిక అందించనున్నట్లు చెప్పారు.

**అయిదేళ్లుగా వదిలేశారు**

గత ప్రభుత్వంలో వీటి నిర్వహణ పూర్తిగా విస్మరించడంతో కొన్ని చోట్ల శ్లాబ్‌లు పాడవగా, మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఏలూరు జిల్లా భీమడోలులో ఆరు దుకాణాలు పూర్తిగా శిథిలమవడంతో కలెక్టర్ ఆదేశాలతో కూల్చేశారు. బొమ్మిడి, బుట్టాయగూడెం, చింతలపూడి, కామవరపుకోట, నిడమర్రు, పరింపూడిలలో మరమ్మతులకు వచ్చాయి. పశ్చిమగోదావరిలోని తాడేపల్లిగూడెం, శృంగవృక్షం, వీరవాసరం, కోపల్లె, ఉండి ఎన్‌ఆర్‌పి అగ్రహారం, ఆచంటలో దుకాణాలు బాగా దెబ్బతిన్నాయి. కరుగోరుమిల్లి, అత్తిలి, కాల్దరి, యలమంచిలి, చించినాడలో శ్లాబ్‌లు పాడవగా దొడ్డిపట్ల, కాళ్ల, పెంటపాడు, పండితవల్లూరు, గణపవరంలో పాక్షిక మరమ్మతులకు గురయ్యాయి. భీమవరం రాయలంలోని 4 దుకాణాలు పూర్తిగా శిథిలమయ్యాయి. పాడైన భవనాలు మరమ్మతులు చేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఏలూరు జిల్లాలోని 29 దుకాణాల మరమ్మతులకు రూ.44.50 లక్షలతో ప్రతిపాదించినట్లు ఈడీ తెలిపారు.

# దశాబ్దాల కల నెరవేరనుందా?

మార్కాపురం : తమ చెరువు కట్టను ట్యాంక్‌బండ్‌గా చూడాలన్న మార్కాపురం వాసుల దశాబ్దాల కల కలగానే మిగిలిపోతోంది. గతంలో రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా..ఆ తరువాత కాలంలో ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. త్వరలో జిల్లాగా మారనున్న మార్కాపురానికి ట్యాంక్ బండ్ పర్యాటకంగా కూడా ఉపయోగపడుతుందని ఇప్పటికైనా ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**రూపుదాల్చని ప్రతిపాదనలు** 2016 తెదేపా ప్రభుత్వ హయాంలో మార్కాపురం వచ్చిన సందర్భంగా అప్పటి రోడ్ల-భవనాల శాఖ మంత్రి శిద్దారాఘవరావు చెరువుకట్టకు నిధులు కేటాయించి ట్యాంక్‌బండ్ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు చెరువు కట్టను అభివృద్ధి చేసి మధ్యలో డివైండర్లు, లైటింగ్, బెంచీలు, చెట్లతో సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్ల నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపారు. తరువాత ప్రభుత్వం మారడంతో దీని ఊసే మరచిపోయారు. గత అయిదు సంవత్సరాల వైకాపా ప్రభుత్వంలో చెరువుకట్ట అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడంతో ట్యాంక్‌బండ్ నిర్మాణం ఒక కలగానే మిగిలిపోయింది. **కేటాయించిన నిధులను రోడ్లకు...**


2004వ సంవత్సరంలో చెరువుకట్ట విస్తరణకు అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. అప్పుడు రేడియోస్టేషన్ నుంచి గడియారస్తంభం వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆ నిధులను సీసీ రోడ్డుకు కేటాయించి పనులు పూర్తి చేశారు. దీంతో చెరువుకట్ట విస్తరణ ఆగిపోయింది. ఆ తరువాత ఇప్పటి వరకు రోడ్డు విస్తరణకు గానీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి గాని ఒక్క రూపాయ నిధులు రాకపోవడం గమనార్హం.

రూ.44 కోట్లతో ప్రతిపాదనలు

– ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం

మార్కాపురం చెరువు కట్టను ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు రూ.44కోట్లతో ప్రతిపాదనలు పంపాం. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో మాట్లాడాను. ఆయన ఆమోదం తెలియజేశారు. ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని నిధులు మంజూరు చేస్తే త్వరలో టెండర్లు పిలిచి ప్రక్రియను మొదలు పెడతాం

# తలూపారు.. తాఖీదులు అందుకున్నారు!



చిత్తూరు : వైకాపా హయాంలో నిబంధనలకు పాతరేసి అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించిన తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిలో వణుకు మొదలైంది. నాడు పేదలకు ప్రయోజనం కలిగించేందుకు ఉత్తర్వులు ఇచ్చామని జగన్ సర్కార్ గొప్పలు చెప్పుకోగా.. ఆ పార్టీలోని పెత్తందారులు అర్హత లేకున్నా పట్టా భూములుగా చేసుకుని తమ అధికారాన్ని ప్రదర్శించారు. ఇందుకు కొందరు అధికారులను పావులుగా వాడుకున్నారు. నాటి అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఏడాదిపాటు పునఃపరిశీలన చేసి చర్యలకు ఉపక్రమించింది. బాధ్యులైన తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వోలకు సీసీఎల్‌ఏ నుంచి తాఖీదులు రావడంతో ఆందోళన చెందుతున్నారు.

ఇరవై ఏళ్లకుపైగా పేదల అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్లు 2023 డిసెంబరులో నాటి జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు.. 2003 సంవత్సరానికి ముందు జారీ చేసిన అసైన్‌మెంట్ భూములను మాత్రమే ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చాలి. దీనికి భిన్నంగా వైకాపా నేతలు చెప్పారని.. జలవనరులు, పశువుల మేత, కుంట పోరంబోకు, ప్రభుత్వ భూములకు, 2003 తర్వాత కేటాయించిన భూములకూ ఫ్రీ హోల్డ్ హక్కులు కట్టబెట్టారు. మేమే జాబితాలు పంపిస్తామని.. మీరు సంతకాలు చేస్తే చాలని వైకాపా నేతలు హుకుం జారీ చేయడంతో కొందరు వ్యతిరేకించగా.. మరికొందరు గుడ్డిగా తలూపారు.

**ఏమని సమాధానమిస్తారో?**

ప్రస్తుతానికి చిత్తూరు జిల్లాలో వెదురుకుప్పం, కుప్పం, వి.కోట, బంగారుపాళ్యం తహసీల్దార్లకు రెండు రోజుల క్రితం సీసీఎల్‌ఏ నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించిన వ్యవహారంపై సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ఏమని సమాధానమిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైకాపా నేతలు ఒత్తిడి చేశారని జవాబిస్తారా? లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించామని చెబుతారా? అన్నది తెలియాలి. తిరుపతి జిల్లాకు సంబంధించి కూడా మరికొన్ని రోజుల్లో తాఖీదులు జారీ కానున్నాయి.

**చిత్తూరులో 74 శాతం.. తిరుపతిలో 58 శాతం**

ఫ్రీ హోల్డ్ అక్రమాలు చిత్తూరు జిల్లాలోనే ఎక్కువగా జరిగాయి. 1.59 లక్షల ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించగా ఇందులో నిబంధనలు అతిక్రమించి చేసినవి 1.18 లక్షల ఎకరాలు(74.21 శాతం). ప్రధానంగా వి.కోట, బంగారుపాళ్యం, వెదురుకుప్పం, కుప్పం మండలాల్లోనే ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. తిరుపతి జిల్లాలో 79,169.42 ఎకరాలకు యాజమాన్య హక్కులు ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా జరిగినవి 45,918 ఎకరాలు(58 శాతం). ఇందులో అసైన్డ్ భూములే దాదాపు 40 వేల ఎకరాలున్నాయి. గూడూరు, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలో అత్యధికంగా అక్రమాలు జరిగాయి. రేణిగుంట, ఏర్పేడు, వాకాడు మండలాల్లోనే ఎక్కువగా అవకతవకలు ఉన్నట్లు పునః పరిశీలనలో తేలింది. ఇప్పటికే జిల్లాల కలెక్టర్లు వీటిపై గతంలో పనిచేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలకు నోటీసులు ఇచ్చారు. ఫ్రీ హోల్డ్‌పై.. జేసీ, కలెక్టర్లు మరోసారి క్షుణ్నంగా విచారణ జరిపి సీసీఎల్‌ఏకు నివేదిక పంపారు.

తిరుపతి జిల్లాలో ఫ్రీ హోల్డ్ చేసిన భూములు: 79,169.42 ఎకరాలు

నిబంధనలకు విరుద్ధంగా జరిగినవి: 45,918 ఎకరాలు

# తీరంలో కాసుల వేట



అల్లవరం : గోదావరి నది.. సముద్ర తీరం.. పట్టా భూములు.. ప్రాంతం ఏదైనా లెక్కలేదు. ఇసుక తరలింపునకు అడ్డూఅదుపూ లేదు. ఇదీ అల్లవరం మండలం తీర ప్రాంత గ్రామాల్లో అక్రమార్కుల తీరు. ఓడలరేవు, కొమరగిరిపట్నం, నక్కారమేశ్వరం పరిధిలో డి.పట్టా భూములు, సీఆర్‌జడ్ పరిధి నుంచి తువ్వ ఇసుకను యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**డి.పట్టా భూములపై కన్నేసి..**

ఓడలరేవు, కొమరగిరిపట్నం పరిధిలో సముద్ర తీరానికి ఆనుకుని గతంలో కుల వృత్తుల వారి కుటుంబ పోషణకు ప్రభుత్వ భూముల్లో డి.పట్టాలు అందించారు. వాటిలో సరుగుడు, ఇతర పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వీటిపై ఇసుకాసురుల కన్ను పడటంతో పట్టాదారులకు కొంత ఇచ్చి భూములను స్వాధీనం చేసుకుని తవ్వేస్తున్నారు.

**కొరతే ఆసరాగా..**

ప్రస్తుతం భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గోదావరిలో వరద ప్రవాహం ఉండటంతో పునాదులను నింపేందుకు తువ్వ ఇసుకకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో కొమరగిరిపట్నం, అరగట్లపాలెం, ఓడలరేవు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు రోజుకు 30 నుంచి 40 ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో లోడు రూ.2వేల నుంచి రూ.2,500 ధరకు విక్రయిస్తున్నారు. నిత్యం రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు అక్రమార్జన చేస్తున్నారు. ఇక్కడి నుంచి బెండమూర్లంక, తుమ్మలపల్లి, మొగళ్లమూరు, దేవగుప్తం, గోపాయిలంక తదితర ప్రాంతాలకు తరలుతోంది. సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలు తీర ప్రాంతానికి రక్షణగా నిలుస్తాయి. అక్రమార్కులు తొలగించేస్తుండటంతో తమ గ్రామాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

**చర్యలు తప్పవు**

అల్లంవరం తహసీల్దార్ నరసింహారావు స్పందిస్తూ తీర ప్రాంతం నుంచి ఇసుక తరలించినా, తవ్వినా కఠిన చర్యలు తప్పవన్నారు. స్థానిక వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో నిరంతరం గస్తీ ఏర్పాటు చేశామని.. ఇసుక తవ్వితే సంబంధిత భూముల డి.పట్టాలను రద్దు చేస్తామన్నారు.

**రాత్రి సమయాల్లోనే..**

ఈ రెండు ప్రాంతాలో అక్రమార్కులు ఇసుకను కేవలం రాత్రి సమయాల్లో మాత్రమే ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఇసుక ట్రాక్టర్లు వరుస కట్టి హోరెత్తిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఉదయం 5 గంటల తర్వాత ఎక్కడి వారు అక్కడే గప్‌చుప్.. అన్న చందంగా ఉంటుంది పరిస్థితి. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన స్థానిక అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

# బాలల ఆరోగ్యం భద్రమేనా?

రాజమహేంద్రవరం: బుడిబుడి అడుగులు వేసి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారుల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థుల వరకు ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది. పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఆర్‌బీఎస్‌కే సర్వేలో 2675 మంది చిన్నారులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. ఎక్కువశాతం మందిలో పౌష్టికాహారం, విటమిన్ల లోపం ఉంది. తద్వారా వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం..చర్మ, దంత, చూపు సంబంధిత సమస్యలు తలెత్తాయి.


**జిల్లాలో ఇలా..:** తూర్పుగోదావరి జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 2,12,270 మందికి గాను 1,91,006 మందిని సర్వే చేశారు. వీరిలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 2675 మందిని గుర్తించారు. 2029 మందికి స్థానికంగా వైద్య సేవలందించినట్లు ఆర్బీఎస్‌కే సమన్వయకర్త హరిప్రసాద్ తెలిపారు. ప్రధానంగా మేనరిక వివాహాలు చేసుకున్నవారికి జన్మించిన పిల్లల్లో కొన్ని సమస్యలు కనిపించాయి. జన్యుపర లోపాలు..తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రభావం చూపుతున్నట్లు నిర్ధారించారు. దీర్ఘకాలిక సమస్యలున్నవారిని జిల్లా ఆసుపత్రులకు పంపించారు. ఇతర చిన్న ఇబ్బందులుంటే అక్కడే మందులివ్వడం లేకపోతే స్థానిక పీహెచ్‌సీల్లో చికిత్స అందిస్తున్నారు.

**ఏయే సమస్యలంటే..**

38 మంది: గ్రహణమొర్రి, వంకరపాదాలు, గుండెలో రంధ్రం, వెన్నుపూసలో సమస్య వంటివాటితో బాధపడుతున్నారు.

355 మంది: వయసుకు తగ్గ పురోగతి లేదు. సరిగా మాట్లాడలేకపోవడం, పనులు చేయకపోవడం, అల్లరి, చదువుపై శ్రద్ధ చూపకపోవడం, వినికిడి, దృష్టి సమస్యలు.

422 మంది: చిన్నవయసులోనే అనారోగ్య సమస్యలున్నాయి. మరో 37 మందికి కౌమార దశలోనూ కనిపించాయి. కొన్ని జన్యుపరంగా



సంక్రమించగా.. మరికొన్నేమో తల్లిదండ్రులు పూర్తి దృష్టిసారించకపోవడం, పుట్టుక తరువాత నిర్దేశిత సమయంలో వ్యాక్సినేషన్ చేయించకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం వల్ల తలెత్తాయి.

1046 మంది: దంత, చర్మ సమస్యలు, జ్వరం, గాయాలతో ఇబ్బందులు.

వసతిగృహాల్లో ఉంటున్నవారిలో చర్మ సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా కనిపించాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

విద్యార్థుల్లో గుర్తించిన సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది స్థానికంగా అవగాహన కల్పిస్తున్నారు. పదిరోజులుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆబీఎస్‌కే 4.0 సర్వే చేపడుతున్నాం.

డా.హరిప్రసాద్, సమన్వయకర్త, ఆర్‌బీఎస్‌కే

# హైస్కూల్ ప్లస్.. అన్నీ మైనస్

చీపురుపల్లి : గుర్ల మండలం తెట్టంగి పాఠశాలలో గతేడాది హైస్కూల్ ప్లస్‌లో 30 మంది విద్యార్థులు ఉండేవారు. అధ్యాపకులు, సదుపాయాల్లేక వీరంతా ఇంటర్ రెండో ఏడాదిలో వేర్వేరు కళాశాలలకు ఆన్ టీసీలపై వెళ్లిపోయారు. ప్రస్తుతం 70 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. వీరంతా ఇంటర్ విద్య కోసం గుర్ల, నెల్లిమర్ల, చీపురుపల్లి, గరివిడి వెళ్లాల్సిన పరిస్థితి.

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నేటికీ అవస్థలు తప్పడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ విద్యకు అవకాశం కల్పిస్తే డ్రాపౌట్లు తగ్గుతాయని, బాలికా విద్యకు ప్రోత్సాహం ఉంటుందని ఎంతో మంది విద్యావేత్తలు, తల్లిదండ్రులు గొంతు చించుకున్న తర్వాత 2021లో హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 8 పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌కు అవకాశం కల్పించారు. ఎలాంటి సదుపాయాలు



కల్పించకపోవడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బోధకుల్లేక విద్యార్థులు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ఏడాది దాదాపు అన్ని పాఠశాలల్లోనూ పూర్తిగా ప్రవేశాలు లేవు.

**బలోపేతం చేస్తే మేలు..**

ప్రస్తుతం దూరంగా ఉన్న పట్టణాలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గుర్ల మండలం కొండగండ్రేడులోని విద్యార్థులు 15 కి.మీ. దూరంలోని గుర్ల జూనియర్ కళాశాలకు వెళ్లాల్సివస్తోంది. అదే తెట్టంగిలో హైస్కూల్ ప్లస్ అన్ని సదుపాయాలతో అందుబాటులో ఉంటే ఈ ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం వీటిలో సౌకర్యాలు కల్పిస్తే గ్రామీణ విద్యార్థులు, బాలికలు చదువుకు దూరమయ్యే పరిస్థితులు తగ్గుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు.. అన్ని సదుపాయాలతో హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణ, ప్రయోగశాలల ఏర్పాటు, పీజీటీల నియామకంపై డీఈవో మాణిక్యంనాయుడు వద్ద ప్రస్తావించగా.. ఈ ఏడాది ప్రవేశాలు లేకపోవడం వాస్తవమేనన్నారు. పీజీటీలుగా ఉన్నవారంతా ఇటీవల బదిలీల్లో వెళ్లిపోయారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

# మస్తర్లలో మస్కాకు చెక్!

ఒంగోలు : ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి కొలతలు తగ్గించి నమోదు చేయడం...పనికి రాకున్నా వారి పేర్లపై మస్తర్లు వేసి, ఆ తర్వాత వారి నుంచి నగదు తీసుకోవడం తదితర అక్రమాలు జిల్లాలో చేపట్టిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూశాయి. వివిధ ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో బోగస్ మస్తర్లు నమోదు ఎక్కువగా జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకం పనుల్లో మరింత పారదర్శకతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా కూలీల మస్తర్లలో నమోదులో మార్పులు చేసింది. పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌తో పనులకు వచ్చే వారందరికీ ఇప్పటికే ముఖ హాజరు నమోదు చేస్తున్నారు. కూలీలకు ప్రస్తుతం ఒకపూట హాజరు వేస్తుండగాబీ బోగస్ మస్తర్లను నివారించేందుకు ఉదయం, సాయంత్రం రెండు సార్లు మస్తరు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**నిబంధనలివీ..:** ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మొదటిసారి హాజరు నమోదు చేసి ఫొటో అప్‌లోడ్ చేసిన 4 గంటల తర్వాత రెండో సారి మస్తరు వేయాలి. సాంకేతిక సమస్య ఎదురైతే అదేరోజు రాత్రి 12 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలి. రెండో సారి హాజరు పంపని క్షేత్ర సహాయకుడు, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. క్షేత్రసహాయకులు తీసే చిత్రాలను ఎంపీడీవోలు తప్పనిసరిగా పరిశీలించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పష్టం చేసింది.

**అక్రమాలకు అడ్డుకట్ట–** జోషఫ్‌కుమార్, పీడీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు పని ప్రదేశంలో హాజరైన కూలీలకు తప్పని సరిగా రెండుసార్లు చిత్రాలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో జరిగే మస్తర్లలో అక్రమాలను నియంత్రించవచ్చు. తాజాగా ఉదయం, సాయంత్రం కూలీల కంటి పాప ద్వారా హాజరు వేసే విధానాన్ని అమలు చేయనున్నాం.

2025–26 సంవత్సరానికి సంబంధించిన వివరాలు

ఉపాధిహామీ పథకం కార్డులు: 4.50 లక్షలు

మొత్తం కూలీల సంఖ్య : 8.35 లక్షల మంది


పనికి వస్తున్న కుటుంబాల సంఖ్య: 3.80 లక్షలు

అందులోని కూలీలు : 6.77 లక్షల మంది

కూలీలకు ఖర్చు చేసిన నిధులు : రూ.248 కోట్లు

కూలీకి సరాసరి వేతనం (రోజుకు) : రూ.252

# ధరల పట్టికలేవీ?



ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు ఆర్టీసీ బస్టాండులోని దుకాణదారులు ధరల పట్టికలు అందుబాటులో ఉంచకపోవడంపై జేసీ రోణంకి గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలోని పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, వాటర్ ప్లాంట్లను ఆయన డీఎస్వో పద్మశ్రీతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచిత గాలిపంపుతోపాటు ప్రథమ చికిత్స పెట్టెల నిర్వహణ, ఇంధనం పరిమాణం, నాణ్యతపై ఆరా తీశారు. ఆర్టీసీ బస్టాండులో ఆహార నాణ్యతపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మరుగుదొడ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, ఎం.ఎల్.ఎస్.పాయింట్లు, రేషన్ దుకాణాలు, బియ్యం మిల్లులు, ఆర్వో ప్లాంట్లు, ఆర్టీసీ బస్టాండ్లు, బాణ సంచా పరిశ్రమల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 150 చోట్ల సోదాలు చేశారు. రెవెన్యూ, పౌరసరఫరాల, తూనికలు కొలతలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అగ్నిమాపకశాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో పలు లోపాలను గుర్తించి నిర్వాహకులకు సూచనలిచ్చారు.

## నిషిద్ధ భూములకు ఎట్టకేలకు మోక్షం

కాకినాడ : నిషిద్ధ జాబితాలోకి నెట్టేసిన ప్రైవేటు భూములకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. వీటిపై దాఖలైన ఫిర్యాదుల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత వైకాపా పాలనలో కాకినాడ జిల్లాలో నిర్వహించిన భూముల రీ-సర్వేలో ప్రైవేటు భూములు కొన్నింటిని నిషిద్ధ జాబితా(22ఏ)లో నమోదు చేసేశారు. ఈ క్రమంలో చాలా మంది భూములు, స్థలాలను విక్రయించుకోలేక గత అయిదేళ్లుగా కష్టాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 22ఏ నుంచి ప్రైవేటు భూములను తప్పించాలని పెద్ద సంఖ్యలో అర్జీలు దాఖలయ్యాయి. దీంతో 2024, జూన్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిని వెబ్‌ల్యాండ్‌లో



నమోదు చేసే అధికారం కలెక్టర్లకు ఇవ్వడంతో పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి.

**దరఖాస్తులపై విచారణ**

నిషిద్ధ జాబితాలో నమోదైన కొన్ని ప్రైవేటు భూముల విషయంలో వివాదాలు, కోర్టు కేసులు వంటివి ఉన్నాయి. వీటిపై ప్రతి బుధవారం కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన డీఆర్వో ఆధ్వర్యంలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న ఆయా తహసీల్దార్ల కార్యాలయాల సూపరింటెండెంట్లతో విచారణ చేయాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టర్‌తో చర్చించి, వీటిని పరిష్కరించనున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో 2024, జూన్ నుంచి 2025, జులై 28 వరకు పీజీఆర్ఎస్ ద్వారా 283 దరఖాస్తులొచ్చాయి. వీటిలో 249 పరిష్కరించారు. 22 దరఖాస్తులు రీ-ఓపెన్ కాగా వాటిలో 20, మీ-సేవ కేంద్రాల ద్వారా 28 రాగా, ఆరు పరిష్కారమయ్యాయి. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లలో మొత్తం 37 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్వో వెంకట రావు తెలిపారు.

## గంగ కాలువలో జలకళ

గూడూరు : వరుణ దేవుడు కరుణ తక్కువగా ఉన్నా.. కండలేరు జలాశయం నుంచి ఈ ఏడాది ముందస్తుగా తెలుగు గంగ పరిధిలో కాలువలకు నీరు విడుదల చేయడంతో ఉమ్మడి గూడూరు డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వేసవిలో తాగు, సాగు నీటి ఎద్దడి మాయమించే అవకాశం కలిగింది. రబీలో పంటలు కూడా ముందస్తుగా సాగు చేసుకునే వెసులుబాటు కలిగింది. నైరుతి రుతు పవనాల వల్ల వర్షపాతం తక్కువైనప్పటికీ.. ఎగువ భాగంలో కురిసిన వర్షాలకు సోమశిల జలాశయానికి భారీగా నీరు చేరడం.. అక్కడ నుంచి కండలేరు ద్వారా తెలుగు గంగ పరిధిలోని ప్రధాన కాలువ, బ్రాంచి కాలువలకు నీరు విడుదల చేశారు. ఇవి కాకుండా స్వర్ణముఖి, కాళంగి, కండలేరు నదులు, వీటి పరిధిలోని చెరువులకు నీరు విడుదల చేయడం తో గతంలో ఎన్నడూ లేని విధంగా జలకళతో దర్శనమిస్తున్నాయి.

**1.42 లక్షల ఎకరాలకు సాగునీరు**

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి సత్యవేడు నియోజకవర్గాల్లో



5, 7 బ్రాంచి కాలువల పరిధిలోని మైనర్, కాలువలు కింద ఉన్న 1.42 లక్షల ఎకరాలు రబీలో సాగుకు సరిపడ నీరు చేరడంతో రైతులు ఆగస్టు నుంచి వరినార్లు పోసుకునే అవకాశం కలిగింది. ఇప్పటికే ఏడారు సాగు కింద 45 ఎకరాలు వరి పైర్లు సాగు చేశారు. దీంతో విరామం లేకుండా పంటలు సాగు చేసుకునే అవకాశం కలిగింది. స్వర్ణముఖి, కాళంగి కండలేరు మామిడి కాలువ, నెర్రి కాలువలకు నీరు చేరడంతో వేసవి తాగునీటి ఎద్దడి కూడా లేకుండా ఉంది. జలవనరుల శాఖ కాలువలకు చేరిన నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటే రబీ పంట సాగు అదనంగా కూడా మరో పంట సాగు చేసుకునే అవకాశం ఉంది. చిట్టమూరు, ఓజిలి బాలాయపల్లి మండలాల్లో మెట్ట భూములకు ఈసారి నీరు అందుతుండడంతో ఈప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కన్నేసి.. బండరాళ్లతో కప్పేసి

కదిరి : బాహ్యావలయ రహదారి విస్తరణ కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని, దేవరచెరువు కాలువను తమ భూమిలోకి కలుపుకొనేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. కదిరి పట్టణం బేరిపల్లి సమీపంలోని సర్వేనంబరు 274లో 21 ఎకరాల భూమి ఉంది. అందులో ఎక్కువ భాగం బాహ్యావలయ రహదారి కోసం ప్రభుత్వం రైతుల నుంచి సేకరించింది. తొలి దశలో కొంతభాగం రోడ్డు వేయగా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా కొంత భూమిని వదిలారు. ఇక్కడ ఎకరాల రూ.కోట్లు పలుకుతుంది. ఈ భూమిపై సమీపంలోని రైతులు కన్నేశారు. ఎవరూ చూడరనే ధీమాతో దగ్గర్లోని కొండల్లో నుంచి బండరాళ్లను, ఎర్రమట్టిని తవ్వి, తరలించి తమ భూమికి సమాంతరంగా ప్రభుత్వ భూమిని పూడ్చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 20 సెంట్లను పూడ్చేశారు. చెరువుకు సంబంధించిన కాలువను సైతం వదల్లేదు. దాన్ని మట్టితో పూడ్చి తమ పొలంలోకి కలుపుకొనేందుకు యత్నిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. రహదారికి సేకరించిన భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఆర్డీఓ వీవీఎస్ శర్మ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించినట్లు సమాచారం అందగానే చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారిని ఆదేశించాను. అనుమతి లేకుండా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# పునరావాసంలో తొలి అడుగు



నక్కపల్లి: నక్కపల్లి మండలంలో పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం నిర్వాసితులకు సంబంధించిన పునరావాసంపై కీలక అడుగు వేసింది. కాలనీ ఏర్పాటుకు తయారు చేస్తున్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలను కేటాయించడానికి సిద్ధమైంది. రాజయ్యపేట, వేంపాడు, చందనాడ, డి.ఎల్.పురం, బుచ్చిరాజుపేట రెవెన్యూ పరిధిలో సుమారు 4300 ఎకరాల భూమిని తెదేపా ప్రభుత్వం సేకరించి గతంలోనే పరిహారం చెల్లించింది. కొన్నిచోట్ల ఇళ్లను తొలగించాల్సి రావడంతో.. వీటికి సంబంధించి పరిహారం ఇవ్వడంతో పాటు, వారికి పునరావాసం కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే పెదబోదు గల్లం వద్ద భూములు కొనుగోలు చేసి ఏపీఐఐసీ ఇందులో వీఎంఆర్‌డీఏ ద్వారా 151 ఎకరాల్లో లే అవుట్లు నిర్మిస్తున్నారు. దీన్ని వేగంగా తయారు చేసేలా మంత్రి అనిత, పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. పలుమార్లు అధికారులు వీటిని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సూచనలు చేశారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన రోడ్లు వేస్తున్నారు. దీంతోపాటు మిగిలిన సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో 1200 పైగా స్థలాలు తయారు చేస్తున్నారు. సేకరణలో భాగంగా అయిదు రెవెన్యూ గ్రామాల పరిధిలో 745 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. ప్రతి ఒక్కరికి అయిదు సెంట్ల స్థలం చొప్పున ఇవ్వనున్నారు.

ఇందుకోసం వీరి మధ్య ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు వీలుగా లక్కీ డ్రా తీస్తున్నారు. ఆ మేరకు పాటిమీద సమీపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ, వర్షం ఇబ్బందులు లేకుండా భారీ టెంట్లు, ప్రత్యేక గ్యాలరీలు, తాగునీరు తదితర వాటిని సిద్ధం చేస్తున్నారు. లబ్ధిదారులను ఇక్కడకు రప్పించి వారి సమక్షంలోనే అధికారులు బహిరంగంగా డ్రా తీయనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**పోలీసు బందోబస్తు నడుమ..** ఇళ్లను కోల్పోయిన నిర్వాసితుల్లో అర్హులకు అయిదు సెంట్ల ఇంటి స్థలంతోపాటు సుమారు రూ.తొమ్మిది లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు. మరోవైపు పరిహారం రూ. 25 లక్షలు పెంచాలంటూ లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు కొద్దిరోజులుగా పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రా తీసే ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలు కె.కుమార స్వామి, ఎల్.రామకృష్ణ పర్యవేక్షణ చేశారు. ఆర్‌డీఓ వి.వి.రమణ అధికారులతో సమీక్షించి, వేదిక ఏర్పాట్ల ప్రాంతాన్ని పరిశీలించారు.

# ప్రోత్సాహకం కొట్టేసేందుకు పన్నాగం



పలమనేరు : కూటమి ప్రభుత్వం మామిడి రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని తోతాపురికి గిట్టుబాటు ధర నిర్ణయించడానికి నడుం బిగించింది. జిల్లాలో ఈ రకం మామిడికి కిలో రూ.12 ధర నిర్ణయించగా... పరిశ్రమలు రూ.8 ఇస్తే.. ప్రభుత్వం రూ.4 ప్రోత్సాహక నగదు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని దండుకోవడానికి పన్నాగాలు పన్నారు. నకిలీ ఆధార్, వాహనాల నంబర్లు నమోదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా తోతాపురి 40 వేల హెక్టార్లలో సాగైంది. ఈ రకం మామిడి పండించే రైతుల సంఖ్య 20-25 వేల వరకు ఉంటారని అంచనా. ప్రస్తుతం కాయలు పూర్తి గా ఖాళీ అయిన దశకు చేరుకుంది. ఎక్కడో ఓ చోట ఆటోల్లో కాయలు తెచ్చి ర్యాంపుల వద్ద దించుతున్నారు. అక్కడ హార్టికల్చర్ సిబ్బంది రైతుల పూర్తి వివరాలు నమోదు చేస్తారు. అయితే ఒకే ట్రాక్టరు ఒక రోజులో 5 నుంచి 15 లోడ్లు ర్యాంపులకు తెచ్చినట్లు వివరాలు నమోదు కావడంతో అధికారులు విస్తుబోయారు. అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించి వారిని వడ కట్టే పనిలో ఉన్నారు.

**ఈ ప్రాంతాల్లోనే..**


పలమనేరు, వి.కోట, కుప్పం, సోమల, బంగారుపాళ్యం ప్రాంతాల్లో ఈ వ్యవహారం చోటుచేసుకుంది. జిల్లాలోని వ్యవసాయ గణాంకాల ప్రకారం 2.26 లక్షల టన్నుల మామిడి కాయలు పరిశ్రమలకు, ర్యాంపుల ద్వారా లక్ష టన్నుల కాయలు విక్రయించారని అంచనా.

25 వేల మందికి 45 వేల పేర్ల నమోదు..

జిల్లాలో 25 వేల మంది రైతులు ఉంటే ర్యాంపుల వద్ద సుమారు 45 వేల మంది పేర్లు, వాహనాల నంబర్లు నమోదు కావడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థమవుతుంది. దీంతో అధికారులు ఆధార్, ట్రాక్టర్ నంబరు, ఈ క్రాప్ వివరాలు పరిశీలిస్తున్నారు. **అర్హులకే అందేలా చూస్తాం..**

మా వద్ద ఉన్న వివరాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నాం. డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగిస్తున్నాం. ఆధార్ నంబర్లను కచ్చితంగా పరిశీలించి రెండుసార్లు నమోదై ఉంటే తీసేస్తున్నాం. అసలైన రైతులకు రాయితీ అందేలా కృషి చేస్తాం. త్వరలో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.
కోటేశ్వరరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి, చిత్తూరు

# నిర్లక్ష్యం 'గడ్డ'కట్టేసింది!



అనంతపురం : పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సరఫరా చేసిన వేలాది సిమెంట్ బస్తాలు పనికిరాకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంపిణీలో జాప్యం జరిగి గోదాముల్లో దాచిన బస్తాలు ఎక్కడికెక్కడ గడ్డకట్టాయి. అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో పేదల ఇళ్లకు కేటాయించిన ఇనుము గోదాముల్లోనే మగ్గిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అమ్మేసుకున్నారు...

ప్రభుత్వం సరఫరా చేసిన ఇనుమును అనంతపురం గ్రామీణం పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారి పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ప్రధాన గోదాము వద్ద పనిచేస్తున్న ఓ వ్యక్తి ద్వారా కడ్డీలను ఒక్కొక్కటిగా విక్రయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టన్ను ధర మార్కెట్‌లో రూ.80 వేలు ఉండగా.. తుక్కు వ్యాపారులకు రూ.30 వేల చొప్పున విక్రయించినట్లు సమాచారం. గతంలో రాక్రీట్ సంస్థ కోసం కేటాయించిన ఇనుమును సైతం అనంతపురం గ్రామీణంలో పనిచేస్తున్న అధికారి అమ్మేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2వేల బస్తాలు వృథా

అనంతపురం అర్బన్, గ్రామీణ పరిధిలో నిర్మించే ఇళ్ల కోసం కేటాయించిన సిమెంట్ బస్తాలను పంగల్‌రోడ్డులోని హౌసింగ్ శాఖ ప్రధాన గోదాములో ఉంచారు. ఏడాది కిందట అనంతపురం గ్రామీణం పరిధిలో విధులు చేపట్టిన అధికారి సిమెంటు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు ఎట్టి పరిస్థితుల్లో సిమెంటు ఆపకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ పెడచెవిన పెట్టారు. గోదాములోని సిమెంటుతోనే అనంతపురం, గార్లదిన్నె, రాప్తాడు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు అవసరమైన ఇటుకలు, దిమ్మెలు తయారుచేయాల్సి ఉండగా అందులోనూ అలసత్వం వహించారు. ఫలితంగా గోదాములో సుమారు 2 వేల బస్తాల సిమెంటు గడ్డకట్టాయి. కళ్యాణదుర్గంలోనూ వెయ్యి బస్తాలు కేటాయించగా.. 200 వరకు పనికి రాకుండా పోయాయి.

## 'విష'మించిన నదీ జలం

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో నదులు, చెరువులు కలుషితమవుతున్నాయి. మురుగు నీటితోపాటు రసాయన వ్యర్థాలు నేరుగా కలుస్తూ విషతుల్యమవుతున్నాయి. ఫలితంగా నీటిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతోంది. చెరువులు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. పరిస్థితి తీవ్రతపై కాలుష్య నియంత్రణ మండలి గతంలోనే హెచ్చరికలు జారీ చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నంద్యాల పట్టణ శివారు, మద్దూరు, కోవెలకుంట్ల ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ మండలి సేకరించిన నమూనాల్లో ప్రమాదకర అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఈ కారణంగా చేపలు తరచూ చనిపోతున్నట్లు తేలింది. అయినా అధికారులు దృష్టి సారించడం లేదు.

**మురుగు ముంచుతోంది**

తుంగభద్ర, కుందూ నదులు ఆక్రమణలకు గురవుతున్నాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాల నిర్మాణంతో మురుగు నేరుగా నదుల్లో కలుస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రవహించే తుంగభద్ర, హంద్రీ, కుందూ నదుల్లోకి నేరుగా వ్యర్థాలు చేరుతున్నాయి. వీటిని ఎక్కడా శుద్ధి చేయడం లేదు. కర్నూలు నగరంలో 60 ఎంఎల్‌ఎడీ, నంద్యాల పట్టణంలో 20 ఎంఎల్‌డీ వరకు మురుగు ఉత్పత్తి అవుతోంది.



**గుట్టుచప్పుడు కాకుండా**

నంద్యాల పట్టణ శివార్లలోని సీడ్ కంపెనీల నిర్వాహకులు వర్షాకాలంలో రసాయన వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా కేసీ కాలువలోకి వదులుతున్నారు. కొట్టాల సమీపంలోని బూర్గమాను వంకలో రసాయన వ్యర్థాలు కలుస్తుండడంతో సమీపంలోని పంట పొలాల సారం దెబ్బతింటోంది.

**ఏం చేయాలంటే**

చెరువుల్లోని ఘన, ప్లాస్టిక్, గుర్రపు డెక్కను తొలగించాల్సిన అవసరం ఉంది. నదులు, చెరువుల్లో ఆక్సిజన్ మోతాదు పెంచేందుకు ఏరియేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. నంద్యాల, కోవెలకుంట్ల, నంద్యాల, గోస్పాడు, పాణ్యం, ఉయ్యాలవాడ, బనగానపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల వ్యర్థాలు, మురుగు నీరు కుందూ నదిలో చేరకుండా దారి మళ్లించాలి. పరిరక్షణ కమిటీలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. లేకుంటే జలచరాల జీవనం ప్రశ్నార్థకంగా మారిపోయే ప్రమాదముంది.

**డీవో తగ్గిపోతూ..** కర్నూలు, నంద్యాల జిల్లాలోని కొన్ని చెరువులు, నదుల్లో ఆశించిన స్థాయిలో డీవో (డిజాల్వ్‌డ్ ఆక్సిజన్) ఉండడం లేదు. సాధారణంగా చెరువులో లీటరు నీటిలో 4 మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా డీవో ఉండాలి. చాలా చెరువుల్లో ఇది తక్కువగానే ఉంది. నదుల్లోకి పెద్దఎత్తున రసాయనిక వ్యర్థాలు చేరుతుండటంతో ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతోంది. కుందూ నదిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గడంతో నీటి నాణ్యతకు ముప్పు కలుగుతోంది. జలచరాలు మృత్యువాత పడుతున్నా యి. కర్నూలు శివారులోని కొన్ని పరిశ్రమల వ్యర్థాలు నేరుగా తుంగభద్ర నదిలో కలుస్తుండడంతో దుర్వాసన వస్తోంది. నీరు రంగు మారుతోంది. ఆదోని పురపాలక పరిధి నుంచి సగటున విడుదల వుతున్న 5 ఎంఎల్‌డీ వ్యర్థాలతో శివారు ప్రాంతంలో 100 ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నారు. ఫలితంగా అనిరోబిక్ బ్యాక్టీరియా పెరిగి హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విష వాయువులు విడుదలవుతున్నాయి. ఫలితంగా ప్రజలతోపాటు పక్షులు, ఇతర జీవులపైనా ప్రభావం పడుతోంది.

## తుంగ'భద్ర'మేనా'

కర్నూలు : తుంగభద్ర జలాలు శ్రీశైలానికి తరలించే సుంకేసుల బ్యారేజీ గేట్ల నిర్వహణ అధికారులకు సవాలుగా మారింది. ఆరు గేట్లు పూర్తిస్థాయిలో పైకి ఎత్తలేని పరిస్థితి నెలకొనడం.. ఇప్పటికిప్పుడు వరద పెరిగితే 2009 నాటి పరిస్థితులు తలెత్తుతాయన్న ఆందోళన నెలకొంది. మంగళవారం 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా నాటికి 1,06,000 క్యూసెక్కులకు తగ్గింది. జలాశయం 7 గేట్లు 2 మీటర్లు, 14 గేట్లు మీటరు ఎత్తు తెరచి దిగువకు 1,05,517 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**వెంటాడుతున్న వైకాపా పాపం**

రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించే అతి కీలకమైన సుంకేసుల బ్యారేజీ నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం వదిలేసింది.. కనీసం గ్రీజుకు చిల్లిగవ్వ చెల్లించలేదు. ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రస్తుతం గేట్లు మొరాయిస్తున్నాయి. బ్యారేజీకి 30 గేట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. 4,5,7,11,12,29 గేట్లకు సంబంధించి రోప్స్ (తాళ్లు) తెగిపోవడంతో ఓ స్థాయి వరకే పైకి ఎత్తేందుకు అవకాశముంది. మూడు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తే అన్ని గేట్లు పూర్తిస్థాయిలో పైకి ఎత్తాల్సి ఉంటుంది. అప్పుడు ఈ ఆరు గేట్ల విషయంలో ఏం చేయాలని ఇంజినీర్లు ఆలోచిస్తున్నారు.

**సాంకేతిక బృందం రాక**

సుంకేసుల బ్యారేజీ వద్ద మొండికేస్తున్న ఆరు గేట్ల నిర్వహణకు కూటమి ప్రభుత్వం రూ.30 లక్షలు విడుదల చేసింది. మంగళవారం నుంచి పనులు ప్రారంభించారు. ఆరుగురు సాంకేతిక నిపుణుల బృందాన్ని పిలిపించారు. మరమ్మతులకు 20-25 రోజులు పట్టే అవకాశం ఉందని కేసీసీ డీఈఈ ప్రసాదరావు తెలిపారు.

**శాశ్వత మరమ్మతులు చేస్తేనే**

సుంకేసుల ఆధారంగా కర్నూలు- కడప (కేసీ) కాల్వకు నీటిని విడుదల చేస్తారు. రెండు సీజన్లలో కలిపి 2.80 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తారు. ఏటా సగటున 150 టీఎంసీల నీటిని సుంకేసుల బ్యారేజీ ద్వారా శ్రీశైలానికి విడుదల చేస్తారు. 2009లో 9.30 లక్షల క్యూసెక్కుల భారీగా వరద రావడంతో సుంకేసుల కొట్టుకుపోయింది. తర్వాత 2013లో 3.30 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బ్యారేజిలో ఏడాదిపాటు నీరు నిల్వ ఉండడంతో మరమ్మతులు చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. గేట్లు ఎత్తితే నీరు దిగువకు విడుదలైతే వేసవిలో కర్నూలు నగర ప్రజలకు మంచినీటి సమస్య ఎదురవుతుంది. గాజులదిన్నెలో నీళ్లు నింపి నగరానికి సరఫరా చేసే ఏర్పాట్లు చేస్తే తప్ప గేట్లకు మరమ్మతులు చేయలేని పరిస్థితి.

# ఇదేమి కాలం 'రొయ్యో'!

కలిదిండి : కలిదిండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కోలా రాజా 20 ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. గతేడాది ప్రథమార్థంలో ఖర్చులు పోను ఎకరాకు లక్ష రూపాయలు మిగిలాయి. ఈ ఏడాది తొలి ఆర్నెళ్లలో ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది.రొయ్య రైతులు కష్టాలకు ఎదురీదుతున్నారు.ఆక్వా రంగానికి ఈ ఏడాది ప్రథమార్థం ఏ మాత్రం కలసి రాలేదు. 2024తో పోల్చితే.. 2025లో తొలి ఆర్నెళ్లు నష్టాలు చవిచూసింది. ఇందుకు ప్రధాన కారణం వాతావరణం.. వ్యాధుల బెడద.. ధరల పతనం. ఆరు నెలల్లో ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా 70 శాతం రైతులు నష్టపోయారు.

**గతం ఘనం..** గత సంవత్సరం రొయ్యల రైతులకు స్వర్ణయుగంగా మారింది. సగటున ఏడాదిలో 260 రోజులు పొడి వాతావరణం ఉంది. 2023 నవంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు వేడితో కూడిన వాతావరణం ఉండటంతో ఆక్వా రంగానికి అనుకూలంగా మారింది.



దీంతో పెద్దఎత్తున రైతులు నష్టాల నుంచి లాభాల వైపునకు అడుగులు వేశారు.

యాజమాన్య పద్ధతులే రక్ష.. మండు వేసవిలోనూ ఆకస్మికంగా వాతావరణం చల్లబడిపోవడం, ఎడతెరిపి లేని వర్షాలు చేపలు, రొయ్యల సాగుకు ప్రతికూలంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో సరకును రక్షించుకోవడానికి అనువైన యాజమాన్య పద్ధతులపై సాగుదారులకు మరింత అవగాహన కల్పిస్తామని మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు.

**మే నెలలో వర్షాలు..** 125 ఏళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ నివేదిక వెల్లడించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ వాతావరణం రైతులకు పూర్తిగా సహకరించలేదు. మే నెలలో ఎడతెరిపి లేని వర్షాలతో ప్రాణవాయువు సమస్య ఏర్పడి చేపలు, రొయ్యలు మృత్యువాత పడ్డాయి. దీంతోపాటు అధిక సాంద్రతలో సాగు చేపట్టడం, నీరు, మేత యాజమాన్యంపై సరైన అవగాహన లేకుండా సాగు చేయడం, రొయ్య పిల్లల ఎంపికలో అజాగ్రత్త రొయ్యలు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేకపోయాయి.

# స్థాయి మరిచారు

నంద్యాల : జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న పట్టణాలు.. అక్కడి ఆసుపత్రుల స్థాయి పెంచారు.. వైద్యులు స్థానాల భర్తీ మరిచారు. ఉన్నతీకరించినా పరికరాలు ఇవ్వలేదు.. సిబ్బందిని నియమించలేదు.. దీంతో ఇప్పటికీ ప్రాథమిక పరీక్షలే చేస్తున్నారు.. అత్యవసరమైతే పెద్దాసుపత్రికి సిఫారసు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆదోనిలో జిల్లా సర్వజన ఆస్పత్రిగా, డోన్, బనగానపల్లి, ఎమ్మిగనూరు పట్టణాల్లో ప్రాంతీయ ఆస్పత్రిగా మార్చారు. 100 పడకలకు పెంచారు. భవనాల విస్తరణకు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలోనే సుమారు రూ.70 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేసింది. వాటిని పూర్తి చేయడంలో వైకాపాకు ఐదేళ్లు పట్టింది. ఎన్నికలు వస్తున్న తరుణంలో ఆర్భాటంగా ప్రారంభించారు. నేటికీ వైద్యులు లేక మెరుగైన వైద్య సేవలందడం లేదు. రూ.కోట్లు పోసి నిర్మించిన ఆస్పత్రుల్లో కేవలం ప్రాథమిక పరీక్షలకే పరిమితమయ్యాయి. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి సిబ్బందిని నియమించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

**70 కి.మీ. వెళ్లమంటున్నారు**

ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచారు. ఇక్కడ నిత్యం ఓపీ 400-500, ఐపీ 40 వరకు ఉంటుంది. నెలకు రెండు వందల వరకు ప్రసవాలు, 30 వరకు కంటి చికిత్సలు చేస్తారు. 24 మంది వైద్యులకు 17 మంది పని చేస్తున్నారు. డిప్యూటీ జనరల్ సర్జన్, అనస్థీషియా వంటి ముఖ్యమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జాతీయ రహదారి ఎమ్మిగనూరు మీదుగా వెళ్తోంది. ప్రమాదం



లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి 70 కి.మీ. దూరంలో ఉన్న కర్నూలుకు పంపుతున్నారు.

ఎముకల సంబంధిత వైద్యుడు ఉన్నా ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో కర్నూలుకు పంపిస్తున్నారు.

**కట్టుకట్టి పంపిస్తున్నారు**

డోన్ ఆసుపత్రిని 100 పడలకు పెంచారు. 23 మంది వైద్యులుండాల్సిన చోట 15 మంది పని చేస్తున్నారు. నిత్యం ఓపీ 400, ఐపీ 30 వరకు ఉంటుంది.

జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, అనస్థీషియా, గైనకాలజిస్టు, రేడియోలజిస్టు, ఇద్దరు జనరల్ మెడిసిన్ వైద్యులు లేరు.

డోన్-బెంగళూరు జాతీయ రహదారి ఉండడంతో నిత్యం జరిగే ప్రమాద బాధితులను కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.

ఇక్కడ ఐసీయూ అవసరముంది. పరికరాలు లేవు. శస్త్రచికిత్సలు జరగడం లేదు. కట్టుకట్టి పంపడానికి పరిమితమవుతున్నారు.

ప్రాథమిక పరీక్షలకే పరిమితం

ఆదోనిలోని వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రిని 350 పడకల స్థాయికి పెంచారు. ఇక్కడ ఓపీ 500, ఐపీ 30 వరకు ఉంటుంది. 78 మంది వైద్యులకు 19 మంది పని చేస్తున్నారు.

పశ్చిమ ప్రాంతంలో 17 మండలాల వాసులు ఇక్కడికే వస్తుంటారు. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, పాము కాటు, విష ప్రభావం తదితర కేసులు వస్తుంటాయి. వీరికి ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేస్తున్నారు.

పట్టణం మీదుగా 167వ జాతీయ రహదారి వెళ్తుంది. నిత్యం 10కిపైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయపడిన వారిని ఐసీయూలో ఉంచడం, సిటీ స్కాన్, ఎమ్మారై తదితర పరీక్షలు నిర్వహించడం, రేడియాలజిస్ట్, పాథాలజిస్ట్, సైక్రియాటిస్ట్ వంటి ఉన్నతస్థాయి వైద్య సేవలందడం లేదు.

# 'కట్టు'దిట్టం చేస్తేనే నీళ్లు



పాణ్యం : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ బిరబిరా పరుగెడుతోంది. శ్రీశైల జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఏక్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉంది. కాల్వలకు నీళ్లు వదిలే అవకాశం ఉండటంతో అన్నదాతలు వరిసాగుకు సమాయత్తం అవుతున్నారు. మరోవైపు సీమ జిల్లాల్లో సాగుకు జీవనాడి అయిన గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోయింది. దీనికి మరమ్మతులు చేస్తేనే జలాశయంలో నీరు నింపి.. లక్షల ఎకరాలకు ఈసారి కృష్ణా జలాల విడుదల సాధ్యమవుతుంది. ఈ పనులు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. త్వరగా పూర్తిచేసి సాగునీటి విడుదలకు సమస్య లేకుండా చూడాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

**రూ.2.50 కోట్లతో అనుమతులు**

గోరుకల్లు జలాశయంలో బుధవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. రూ.2.50 కోట్లతో మరమ్మతులు చేసేందుకు కలెక్టరు రాజకుమారి పాలనా అనుమతులు ఇచ్చారు. పనులు చేసిన వెంటనే బిల్లులు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో గుత్తేదారులు మరమ్మతులు చేపట్టారు. జలాశయంలో జారిపోయిన రాతిపరుపు రాళ్లను తొలగించి కట్ట చుట్టూ రింగ్‌బండ్ వేసేందుకు అధికారులు పనులు చేపట్టారు. మూడు వారాల్లో మరమ్మతులు పూర్తిచేయాలని లక్ష్యం నిర్ణయించారు. వర్షాల వల్ల కట్టపై టిప్పర్లు తిరగలేని పరిస్థితి తలెత్తితే పనులు మరింత ఆలస్యమయ్యే ఆస్కారం ఉంది. పనుల్లో జాప్యం నీటి విడుదలపై ప్రభావం చూపనుంది.

**నత్తను తలపిస్తున్న పనులు**

రాయలసీమ జిల్లాలకు ఆయువుపట్టు అయిన గోరుకల్లు జలాశయం గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నంద్యాల జిల్లాతో పాటు వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. జలాశయం కట్టకు వేసవిలో జరగాల్సి పనులను ప్రాజెక్టులకు నీళ్లొదిలే సమయంలో ప్రారంభించారు. ఓ వైపు శ్రీశైలం జలాశయం నుంచి ఏక్షణమైనా నీళ్లు వదిలేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గోరుకల్లు జలాశయంలో మాత్రం నీటిని నిల్వచేసే పరిస్థితి లేదు. మరమ్మతులు పూర్తిచేస్తేనే సాగునీరు సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

**8 టీఎంసీలు నింపితేనే**

గోరుకల్లు జలాశయంలో ప్రస్తుతం 3 టీఎంసీల మేర నీరు ఉంది. నీటి నిల్వ 6 టీఎంసీలకు చేరుకుంటేనే జీఎన్ఎస్ఎస్ కాల్వకు నీళ్లు అందుతాయి. కాల్వ సామర్థ్యం మేర 20 వేల క్యూసెక్కుల వరకు నీరు విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో 8 టీఎంసీలు నిల్వ చేయాల్సి ఉంది. ఈ ఏడాది మట్టికట్ట పటిష్ఠతను దృష్టిలో పెట్టుకుని 8 టీఎంసీల మేర నీటిని నిల్వ చేయాలని అధికారులు నిర్ణయించారు. జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తేనే అవుకు, గండికోట జలాశయాలను త్వరగా నింపే అవకాశం ఉంటుంది. గోరుకల్లు జలాశయాన్ని నింపడంలో జాప్యం జరిగితే మిగతా జలాశయాల కింద పంటల సాగు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది.

గోరుకల్లు జలాశయాన్ని నింపకుండానే ప్రత్యామ్నాయంగా బైపాస్ కాల్వ ద్వారా నీరు విడదల చేసే అవకాశం ఉంది. కాని బైపాస్ కాల్వ ద్వారా 2 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేయొచ్చు. బైపాస్ కాల్వ ద్వారా అవుకు జలాశయాన్ని నింపాలంటేనే 3 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. గోరుకల్లు జలాశయం మరమ్మతులు వేగంగా పూర్తిచేస్తేనే గాలేరు నగిరి కాల్వ ద్వారా సాగునీటి విడుదలకు అవకాశం ఉంటుంది.

మూడు వారాల్లో పూర్తిచేస్తాం

గోరుకల్లు జలాశయం కట్ట మరమ్మతులను మూడు వారాల్లో పూర్తిచేస్తాం. పనులు పూర్తయిన వెంటనే ప్రాజెక్టును నీటితో నింపుతాం. పనులు వేగంగా చేసేలా చర్యలు చేపట్టాం. శుభకుమార్ ఈఈ

# రుణ పత్రంపై ముడుపుల ముద్ర



నంద్యాల : చినుకు జోరందుకొంది.. కాడి కదిలింది.. పెట్టుబడికి కావాల్సిన సొమ్ము కోసం రైతులు బ్యాంకులు, సహకార సంఘాల వద్దకు పరుగులు పెడుతున్నారు. పంట రుణ మొత్తానికి సంబంధించి రైతు ఫ్రాంకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిర్ణీత మొత్తం చెల్లిస్తే.. వారు పత్రాలు చట్టబద్ధమైనవని, నిర్ణీత స్టాంప్ డ్యూటీ చెల్లించినట్లు ధ్రువీకరిస్తూ దరఖాస్తు ఫారంపై ముద్ర (ఫ్రాంకింగ్) వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయితేనే రైతులకు రుణం అందుతుంది. ఇదే అదనుగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల సిబ్బంది, వెండర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫ్రాంకింగ్ చేసేందుకు నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

రూ.లక్షకు వెయ్యి

ఉమ్మడి జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉండగా ఫ్రాంకింగ్ యంత్రాలు కర్నూలు, నంద్యాల, ఆదోనిలోనే ఉన్నాయి. రూ.లక్షలోపు రుణాలకు రూ.వెయ్యి, రూ.2 లక్షల్లోపు పంట రుణానికి రూ.1100 ఫ్రాంకింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్కడ సిబ్బంది నిర్ణీత ధర కంటే అధికంగా రూ.వెయ్యికి రూ.1100, రూ.1100కు గాను రూ.1200 వసూలు చేస్తున్నారు. మిగిలిన చోట్ల ప్రైవేటు వెండర్లకు వీటిని జారీ చేస్తారు. ఇందుకు వీరికి రూ.100పై రూ.2.25 వరకు కమీషన్ వస్తుంది.

నంద్యాల జిల్లాలో పదిమందికి పైగా, కర్నూలు జిల్లాలో 8 మంది వెండర్ల వద్ద ఫ్రాంకింగ్ యంత్రాలు ఉన్నాయి. వీరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. రూ.వెయ్యికి రూ.1200, రూ.1100కు రూ.1300 వరకు అదనంగా తీసుకుంటున్నారు.

రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు

ఉమ్మడి జిల్లాలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లా రైతులకు రూ.8,964 కోట్లు, నంద్యాలకు రూ.9,213 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. రెండు జిల్లాల్లోని 34 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 652 శాఖల పరిధిలోని 5.23 లక్షల మంది రైతులతో పాటు 50 వేలమంది కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. రైతుల భూమి విస్తీర్ణం, అర్హతలను బట్టి రుణాలు పంపిణీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.18 వేల కోట్ల పంట రుణాలకు సంబంధించి లక్షలాది మంది రైతులు కచ్చితంగా ఫ్రాంకింగ్ చేసుకోవాల్సి ఉంది. ఒక్కోరైతు నుంచి రూ.100- రూ.200 అధికంగా వసూలు చేసి పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల పరిధిలో అక్రమ వసూళ్లు రూ.కోట్లకు చేరుకుంటాయని అంచనా.

**గ్రామాల్లో మరీ ఎక్కువ**


నందికొట్కూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఫ్రాంకింగ్ యంత్రం లేదు. అక్కడి రైతులు కర్నూలు, ఆత్మకూరుకు వెళ్తారు. ఆత్మకూరు వెండరు ఇటీవల కాలంలో అందుబాటులో లేకపోవడంతో వెలుగోడుకు వెళ్లాల్సి వస్తోంది. బనగానపల్లి, కొలిమిగుండ్ల, అవుకు ప్రాంతాలకు చెందిన వారు కోవెలకుంట్ల వెండర్‌పై ఆధారపడుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల రైతులు ఆదోనికి, కోడుమూరు రైతులు కర్నూలు కార్యాలయాలకు వెళ్లాల్సిందే. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు వెండర్లు ఒక్కొక్కరి నుంచి రూ.200 కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

**ఎక్కువ మొత్తం తీసుకుంటున్నారు**నా కుమారుడి పేరు మీద పంట రుణం తీసుకోవాలని నంద్యాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి ఫ్రాంకింగ్‌కు వెళ్తే రూ.వెయ్యికి అదనంగా రూ.100 వసూలు చేశారు. కార్యాలయంలో రద్దీ అధికంగా ఉండటంతో సిబ్బంది అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. రైతుల అవసరాల ను ఆసరాగా చేసుకుని అదనంగా వసూలు చేస్తున్నారు. ఎన్‌సీ మోహన్‌రెడ్డి, నంద్యాల

# కొత్తగా రుణం.. ఉపాధికి ఊతం..!

జంగారెడ్డిగూడెం : అయిదేళ్ల వైకాపా పాలనలో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. ఆ శాఖ నుంచి ఎటువంటి సహాయం ఎస్సీ సామాజిక వర్గ యువత పొందలేదు. చివరకు ఉపాధి యూనిట్లను సైతం రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కార్పొరేషన్‌కు పునర్ వైభవం తెచ్చేందుకు యత్నిస్తోంది. అర్హులకు ఉపాధి రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ మొదలైంది. నిలిచిన కార్యకలాపాలు మళ్లీ మొదలయ్యాయి. ఈ క్రమంలో ఉపాధి రుణ బకాయిల వసూళ్లు చేపట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు బృందాలను ఏర్పాటు చేసి వసూళ్లు ప్రారంభించారు. ముందు నోటీసులు జారీ చేస్తున్నారు. వసూలైన మొత్తాలతో కొత్త వారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంది.

**581 యూనిట్లు..** ఉమ్మడి జిల్లాలో 2017 నుంచి 2019 వరకు 581 మందికి వివిధ యూనిట్లను మూడు కేటగిరీలుగా రూ.23.65 కోట్లు ఉపాధి రుణాలుగా పొందారు. వీటిలో స్వయం ఉపాధి విభాగం ద్వారా బ్యూటీ పార్లర్, మెడికల్ స్టోర్, టెంట్ హౌస్ తదితర యూనిట్లు ఇచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ఇన్నోవా, ఇథియోస్ కార్లు ఇచ్చారు. ఇతర విభాగంలో ఆటోలు, ట్రక్ ఆటోలు, చిన్న కార్లు ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.15.36 కోట్లను లబ్ధిదారులు తిరిగి చెల్లించారు. ఇంకా రూ.8.29 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వీటికి రెండు నెలలు గడువు నిర్ణయించి ఈ లోగా వసూలు చేయాలన్న యోచనతో కార్యాచరణ చేపట్టినట్లు



ఈడీ ముక్కంటి చెప్పారు.

**నగదు ఇవ్వకండి..** ఈ బకాయిలకు సంబంధించి ఎవరికీ నగదు ఇవ్వవద్దని ఈడీ ముక్కంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎస్‌బీఐలో ఉన్న ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ ఖాతా నంబరు 62084455544లో జమ చేయాలన్నారు. లేకుంటే డీడీ తీసి ఏలూరులోని తమ కార్యాలయంలో అందజేయాలని ముక్కంటి లబ్ధిదారులకు సూచించారు.

# ఐదేళ్ల నిర్లక్ష్యం.. పొంగిపొర్లుతోంది

గూడూరు : స్వర్ణముఖి నది వరదలపై ఆందోళన వ్యక్తమవుతోంది. పెళ్లకూరు నుంచి వాకాడు మండలం పామంజి వరకు నదికి ఇరువైపులా పొర్లుకట్టలతో ప్రమాదం పొంచి ఉంది. పలుచోట్ల పూర్తిగా లేకపోగా మరికొన్నిచోట్ల 2015, 2023లో వచ్చిన వరదలకు కొట్టుకుపోయాయి. ఇంకొన్ని కట్టలు బలహీనంగా ఉండటంతో వరదనీరు పోటెక్కి పలు గ్రామాల ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచిఉంది. ఐదేళ్ల వైకాపా పాలనలో కట్టల పరిస్థితిని పట్టించుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణం. కూటమి ప్రభుత్వంలోనైనా సత్వరం ప్రత్యేక దృష్టి పెట్టకపోతే వరద ముంపు ఘటనలు పునరావృతం కాకతప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నేటికీ అసంపూర్తిగా**

జిల్లాలో పెళ్లకూరు, నాయుడుపేట మండలాల పరిధిలోని కూచివాడ, అన్నమేడు, మర్లపల్లి, వేముగుంటపాలెం, చిట్టమూరు మండలంలోని గునపాడు, మెట్టు, కోట మండలంలోని గూడలి, దైవాలదిబ్బ, పుచ్చలపల్లి, వాకాడు మండలంలోని వెంకటరెడ్డిపాలెం, బాలిరెడ్డిపాలెం, పామంజి ప్రాంతాల్లో కట్టల పరిస్థితి దారుణంగా ఉంది. పలుచోట్ల నదిలో నుంచి ఇసుక అక్రమ తరలింపులకు కట్టలను అక్రమార్కులు ధ్వంసం చేశారు. బాలిరెడ్డిపాలెం వద్ద 2023లో వచ్చిన వరదలకు పొర్లుకట్టకు గండిపడి తీవ్ర నష్టం వాటిల్లింది. దాంతో రూ.1.70 కోట్లు వెచ్చించి గోడ నిర్మాణ పనులు మొదలు పెట్టినా నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కోట మండలం దైవాలదిబ్బ వద్ద కట్ట



ప్రమాదకరంగా ఉంది. చిట్టమూరు మండలం మెట్టు వద్ద అప్పట్లో పనులను అసంపూర్తిగా వదిలేయడంతో కొంత దూరం కట్ట నిర్మించలేదు. రానున్న వర్షాకాలంలో నదికి భారీగా వరదనీరు వస్తే ఈ ప్రాంతాలు ముంపునకు గురవుతాయని స్థానికులు అంటున్నారు.

**పనుల తీరిలా..**

నాయుడుపేట నుంచి గూడలి వరకు నదికి రెండు వైపులా 30 కి.మీ మేర కట్ట పనులను రూ.86 కోట్లతో 2014లో మొదలు పెట్టగా, 46 శాతం పనులను మాత్రమే చేసి మిగిలినవి అసంపూర్తిగా వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో కట్టల్లేక ప్రమాదంగా కనిపిస్తోంది. అలాగే వాకాడు బ్యారేజీ నుంచి పామంజి వరకు నదికి కుడివైపున రూ.23 కోట్లతో 2014లో పనులను చేపట్టగా, 2023 వరదలకు పలుచోట్ల కట్టలకు గండ్లు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈవిషయమై జలవనరుల శాఖ గూడూరు ఈఈ బాబును వివరణ కోరగా కట్టల పనులు చేపట్టేందుకు డీపీఆర్ స్థాయిలో ఉన్నాయని, తర్వాత పనులకు అంచనాలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేస్తారన్నారు.

# చరిత్ర పుటల్లో... సంగ్రామ ఘట్టాల్లో..

విశాఖపట్నం: భరతమాత ముద్దు బిడ్డ. విప్లవాన్ని రగిలించిన అఖండ వీరుడు. ఆంగ్లేయులపై స్వాతంత్ర్య సమరాన్ని సాగించిన విప్లవ ధీరుడు అల్లూరి సీతారామరాజు. ఆయన 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలో జన్మించారు. అటువంటి తెలుగు వీరుడి చరిత్రను భావి తరాలకు అందించేలా నేటికీ ఆ గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయలేదు. నేడు అల్లూరి జయంతి. ఈ సందర్భంగా పాలకులు, అధికారులు గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు గుర్తు చేస్తున్నారు.

**శత జయంతికి ఓ వెలుగు:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సమరయోధుల గౌరవార్థం వివిధ సంస్థలు, ప్రాజెక్టులకు వారి పేర్లు పెట్టి చిరస్థాయిగా నిలిచిపోయేలా ప్రభుత్వాలు కొన్ని చోట్ల చర్యలు చేపట్టాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామ రాజు స్వగ్రామం మాత్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఆయన జయంతి, వర్ధంతి వేడుకలకు విచ్చేసే నాయకులు హామీలివ్వడం తప్ప చేసింది శూన్యం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం మినహాయింపు కాదు. 1996లో పాండ్రంగిలో ప్రభుత్వం అల్లూరి శత జయంతి ఉత్సవాలను నిర్వహించడంతో ఆ గ్రామం కొంత వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి నాయకులు, అధికారులు జయంతికి వచ్చి వెళ్లిపోవడం తప్ప ఆ తర్వాత మహనీయుడ్ని స్మరించుకున్న సందర్భాలు చాలా అరుదు.

**నలుగురు ఎమ్మెల్యేలు**

భీమిలి నియోజకవర్గంలో సమితులు తర్వాత ఇప్పటి వరకు నలుగురు ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఇందులో అత్యధికంగా పాండ్రంగి గ్రామానికి చెందిన ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహారాజు (తెదేపా) 20 సంవత్సరాలు వరుసగా ఎన్నికయ్యారు. తర్వాత కర్రి సీతారాం, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు ఎమ్మెల్యే పదవులు పొందారు. వీరందరి హయాంలో పాండ్రంగిలో అల్లూరి సామాజిక వేదిక, విగ్రహం, జన్మ గృహం పునర్నిర్మాణం తప్పితే చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ లేదు. పర్యాటకులు ఎవరైనా వచ్చినా వీటిని చూసి వెళ్లిపోవడం తప్ప కనీసం అతని గురించి తెలుసుకునేందుకు మ్యూజియం సైతం లేదు. ఇంకా చెప్పాలంటే కూర్చోవడానికి సిమెంట్ బెంచీలూ లేవు. దీంతో వచ్చిన వారు ఎంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించాలంటే పాండ్రంగి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

# తడ'బడి'తే తంటా..

దేవరాపల్లి : ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని జాగ్రత్తగా బురదలో నడుస్తూ వస్తున్న వీరంతా దేవరాపల్లి మండలం చింతలపూడి శివారు నేరళ్లపూడి ప్రాథమిక పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు. పిల్లల చెయ్యి పట్టుకుని ముందు నడుస్తున్నది ఆ పాఠశాల ఉపాధ్యాయుడు. నేరళ్లపూడి పాఠశాల భవనం శిథిలమవడంతో గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలను దగ్గరలోని బోడిగరువు గ్రామానికి మార్చారు. ఈ పాఠశాలలో ఈ రెండు గ్రామాలతోపాటు అనంతగిరి, దేవరాపల్లి మండలాలకు చెందిన కొట్టెంగూడ, తట్టపూడి, మదనగరువు, కళ్యాణగుమ్మి తదితర గిరిజన గ్రామాలకు చెందిన 31 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బోడిగరువు పిల్లలు మినహా ఇద్దరు ఉపాధ్యాయులు సహా మిగతా పిల్లలంతా పాఠశాలకు నడిచి రావలసిందే. వీరు వచ్చే మార్గం జారుడు మట్టితో కూడుకున్నది కావడంతో వర్షం పడితే చాలు... పాఠశాలకు చేరడానికి పెద్ద సాహసమే చెయ్యాల్సి వస్తోంది. పాఠశాలకు వెళ్లేటపుడు, తిరిగి వచ్చేటపుడు ఉపాధ్యాయుల్లో ఒకరు ముందు.. మరొకరు వెనుక ఉండి పిల్లల చేతులు పట్టుకుని జారిపడకుండా జాగ్రత్తగా నడిపించుకుంటూ వెళ్తున్నారు.

# అభ్యంతరం లేదంటే.. ఇక ముందుకే!!

విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)-2041 బృహత్తర ప్రణాళిక రూపకల్పన అస్తవ్యస్తంగా సాగింది. రహదారులను ఎక్కడెక్కడ... ఏ మేరకు ప్రతిపాదించారో తెలియక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. వార్డు కార్పొరేటర్లదీ అదే పరిస్థితి. ఎంతమేర స్థలాలు కోల్పోవాల్సి వస్తుందో కూడా తెలియడం లేదు. ఈ మాస్టర్‌ప్లాన్ పునః పరిశీలనకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు గత నెలతో గడువు ముగియగా తాజాగా ఈ నెల 17వ తేదీ వరకు పెంచారు. అసలు రోడ్లపై స్పష్టత వస్తేనే అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం కలుగుతుందని ప్రజలు చెబుతున్నారు. వాటిపై అవగాహన కూడా కల్పించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన వివరాలను వీఎంఆర్‌డీఏ అందుబాటులో ఉంచింది.

**'2041 బృహత్తర ప్రణాళిక'లో ప్రతిపాదించిన తీరిది:**

వాల్తేరు వార్డులోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి నౌరోజి రోడ్డును కలిపే మార్గం ప్రస్తుతం 12 మీటర్లుగా ఉంది. 2041 ప్రణాళికలో 30 మీటర్లకు ప్రతిపాదించారు.గాజువాక నుంచి మద్దిలపాలెం కూడలి వరకున్న రోడ్డు కొన్ని చోట్ల 30, మరికొన్ని చోట్ల 40 మీటర్లుంది.



దీన్ని రెట్టింపు చేయాలనుకున్నారు. 24 నుంచి 30 మీటర్ల వెడల్పుతో ఉన్న అనకాపల్లి-గాజువాక, మద్దిలపాలెం-ఆనందపురం రోడ్లను 80 మీటర్లకు విస్తరించాలని నిర్ణయించారు.

జగదాంబ కూడలి నుంచి ఆర్కే బీచ్ వరకున్న 18 మీటర్ల రోడ్డును 30 మీటర్లకు

దత్‌ఐలాండ్ నుంచి ఆశీల్‌మెట్ట కూడలి వరకు 24 మీటర్ల వెడల్పుతో ఉన్న రోడ్డును 45 మీటర్లకు

గోశాల నుంచి వేపగుంట వరకు 30 నుంచి 36 మీటర్లతో ఉన్న మార్గాన్ని 60 మీటర్లకు

18 మీటర్ల తాటిచెట్లపాలెం కూడలి-రైల్వేస్టేషన్ రోడ్డును 45 మీటర్లకు

18 మీటర్ల అక్కయ్యపాలెం-రైల్వే న్యూకాలనీ మార్గం 30 మీటర్లకు, పెదవాల్తేరు-సిరిపురం రోడ్డును 30 మీటర్లకుబీ

వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా-బీచ్ రోడ్డును 18 మీటర్ల నుంచి 30 మీటర్లకు విస్తరించాలని ప్రతిపాదించారు.

**ప్రత్యేకంగా స్వీకరిస్తాం..**

2041- బృహత్తర ప్రణాళికపై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంచాం. ఇప్పటివరకు 2 వేల అభ్యంతరాలు వచ్చాయి. వీటి పరిశీలనకు ప్రభుత్వం ఏడుగురితో కమిటీ ఏర్పాటు చేసింది. వీరు అభ్యంతరాలను నిశితంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. నగర పరిధిలో కీలకమైన 31 రహదారులకు సంబంధించి ప్రతిపాదనలు చేశారు. ఎక్కడెంత విస్తరిస్తున్నారో అందరికీ తెలియజేస్తున్నాం. ఈ నెల 16, 17 తేదీల్లో విశాఖ జిల్లాకు సంబంధించి ప్రత్యేకంగా వినతులు స్వీకరిస్తాం. ఈసారి వచ్చిన అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరిస్తాం' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు.

# 'భూ'చోళ్ల చేతిలో 'సీతాకోక చిలుక'?!

విశాఖపట్నం : మధురవాడ వద్ద ఉన్న సీతాకోక చిలుక పార్కు (బటర్ ఫ్లై పార్కు) భూములపై మళ్లీ ప్రైవేటు వ్యక్తుల కన్నుపడింది.వైకాపా హయాంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు యత్నించినా సఫలం కాలేదు. తాజాగా మళ్లీ వారికి అప్పగించేందుకు అనువుగా మున్సిపల్ శాఖ ఇటీవల మెమో జారీ చేయడం జీవీఎంసీలో చర్చనీయాంశమైంది.

**అసలు కథ ఇది..**

మధురవాడలో 1.05 ఎకరాల స్థలం 'లే అవుట ఓపెన్ స్పేస్' కింద ఉంది. 2023లో జీవీఎంసీ రూ.1.96కోట్లతో పార్కు నిర్మాణం ప్రారంభించింది. ఈ స్థలానికి వెనుక తగినంత మార్గం లేని రెండు ఎకరాల స్థలం ఉంది. అందువల్ల పట్టణ ప్రణాళిక విభాగం ప్లాను కూడా మంజూరు చేయలేదు. పార్కు పూర్తిగా నిర్మిస్తే తమ స్థలం నిరుపయోగంగా మారుతుందని గ్రహించిన యజమానులు అప్పటి వైకాపా పాలకవర్గాన్ని సంప్రదించారు. ప్రైవేటు స్థలంలో 484.39 చదరపు గజాలు పార్కు కోసం తీసుకుని, రోడ్డుకు ఆనుకుని ఉన్న పార్కు స్థలం తమకు ఇవ్వాలని కోరారు. దీని వల్ల జీవీఎంసీ పార్కు రూపు అస్తవ్యస్తంగా మారుతుంది. ప్రైవేటు వ్యక్తులకు మాత్రం రెండెకరాలకు రోడ్డు పక్క నుంచి దారి వస్తుంది. అక్కడ గజం స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో భారీగా పెరుగుతుంది. ఇలా ప్రైవేటు వ్యక్తుల స్థలం విలువ రూ.20కోట్ల నుంచి ఒక్కసారిగా రూ.150 కోట్లకు పెంచుకునేలా అప్పట్లో పావులు కదిలాయనే ఆరోపణలు న్నాయి.

1 కౌన్సిల్ వేదికగా పోరాటం: 'సీతాకోక చిలుక' పార్కుకు చెందిన స్థలం



ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వవద్దని కౌన్సిల్ వేదికగా తెదేపా, జనసేన పోరాడాయి. అయినా వైకాపా కార్యవర్గం స్థల మార్పిడి అంశాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. దానిని సవాల్ చేస్తూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోర్టును ఆశ్రయించారు. దీంతో స్థల మార్పిడి ప్రక్రియ నిలిచిపోయింది. ప్రతిపాదనలను తిరస్కరించినట్లు 2024లో ప్రభుత్వం మెమో జారీ చేసింది. స్థలం మార్చడానికి ఎలాంటి తదుపరి చర్యలు తీసుకున్నా, తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.

2 మళ్లీ ఇప్పుడు: ఈ పార్కు స్థలం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వదలిస్తే మళ్లీ కౌన్సిల్ ఆమోదం తరువాత ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. అయితే కౌన్సిల్ ఆమోదం లేకుండా ఈ ఏడాది మే నెలలో మెమో జారీ కావడం గమనార్హం. సీతాకోక చిలుక పార్కుకు చెందిన స్థలం 484.39 చదరపు గజాలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి అనువుగా తదుపరి చర్యలు చేపట్టాలనేది అందులోని సారాంశం. ఈ వ్యవహారం మున్సిపల్, జీవీఎంసీ అధికారులకు తప్ప బయట వ్యక్తులకు తెలియకుండా గోప్యత పాటించారు. జీవీఎంసీకి నష్టం కలిగే ఈ తరహా వ్యవహారాలను ప్రభుత్వం నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు.

# నిర్ధారణ పేరు.. దోపిడీ జోరు



భీమవరం : వాతావరణంలోని మార్పు.. చిన్నపాటి జ్వరమొచ్చినా వస్తున్న అనుమానాలు కొందరు ప్రైవేటు వైద్యులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రజల అనారోగ్య ఆందోళనే అదనుగా దోపిడీకి తెరదీస్తున్నారు. సాధారణ జ్వరానికి రూ.వేలల్లో ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు తల్లడిల్లుతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరిట దోచుకోవడం పరిపాటిగా మారింది.

**నీరసానికి రూ.50వేలు**

తరచూ కళ్లు తిరుగుతున్నాయని తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వెళ్లగా ఎటువంటి పరీక్షలు చేయకుండానే ఐసీయూకి తరలించారని, తర్వాత పరీక్షలు, ఇతర చికిత్సల పేరుతో రూ.50 వేలు బిల్లు వేశారని తణుకుకు చెందిన ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు.

**జ్వరానికి రూ.70వేలు**

జ్వరంగా ఉందని తాడేపల్లిగూడెం పట్టణం రామారావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా వివిధ పరీక్షలు చేశారు. మందులిస్తూనే అయిదు రోజులకు రూ.70వేలు బిల్లు వేశారని, ఇంకా పరీక్షలు చేయాలని అంటున్నారని, ఇంకా ఎంత ఖర్చవుతుందోననే భయం వెంటాడుతుందని సుబ్బారావుపేటకు చెందిన ఎన్.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, నర్సింగ్ హోంల పేరిట వెలిసిన ఆసుపత్రుల్లో పరీక్షల పేరుతో దోపిడీకి దిగుతున్నారు. డెంగీ నిర్ధారణకు ఎలీసా పరీక్షలు ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే నిర్ధారణ చేయాల్సి ఉండగా కొంతమంది వైద్యులు పరీక్షల పేరుతో దోచుకుంటున్నారు. ఇటీవల డెంగీ లేకుండానే వైద్యం చేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ఓ ఆసుపత్రి యాజమాన్యంపై కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ రుసుములు, ల్యాబ్, ఇతర అన్నింటి రుసుముల బోర్డుల ప్రదర్శన చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా కొంతమంది వైద్యుల తీరులో ఏ మాత్రం మార్పు రావడం లేదు.

**ప్లేట్‌లెట్ల బూచిని చూపిస్తూ**

వాతావరణంలోని మార్పులతో కొంతమందికి దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు రాగానే సహజంగానే శరీరం వేడెక్కుతోంది. ప్రభుత్వాసుపత్రులున్నా చాలామంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో సాధారణ జ్వరమైనా డెంగీ అనుమానం వ్యక్తం చేసి, పరీక్షలు రాసేస్తున్నారు. ప్లేటలెట్ల సంఖ్య తగ్గాయంటూ భయం రేపుతున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని ఒక్కో రోగి నుంచి ల్యాబ్, ఆసుపత్రి ఛార్జీలు, మందులు కలిపి కనిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నారు. 'ప్రజలు జ్వరంపై భయాన్ని వీడి ప్రభుత్వాసుపత్రుల సేవలను వినియోగించుకోవాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో రుసుముల ప్రదర్శనపై నూతన విధానాలు రూపొందించి ఆసుపత్రులకు పంపించాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం' అని డీఎంహెచ్‌వో గీతాబాయి తెలిపారు.

# చుక్‌చుక్.. ఇక పనులు చకచకా



అమలాపురం : కోనసీమ వాసుల చిరకాల స్వప్నం నెరవేరే పరిస్థితి కనిపిస్తోంది. కోటిపల్లి - నరసాపురం మధ్య రైలు కూత వినిపించేందుకు మార్గం సుగమం అయిందని రైల్వే అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు నెలకొన్న కొన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగాయని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ముందుకెళ్లడమే తరువాయని స్పష్టం చేస్తున్నారు. అలైన్‌మెంట్‌పై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా స్టే విధించడంతో ఆ మధ్య పనులు నిలిచిపోయాయి. తాజాగా ఆ స్టేను ఎత్తివేశారని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు. అయినవిల్లి మండలం శానిపల్లిలంక వద్ద గోదావరిపై వంతెన నిర్మించే ప్రాంతంలో సామగ్రి నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కలెక్టర్ మహేశ్‌కుమార్ చొరవ చూపి సమస్య పరిష్కరించారు. దీంతో వాటికి అడ్డంకులు తొలగాయి. ఇక రైల్వే లైను పనులు ఊపందుకోవడమే తరువాయి.

**రెండు ప్రాంతాల పరిధిలో..** రైల్వే లైన్ వల్ల అమలాపురం మండలం భట్నవిల్లి నుంచి పేరూరు వరకు, మలికిపురం మండలం గుడిమెల్లంక వద్ద విలువైన భూములు కోల్పోతున్నామని పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక 2003-04లో సేకరించిన వాటికి అప్పట్లో పరిహారం చెల్లించినా భూములు స్వాధీనం చేసుకోలేదు. ప్రాజెక్టు పట్టాలెక్కుతున్న నేపథ్యంలో తాజా భూసేకరణ ధరలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**భూసేకరణ ఇలా..**

కోటిపల్లి - నరసాపురం రైల్వేలైన్‌లో కోటిపల్లి నుంచి అమలాపురం వరకు 12.07 కి.మీ., అమలాపురం - నరసాపురం మధ్య 45.17 కి.మీ మేర రైల్వే ట్రాక్ ఏర్పాటు (మొత్తం 57.21 కి.మీ) కానుంది. కోనసీమ జిల్లాలో 45.65 కి.మీ, పశ్చిమ గోదావరిలోకి 11.55 కి.మీ వస్తుంది. రైల్వే లైనుకు 26 గ్రామాల పరిధిలో 351.77 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటికి ఎనిమిది గ్రామాల పరిధిలో 112.86 హెక్టార్లు సేకరించి రైల్వే శాఖకు అప్పగించారు. పేరూరు, పాశర్లపూడి, గుడిమెల్లంక వద్ద మూడు వంతెనలకు 24.10 ఎకరాలు తీసుకున్నారు. 18 గ్రామాల పరిధిలో 238.91 హెక్టార్లు ఇంకా సేకరించాల్సి ఉంది. రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా 13 గ్రామాల పరిధిలో 161 హెక్టార్లలో సర్వే చేశారు. మరో అయిదు గ్రామాల పరిధిలోని 75.96 హెక్టార్లకు సంయుక్త సర్వే చేపట్టాల్సి ఉంది. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో వేగం పెరగనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

"కోటిపల్లి- నరసాపురం మధ్య రైల్వే నిర్మాణ పనులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులు తొలగాయి. భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి మాకు స్వాధీనపరచగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం." అని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు.

# పోటెత్తే వాగులు.. దారివ్వని గోదారి!



పోలవరం : పోలవరం వద్ద నిర్మించిన కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను ఆనుకుని.. సుమారు 1500 ఎకరాలు ఏటా ముంపు బారిన పడుతున్నాయి. స్లూయిస్ తలుపుల ద్వారా కొండవాగుల వరద గోదావరిలో చేరాల్సి ఉంది. అయితే ఆ తలుపులు గోదావరి వరదల సమయంలో మూసుకునిపోవడంతో వరద స్లూయిస్ వెనుకభాగంలోని పంట పొలాలను ముంచెత్తుతోంది. నదిలో వరద తగ్గినప్పటికీ.. పంట భూములు రోజుల తరబడి ముంపులోనే ఉండటంతో సాగు భారమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.**ఎత్తిపోతలతోనే పరిష్కారం..** పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాల కోసం ప్రభుత్వం రైతుల నుంచి సుమారు 350 ఎకరాలు సేకరించి డంపింగ్‌యార్డు, పైపులైన్ నిర్మాణం కోసం ఉపయోగించుకున్నారు. దీంతో సుమారు 1500 ఎకరాల్లో ఆ మేరకు విస్తీర్ణం తగ్గి ముంపు ముప్పు పెరిగింది. గోదావరిలోకి వరద నీటిని ఎత్తిపోసే విధంగా ఎత్తిపోతల నిర్మిస్తే తప్ప ఇక్కట్లు తీరే పరిస్థితి లేదు.

**కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..** కూటమి ప్రభుత్వం రాకతో ఎత్తిపోతల పథకం నిర్మాణంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టరు వివిధ శాఖల అధికారులతో నియమించిన కమిటీ సభ్యులు ముంపు సమయంలో పరిస్థితిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఎత్తిపోతల పథకం ఆవశ్యకత తప్పనిసరని పేర్కొంటూ నాటి ప్రభుత్వానికి నివేదిక అందజేసినా ఫలితం లేకపోయింది.

**పెరుగుతున్న వరద**

నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు ఉప నదుల ద్వారా గోదావరికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం సాయంత్రానికి నీటి మట్టం 27.45 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 1.35 లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా దిగువకు వెళ్తున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

రూ.47 కోట్లతో ప్రతిపాదనలు.. అఖండ గోదావరి కుడిగట్టు (ఏజీఆర్‌బీ) పర్యవేక్షణ ఏఈ మణికంత మాట్లాడుతూ ఎత్తిపోతల నిర్మాణానికి రూ.47 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను రూపొందించి ఇటీవల ప్రభుత్వానికి నివేదించామన్నారు.

# అడ్డంగా దోచేందుకు.. 'అడుగు'పెట్టారు!!

విశాఖపట్నం : నగర పరిధిలో పచ్చదనం పెంపునకు జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా... ఆయా పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలా వరకు నిధులు వృథా అవుతున్నాయి. ఈ క్రమంలో అక్రమార్కులతో కొందరు అధికారులు చేతులు కలుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ.36 లక్షలతో:** నగరంలోని పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ స్థలంలోని మూడు చోట్ల మొక్కలు పెరగడానికి వీలుగా అడుగు మేర నాణ్యమైన మట్టి పోయడం, బోరు, ఇతర పనులు చేపట్టడానికి రూ.36 లక్షలతో టెండర్ పిలిచారు. ఈ పని ఉద్యానవన విభాగానికి చెందినది. అయినా జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ఉద్యానవన విభాగ నిబంధనల మేరకు చేయించాలి. ఇద్దరు గుత్తేదారులు పని దక్కించుకోవడానికి టెండర్లు దాఖలు చేశారు. అందులో ఒకరికి పనులు దక్కాయి. ప్రతిపాదించిన మొత్తం నిధుల్లో 33 శాతం తక్కువకు...అంటే రూ.24.12లక్షలకు గుత్తేదారు పనులు దక్కించుకోవడం గమనార్హం.

**పరిశీలన ఎక్కడ:** మొక్కల పెరుగుదలకు అనుమైన మట్టిని పోశారా..?



లేదా..? అనే అంశాన్ని ఉద్యానవన విభాగం పరిశీలించకపోవడం గమనార్హం. గుత్త సంస్థకు, ఉద్యానవన పొరుగు సేవల సిబ్బందికి మధ్య సత్సంబంధాలు ఉండటంతో నాణ్యమైన మట్టి స్థానంలో రాళ్లతో కూడిన కంకర మట్టి పోసినా... బిల్లుల అనుమతికి దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు.

**నివేదిక కోరతాం:** 'టెండర్‌లో నిబంధనల ప్రకారం అడుగు మేర మట్టి వేయకుండా పనులు ఆపేయడంతో నోటీసు జారీ చేశాం. ప్రస్తుతం పోసిన మట్టి ఎంత ఎత్తులో ఉందో లెక్క కట్టి, నివేదిక సిద్ధం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం' అని జీవీఎంసీ సహాయ ఇంజినీర్ ఉష పేర్కొన్నారు.

**పైపైనే చల్లారు:** టెండర్ దక్కించుకున్న వారు మూడు ప్రాంతాలకు ఆరు లారీల్లో మాత్రమే మట్టి తీసుకొచ్చి చల్లారు. అడుగు మేర వేయాల్సిన మట్టిని, అంగుళం ఎత్తులో వేసి వదిలేశారు. మిగిలిన పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు ఆదేశిస్తున్నా... ఆ గుత్తేదారు పట్టించుకోకుండా, బిల్లుల కోసం వైకాపా ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి చేస్తుండటం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారంలో ఇంజినీరింగ్ అధికారులు ఎక్కడా తప్పునకు దొరక్కుండా, ఓ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మరో నోటీసు జారీ చేసి పనిని పూర్తిగా రద్దు చేయడంతో పాటు, గుత్త సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టే అవకాశం ఉన్నా... అధికారులు మాత్రం సమయం చూసి బిల్లులు చేసేందుకే ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత వర్షాలకు పాతమట్టి, పోసిన మట్టి కలిసిపోతుందని గుత్తేదారు అంచనా వేస్తూ.. జాప్యం చేస్తున్నారు.

# ఓబుళాపురం గనుల్లో రక్షణ కరవు!

రాయదుర్గం : ఓబుళాపురం ఇనుప గనుల్లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజంతోపాటు యంత్రాలకూ రక్షణ లేకుండా పోతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓబుళాపురం గనుల్లో సీజ్ అయిన సుమారు లక్ష టన్నుల విలువైన ఖనిజాన్ని అప్పటి ప్రజాప్రతినిధి అండతో అమ్మేసుకున్నారు. ఐదేళ్లపాటు నిరంతరం సాగిన ఖనిజం చోరీని పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారు. తెదేపా నాయకులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖనిజం చోరీకి గురికావడం వాస్తవమేనని తేల్చారు. తర్వాత అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. సీబీఐ సీజ్ చేసిన టిప్పర్లు, పొక్లెయిన్లు, ఇతర వాహనాలను అక్కడికక్కడ తక్కుగా మార్చి కర్ణాటకలో అమ్మేసుకుంటున్నారు. తాజాగా బళ్లారికి చెందిన ముఠా సభ్యులు తుక్కుగా మారుస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

**దొంగ చేతికి తాళాలిచ్చినట్లు..**

ఓఎంసీలో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారనే అభియోగంతో సీబీఐ అక్కడున్న ఇనుప ఖనిజంతో పాటు యంత్రాలను 2011లో సీజ్ చేసింది. అప్పటి ప్రభుత్వ నిర్వాకం కారణంగా సీజ్ చేసిన వాటికి ఓఎంసీ కంపెనీ సిబ్బందినే కాపలాగా పెట్టారు. దీంతో దొంగ చేతికి తాళాలిచ్చినట్లు అయింది. గతంలో ఓఎంసీలో పనిచేసిన వ్యక్తి వైకాపా ప్రజాప్రతినిధిగా ఉండటంతో స్థానిక నాయకులు రెచ్చిపోయారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో టిప్పర్ల ద్వారా ఖనిజాన్ని ఫ్యాక్టరీలకు తరలించి జేబులు నింపుకొన్నారు.

**పట్టించుకోని పోలీసులు**

ఖనిజం, యంత్రాలు చోరీకి గురవుతున్నాయయని ఓఎంసీ కేసులో సాక్షిగా ఉన్న టప్పాల్ శ్యాంప్రసాద్ వైకాపా హయాంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరకు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఫిర్యాదుపై నిర్లక్ష్యం చేసిన అప్పటి సీఐ, ఎస్‌ఐపై కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం వచ్చినా పోలీసుల్లో మార్పు కనిపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. **విడిభాగాలు చేస్తుండగా..ఏడుగురి అరెస్టు**

డి.హీరేహాళ్ మండలంలోని వివాదాస్పద ఓబుళాపురం ఇనుప గనుల ప్రాంతంలో సీబీఐ సీజ్ చేసిన హిటాచి యంత్రాన్ని ధ్వంసం చేసి అపహరణకు యత్నించిన ఏడుగురు పట్టుబడ్డారు. రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో సీబీఐ ముడి ఇనుప ఖనిజంతో పాటు తవ్వేందుకు వినియోగించిన పలు యంత్రాలను సీజ్ చేసి.. అక్కడే నిల్వ ఉంచింది. ఈ క్రమంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా సందూరు తాలూకా కురేకుప్ప గ్రామానికి చెందిన మారుతి, వీరేశ్, గాదిలింగప్ప, గణేశ్, బసవరాజు, ఉమాపతి, దొడ్డ బసప్ప కలిసి ఈనెల 2న హిటాచి యంత్రాన్ని గ్యాస్ కట్టర్లతో విడిభాగాలుగా మారుస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనాస్థలానికి చేరుకుని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ముఠా సభ్యులు యంత్రాల విడిభాగాలు తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ముఠాలోని వీరేశ్, ఉచ్చప్ప, ప్రకాశ్ పరారీలో ఉన్నారని.. పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐ వివరించారు. బొలెరో వాహనం, ఆటో, గ్యాస్ సిలిండర్లు, కట్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## చీరలో నభా వయ్యారాలు.. సో బ్యూటీఫుల్!

ట్రెడిషనల్ లుక్‌లో నభా నటేశ్ మెరిసిపోయింది. సోషల్ మీడియాలో షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్‌లో ఆమె బంగారు రంగు చీర, ఎర్ర మెరూన్ బ్లౌజ్‌తో చక్కగా అలరిస్తోంది. అరుణోదయ కాంతుల్లో సన్నివేశాలుగా కనిపించే ఈ ఫొటోలు ఇప్పుడు అభిమానుల మనసులను గెలుచుకుంటున్నాయి. రెట్రో టచ్‌తో మిళితమైన ఈ లుక్‌తో నభా అందాలను కొత్తగా ఆవిష్కరించింది. ఓ గది మూలలో కూర్చుని పుస్తకం చదివే ఫొటో, మరోక ఫొటోలో బెడ్ పక్కన మెల్లగా తలవంచిన స్టైల్%ౌ% ఇలా ప్రతి క్షణాన్ని ఒక సంగీత తరంగంలా రూపొందించింది నభా. ఈ ఫొటోలు ఫొటోగ్రాఫీ పరంగానూ, స్టైలింగ్ పరంగానూ కొత్తగా అనిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ లుక్‌కి బ్యాగ్రౌండ్‌లో ప్లే అయిన ఏఆర్ రెహ్మాన్ సంగీతం కలవలిసి మరింత మాయాజాలంగా చేసింది. నభా నటేశ్ తెలుగులో 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో హిట్ అందుకున్నా, ఆ తరువాత వరుస విజయాల్ని



అందుకోలేకపోయింది. ఒకింత గ్యాప్ తర్వాత మళ్లీ 'స్వయంభు' సినిమాతో రీ ఎంట్రీ ఇస్తోంది. 'స్వయంభు'లో నిఖిల్ సరసన యాక్షన్ పీరియాడిక్ డ్రామాలో కనిపించనుంది. ఇక 'డార్లింగ్' మూవీకి సంబంధించి ఇప్పటికే గ్లామర్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నభా నటేశ్ నటనపై నమ్మకంతో పాటు, తన ఫిజికల్ లుక్స్‌పైన కూడా బాగా ఫోకస్ పెట్టింది. రెగ్యులర్‌గా జిమ్ చేస్తూ తన ఫిట్‌నెస్‌ను మెయింటైన్ చేస్తోంది. అదే సమయంలో ఫొటోషూట్ల ద్వారా సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ముద్ర వేసుకుంటోంది. తాజాగా వచ్చిన ఈ ట్రెడిషనల్ సిరీస్ కూడా ఆమె ఇమేజ్‌కి కొత్త అర్థం చేకూర్చేలా మారింది. ఈ ఫొటోలపై అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ట్రెడిషనల్ లుక్స్‌లోనూ ఎంత అందంగా కనిపించవచ్చో నభా మరోసారి నిరూపించిందంటూ, అభిమానుల నుంచి మెచ్చుకునే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## కళావతి కసెక్కించే పెర్ఫార్మెన్స్ ఇస్తోందా!


బాలీవుడ్ వెబ్ సిరీస్ 'అక్క'తో కీర్తి సురేష్ ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. తిరుగుబాటు దారుల కుట్రలను తిప్పికొట్టే రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న సిరీస్ ఇది. ఇదే సిరీస్ తో ధర్మరాజ్ శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. యశ్ రాజ్ ఫిలింస్ ఈ సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఇందులో రాధిక ఆప్టే మరో కథానాయికగా నటిస్తుంది. అంటే రాధికతో కీర్తి సురేష్ పోటీ పడి నటించాల్సిన పరిస్థితి ఇది. ప్రస్తుతం సెట్స్ లో ఉన్న సిరీస్ గురించి మరిన్ని విషయాలు లీక్ అయ్యాయి. ఇందులో కీర్తి సురేష్ మాఫియా లేడీ డాన్ పాత్ర పోషిస్తుంది. కంటెట్ కాస్త బోల్డ్ గాను ఉంటుందని తొలి నుంచి ప్రచారంలో ఉంది. అలాంటి పెర్ఫార్మెన్స్ విషయంలో రాధికా ఆప్టే ఎక్కడా తగ్గదు. బోల్డ్ సన్నివేశాల ఎలివేషన్ పరంగా తనదైన మార్క్ వేస్తుంది. అలాగని కీర్తి సురేష్ కూడా ఎక్కడా



తగ్గలేదు. తొలుత రాధికతో పోటీ పడగలదా? అన్న సందేహం వ్యక్తమంది. కానీ ఆన్ సెట్స్ లో కీర్తి సురేష్ బోల్డ్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంటుందని నెట్ ఫ్లిక్స్ వర్గాల నుంచి లీకైంది. రొమాంటిక్ సన్నివేశాల్లో కీర్తి ఎక్కడా రాజీ లేకుండా నటిస్తుందిట. తెరపై ఆ సన్నివేశాలు సరికొత్త అనుభూతి పంచుతాయంటున్నారు. రాధికా ఆప్టే బోల్డ్ అప్పిరియన్స్ గురించి అందిరికీ తెలుసు. కానీ కీర్తి సురేష్ మాత్రం సినిమాల కోసమే అంత లిబర్టీ తీసుకోలేదు. అక్క సిరీస్ కోసం మాత్రం ఎక్కడా ఆలోచిం చకుండా నటిస్తుంది. బాలీవుడ్ లో స్ట్రాంగ్ కెరీర్ ని బిల్డ్ చేసుకునే ప్రక్రియలో భాగంగా రాజీ పడటం లేదు. పోటీని ఎదుర్కొని నిలబడాలంటే ఆ మాత్రం అప్పిరి యన్స్ తప్పనిసరిగా భావించి ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. మొత్తానికి 'అక్క' సిరీస్ లో సరికొత్త కీర్తిని చూడటం ఖాయమే.




## పెళ్లయిన హీరోయిన్ల సరసన ఎవరీ చందురూడు?



అతడు ఎప్పుడూ పార్టీల్లో తలమునకలుగా ఉంటాడు. యువ కథానాయికలతో కలిసి వైన్ గ్లాస్ ఒలకబోస్తుంటాడు. అగ్ర కథానాయికలు .. మిడిలేజీ నటీమణులతో లేదా లేజీ గాళ్స్ తో.. ఎప్పుడూ ఎంతో చనువుగా ఉండగలడు. అప్పటికే పెళ్లయిన టాప్ హీరోయిన్స్ తో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ లేదా వారితో కలిసి సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ సరసంగా మాట్లాడుతూ, మజాక్ చేస్తూ ఎప్పుడూ చర్చల్లో నిలుస్తాడు. మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చేంత స్టఫ్ అతడిలో ఏం ఉంది? అంటే దానికి సమాధానం ఈ ఫోటోగ్రాఫ్‌లు, వీడియోలు.

**బతకడానికి ఏం చేస్తాడు?....** ఈ స్పెషలిస్ట్ గాళ్స్ బోయ్ ఎవరో ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. అతడు ది గ్రేట్ ఒర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి. అతడు బతకడానికి ఏ జాబ్ చేస్తావ్? సంపాదన ఉందా? అంటూ వెంకీ మామను ప్రకాష్ రాజ్ నిలదీసినట్టు ప్రశ్నిస్తే.. దానికి సమాధానం లేదు. అతడు రిలయన్స్ కంపెనీలో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడని అంటారు.

కానీ అతడు నైట్ పార్టీల్లో సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ, భామలతో సరసమాడుతూ సంపాదిస్తానని చెబుతుంటాడు. ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో కూడా అర్థం కాని గందరగోళం సృష్టిస్తాడు. అయితే అతడు నైట్ పార్టీల్లో గొప్ప ఎంటర్ టైన్ మెంట్ ని అందిస్తూ ఆర్జిస్తాడని కొంత స్పష్టత వచ్చింది ఈ ఫోటోలు చూసాకే!

**నారీ నారీ నడుమ మురారి:** ఇలాంటి గజిబిజి లైఫ్‌లోను ప్రశాంతంగా జీవించే లేడీ గ్యాంగ్ మేన్ ఓర్హాన్ అవ్రతమణి బర్త్ డే నేడు. ఈ సందర్భంగా బాలీవుడ్ అందగత్తెలతో అతడు దిగిన సెల్ఫీలు, ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్ ని హోరెత్తిస్తున్నాయి. ఓర్హాన్ నారీ నారీ నడుమ ఏ రేంజులో నలిగిపోతున్నాడో చూపించే ఓ ఫోటోగ్రాఫ్ వీటిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో సైఫ్ ఖాన్ సతీమణి ది గ్రేట్ కరీనా కపూర్ ఖాన్, రణ్ వీర్ సింగ్ సతీమణి దీపిక పదుకొనేతో అతడి స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది.

నేటితరం కథానాయికలతోనే కాదు.. సీనియర్ భామలతో అతడు ఎంతో సరసంగా సరదాగా ఫోటో దిగాడు. దీనిని యూత్ వైరల్ గా షేర్ చేస్తున్నారు. అన్నట్టు ఒర్రీ వయసు ఎంత? అంటే.. ఇప్పుడు 30 వ బర్త్ డే చేసుకుంటున్నాడు.

**ఒర్రీ సిగ్నేచర్ మార్క్:** బాలీవుడ్ లో నైట్ పార్టీల నుంచి వచ్చే ప్రతి ఫోటోలో ఒర్రీ సిగ్నేచర్ మార్క్ ఫోజ్ ఎప్పుడూ చర్చనీయాంశం.

అతడు స్టార్లతో ఎంతో సరదాగా కలిసిపోతూ ఒక ప్రత్యేకమైన ఆహార్యంతో కనిపిస్తుంటాడు. అతడి రూపం, ఎక్స్ ప్రెషన్ ప్రతిదీ సందేహాలకు తావిస్తుంది. అతడిని ఇలా చూశాక, కొందరు గే అని కూడా కామెంట్ చేసారు. ఈ కామెంట్లకు అతడు చాలా సీరియస్ గా కౌంటర్లు కూడా వేసాడు. నెటిజనుల దూషణలకు ఒర్రీ సమాధానాలు కూడా గతంలో చర్చగా మారాయి. వివాదాలతో పాటు ప్రమోషన్ కూడా కొట్టేయడం అతడి ప్రత్యేకత.

## జాన్వీకపూర్ తో రామ్ చరణ్ లిప్ లాక్!



గురువులను బట్టే శిష్యులు తయారవుతారు. అందుకే ఎప్పటికైనా శిష్యుడు గురువునే మించిపోతాడంటారు. సుకుమార్–బుచ్చిబాబుల గురు శిష్యులను చూస్తుంటే ఇది నిజమయ్యేలా ఉంది. రొమాంటిక్ సన్నివేశాల విషయంలో సుకుమార్ ఎలివేషన్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. ఆ విషయంలో సుకుమార్ ఎక్కడా రాజీ పడడు.

'100 పర్సంట్ లవ్' లో తమన్నాని ఎంత అందంగా చూపించాడో? ఇప్పటికీ ఆ సన్నివేశాలు కళ్ల ముందు ఆడుతూనే ఉంటాయి. అటుపై 'ఆర్య 2'లో బన్నీ–కాజల్ అగర్వాల్ మధ్య పెదవి ముద్దుల యుద్ధం తెలిసిందే. రీసెంట్ గా 'పుష్ప' లో బన్నీ–రష్మికా మందన్నా మధ్య రొమాంటిక్ సన్నివేశాల గురించై తే చెప్పాల్సిన పనిలేదు. ఫీలింగ్స్ పాటే గానీ...ఫీలింగ్స్ వస్తున్నాయి సామీ అనే డైలాగ్ గానీ..కిడ్నాపింగ్ కారులో కిరికిరి సీన్ గానీ అన్నీ సుకుమార్ క్రియేటివిటీ నుంచి జాలువారినవే. అలాంటి గురువు వద్ద శిష్యరికం చేసిన బుచ్చిబాబు తన ట్యాలెంట్ ఏంటి? అన్నది తొలి సినిమా 'ఉప్పెన'తోనే చూపించాడు. సము ద్రం మధ్యలో జలజల పాటలో హీరో–హీరోయిన్ రొమాన్స్ పీక్స్ లో ఉంటుంది. అంతకు ముందు పరిచయ సన్నివేశాలు అంతే హైలైట్ అవుతాయి. అలా బుచ్చిబాబు కూడా తాను రొమాంటిక్ మేకర్ అని నిరూపించుకున్నాడు. అలాంటి బుచ్చిబాబు 'పెద్ది' విషయంలో కూడా ఆ ఛాన్స్ తీసుకున్నాడా? అంటే అవుననే తెలుస్తోంది. రామ్ చరణ్ –జాన్వీ కపూర్ జంటగా ఈ చిత్రాన్నితెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులోనూ ఘాటైన సన్నివేశాలకు ఏమాత్రం కొదవలేదుట. రామ్ చరణ్–జాన్వీ మధ్య కొన్ని ఇంటిమేట్ సీన్స్ ఉన్నాయంటున్నారు.

అలాగే ఓ స్ట్రాంగ్ లిపికిస్ కూడా సీన్ డిమాండ్ చేయడంతో తొలి షెడ్యూల్ లోనే చిత్రీకరించినట్లు తెలిసింది. ఇంత వరకూ ఈ విషయం బయటకు రాలేదు. జాన్వీ కి కూడా టాలీవుడ్ హీరోతో లిప్ కిస్ అనుభవం ఇదే తొలిసారి. దేవరలో ఎన్టీఆర్ తో నటించింది. కానీ కొరటాల శివ రొమాంటిక్ డైరెక్టర్ కాకపోవడంతో ఆ ఛాన్స్ లేకుండా పోయింది. ఇప్పుడా ఆ లెక్కలన్నీ పెద్దితో బుచ్చిబాబు సరి చేస్తున్నాడు.

## శాలినీ పాండే గ్లామర్ ఎటాక్.. ఈ లుక్ మాములుగా లేదు

టాలీవుడ్‌కు 'అర్జున్ రెడ్డి' సినిమాతో పరిచయమైన శాలినీ పాండే, మొదటి సినిమాతోనే యువతను ఆకట్టుకుంది. క్లాస్ అండ్ క్యూట్ గ్లామర్ తో అద్భుతంగా నటించిన ఆమె ఆ తర్వాత కొన్ని హిందీ సినిమాల్లో కూడా నటించింది. అయితే ఇటీవల గ్లామరస్ అవతారంలో షిఫ్ట్ అవుతూ, హీటెక్కించే ఫొటోషూట్లతో సోషల్ మీడియాలో దూసుకెళ్తోంది. తాజా ఫొటోషూట్‌లో శాలినీ వేసుకున్న వైట్ అవుట్‌ఫిట్ నెటిజన్లను షాక్‌కు గురిచేస్తోంది. తాజా ఫొటోలలో శాలినీ తెల్లటి తడిచిన డ్రెస్‌లో కెమెరాకు పోజులిస్తూ అదిరిపోయే లుక్‌ను ప్రదర్శించింది. వర్షంలో తడుస్తున్నట్టుగా, చెయ్యి జుట్టులో పెట్టుకొని, వశీకరణమైన చూపులతో దిగిన ఫోటోలు చూసిన వారంతా షాక్ అవుతున్నారు. ఇది నెమ్మదిగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక సినిమాల విషయానికి వస్తే, శాలినీ పాండే బాలీవుడ్



లో 'జయేశ్‌భాయ్ జోర్దార్' సినిమాలో రణవీర్ సింగ్ సరసన నటించింది. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినా, శాలినీ నటన ప్రశంసలు అందుకుంది. అందులోనూ ఆమె లుక్స్ కాస్త గ్లామర్ టచ్‌తో మారిపోవడం కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రస్తుతం ఆమె హిందీలో ఓ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తోంది. ఆ ప్రాజెక్ట్‌కి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. తన కెరీర్‌ను గ్లామర్‌తో స్టబ్లిష్ చేసుకోవాలని భావిస్తున్న శాలినీ, సినిమాలతో పాటు బ్రాండింగ్ ఫ్యాషన్ ఫొటోషూట్లపై కూడా ఫోకస్ పెడుతోంది. 'నేచురల్ బ్యూటీ'గా పేరొందిన శాలినీ.. ఇప్పుడు స్టయిలిష్ అవతారాలతో కూడా అభిమానుల్ని మాయ చేస్తోంది. ఆమె తాజా ఫొటోలకు 2 గంటలలోపే లక్షల్లో లైక్స్ రావడం సోషల్ మీడియాలో ఆమె క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పకనే చెబుతోంది. మొత్తానికి శాలినీ పాండే తన కెరీర్‌కు గ్లామర్‌తో కొత్త మలుపు తిరిపిస్తూ, రాబోయే రోజుల్లో తనకో ప్రత్యేక స్థానం సంపాదించుకునే ప్రయత్నంలో ఉంది. ఈ ఫోటోషూట్ చూసిన తర్వాత మాత్రం.. ఆమెకు మరిన్ని భారీ ఆఫర్లు వచ్చే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. మరి ఈ గ్లామర్ గాలివాన ఎంత వరకు ఆమెకు అవకాశాలను తెస్తుందో చూడాలి.

## మళ్లీ మాజీల నుంచి శ్రుతిహాసన్ కి సందేశాలా!

శ్రుతిహాసన్ ఇప్పుడు సింగిల్. బోయ్ ఫ్రెండ్స్ కి దూరంగా ఉంటూ సోలో లైఫ్ ని లీడ్ చేస్తోంది. తొలుత మైఖేల్ కోర్సేలోతో సహజీవనం..అటుపై శంతను హజారికాతో బాండింగ్ వ్యవహారం తెలిసిందే. ఆ రెండు బ్రేకప్ ల నుంచి చాలా అనుభవాలు నేర్చుకుంది. అలాగని ప్రేమకు పెళ్లికి పూర్తిగా దూరం ఉంటుందని కాదు. మళ్లీ తప్పకుండా లవ్ లో పడతానని హింట్ ఇవ్వనే ఇచ్చింది. మరి ఇప్పుడా ఇద్దరు మళ్లీ మెసెజ్ లతో టచ్ లోకి వస్తున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే డాడ్ కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్‌లో శ్రుతి హాసన్ గాయనిగా పాటలు పాడిన సంగతి తెలి సిందే. ఈనాడు సినిమా తర్వాత థగ్ లైఫ్ సినిమాలో శ్రుతి హాసన్ పాట పాడటం ఇదే. విన్ వెలి నాయకా అంటూ అమ్మడు ఆలపిం చింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఇచ్చింది. అప్పటి



నుంచి శ్రుతిహాసన్ ఫోన్ ఇన్ బాక్స్...వాట్సాప్ మెసెజ్ లతో నిండిపోయిందిట. ఇప్పటికీ మెసెజ్ లు వస్తూనే ఉన్నాయంది. తన పనితనాన్ని మెచ్చుకుంటూ వస్తోన్న సందేశాలు తనకెంతో సంతోషాన్ని అంది స్తున్నాయంది.

తనని ఇష్టపడే వాళ్లతో పాటు ఇష్టపడని వాళ్ల నుంచి కూడా మెసేజ్ లు వస్తున్నాయంది. దీంతో ఆ మెసెజ్ లు పంపిన వారిలో మాజీ ప్రేమికులు ఉన్నారంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ నెటి జనుడు నేరుగా శ్రుతి హాసన్ ని ఈ విషయం అడిగేసాడు. కానీ శ్రుతి హాసన్ నుంచి మాత్రం ఎలాంటి రిప్లై రాలేదు. మౌనం అర్ధాంగీకారం అంటారు. మరి నిజామా? కాదా? అన్నది శ్రుతి ధృవీకరించాలి. ప్రస్తు తం శ్రుతి హాసన్ కూలీలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడు ఓ కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకా కొన్ని సినిమాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536